



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 117 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ సోమవారం 9 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 117 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD MON 9 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# త్వరలోనే తెలంగాణలో ఉచిత స్కూటీలు

- విద్యార్థినులకు ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటీల పంపిణీ
- 2026 డిసెంబర్ నాటికి హైదరాబాద్‌లో 100 శాతం ఎలక్ట్రిక్ బస్సులు
- నగరంలోని డీజిల్ బస్సులు జిల్లాలకు తరలింపు
- ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుపై జీరో ట్యాక్స్ విధానం
- ప్రజాభవన్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు




**హైదరాబాద్ పెన్ పవర్:**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని విద్యార్థినులకు తీపి కబురు అందించారు. చదువుకునే ఆడబిడ్డల ప్రయాణ కష్టాలను తీర్చడంతో పాటు, వారిని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం తరపున ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటీలను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. ప్రజాభవన్‌లో ఘనంగా జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సీఎం.. మహిళా సాధికారతకు సంబంధించి పలు కీలక నిర్ణయాలను వెల్లడించారు. ఎన్నికల హామీ మేరకు... త్వరలోనే ఈ ఉచిత స్కూటీల పథకాన్ని అమలు చేస్తామని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు, గృహలక్ష్మి పథకం ద్వారా సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు అందిస్తూ ఆర్థికంగా అండగా నిలుస్తున్నామని గుర్తు చేశారు. ఇప్పుడు విద్యార్థినులకు ఉచిత స్కూటీలు ఇవ్వడం ద్వారా వారి విద్యకు, స్వావలంబనకూ మరింత తోడ్పాటు లభిస్తుందని పేర్కొన్నారు.

**హైదరాబాద్‌కు కాలుష్య విముక్తి**

నగరాన్ని కాలుష్యరహితంగా మార్చేందుకు మరో భారీ నిర్ణయాన్ని సీఎం ప్రకటించారు. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దడంలో కాలుష్యమే పెద్ద అడ్డంకిగా మారిందని, ఇది నాన్ లివింగ్ సిటీగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే 2026 డిసెంబర్ నాటికి హైదరాబాద్‌లో 100 శాతం ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. డిసెంబర్ 9వ తేదీలోపు నగరంలో డీజిల్ బస్సులు కనిపించవని, ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సులన్నింటినీ జిల్లాలకు తరలిస్తామని తెలిపారు. నగర ప్రజల కోసం ఏసీ ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడతామన్నారు.

అంతేకాకుండా, నగరంలో తిరిగే పెట్రోల్, డీజిల్ ఆటోలను కూడా ఎలక్ట్రిక్ వాహనాలుగా మారుస్తామని చెప్పారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేస్తే 'జీరో ట్యాక్స్' విధిస్తామని, ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను వెలుపలికి తరలిస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

**మహిళా జర్నలిస్టులకు సత్కారం**

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా మీడియా నిలుస్తోందని, ఆ వారధికి సారథులుగా ఉన్న మహిళా జర్నలిస్టులను సత్కరించుకోవడం సంతోషంగా ఉందని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ మహిళా జర్నలిస్టులను ఘనంగా సత్కరించారు. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలకు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు డిజిటల్ కరెన్సీ రూపంలో కానుకలు అందజేశారు. రెండేళ్ల ప్రజాపాలనలో వచ్చిన మార్పులకు ఆడబిడ్డలే ప్రత్యక్ష సాక్షులని, తన ప్రభుత్వానికి వారే బ్రాండ్ అంబాసిడర్లని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు.



## ఇళ్లలోంచి బయటికి రావొద్దు... ఇరాన్ ప్రజలకు అమెరికా హెచ్చరిక

- జనావాసాల మధ్య నుంచే క్షిపణుల ప్రయోగిస్తున్న ఇరాన్ సైన్యం
- ఇళ్ల నుంచి బయటకు రావొద్దంటూ ఇరాన్ పౌరులకు అమెరికా సూచన
- పౌరులను ఇరాన్ ప్రభుత్వం ప్రమాదంలోకి నెడుతోందని ఆరోపణ
- ఇప్పటికే స్వదేశానికి చేరిన 32 వేల మంది అమెరికన్లు
- సైనిక చర్యలు జరిగే చోట భద్రతకు గ్యారంటీ లేదన్న అమెరికా

మిగతా 2లో



## కాంగ్రెస్ నిర్ణయంతో ఇరాన్‌తో భారత్ సంబంధాలు దెబ్బతిన్నాయి

- అటామిక్ ఎనర్జీ ఏజెన్సీలో ఇరాన్‌కు వ్యతిరేకంగా నాటి యూపీఏ ఓటు వేసిందన్న రామచందర్ రావు
- యూపీఏ ఆరోజు తీసుకున్న నిర్ణయం ఇరుదేశాల మధ్య సంబంధాలను దెబ్బతీసిందని ఆగ్రహం
- గ్యాస్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టీకరణ
- ఇంధనం, గ్యాస్ నిల్వలు మన వద్ద ఉన్నాయని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:** 2005లో యూపీఏ ప్రభుత్వం ఇంటర్నేష నల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీలో ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటు వేసిందని, దీనితో 2012లో మనకు ఇరాన్ ఆయిల్ సరఫరా నిలిపివేసింది

మిగతా 2లో



## కొత్త హంగులతో తెలంగాణ శాసన మండలి భవనం ప్రారంభం

- తెలంగాణ శాసన మండలి నూతన భవనాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- అసెంబ్లీ ప్రాంగణంలోని పాత అసెంబ్లీ బిల్డింగ్‌లో ఇకపై మండలి సమావేశాలు
- రూ.30 కోట్లతో పాత భవనాన్ని ఆధునీకరించిన ప్రభుత్వం
- ఈసారి బడ్జెట్ సమావేశాలు ఈ కొత్త భవనంలోనే నిర్వహణ
- ఒకే ప్రాంగణంలో ఉభయ సభలు ఉండేలా రేవంత్ సర్కార్ నిర్ణయం

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ శాసనసభ ప్రాంగణంలోని చారిత్రక పాత అసెంబ్లీ భవనం ఇకపై శాసన మండలి (లెజిస్లేటివ్ కౌన్సిల్)గా సేవలు అందించనుంది. అత్యాధునిక హంగులతో ఆధునీకరించిన ఈ భవనాన్ని ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు. రాబోయే బడ్జెట్ సమావేశాలు ఈ కొత్త భవనంలోనే జరగనున్నాయి. నిజాం కాలం నాటి ఇండో-సార్సెనిక్ వాస్తుశైలిలో నిర్మితమైన ఈ భవనంలో గతంలో హైదరాబాద్ రాష్ట్ర అసెంబ్లీ, ఆ తర్వాత ఉమ్మడి ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరిగేవి. 2014 రాష్ట్ర విభజన తర్వాత దీనిని ఏపీ అసెంబ్లీకి కేటాయించారు.

మిగతా 2లో

## శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌకపై దాడి... అమెరికా ముందే హెచ్చరించిందా?

- వెంటనే నౌకను వదిలిపెట్టి వెళ్లాలని అమెరికా హెచ్చరించినట్లు వార్తలు
- నౌకలోని ఓ సిబ్బంది తన తండ్రికి ఫోన్ చేసి వెల్లడించడంతో వెలుగులోకి..
- కమాండర్ ఆదేశాలను ధిక్కరించి లైఫ్ బోట్లను ఆశ్రయించిన కొంతమంది నావికులు



**హైదరాబాద్ పెన్ పవర్:**శ్రీలంక దక్షిణ తీరంలో ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ దేనాపై దాడికి ముందు అమెరికా హెచ్చరికలు జారీ చేసిందా? అంటే అవుననే అంటున్నారు. గత నెలలో విశాఖపట్నంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకు వచ్చిన ఇరాన్ యుద్ధ నౌక తిరిగి వెళుతున్న సమయంలో అమెరికా జలాంతర్గామి దాడి చేసి ముంచివేసింది. అయితే దాడికి ముందు నౌకలోని సిబ్బందిని అమెరికా హెచ్చరించినట్లు తెలుస్తోంది.

మిగతా 2లో



## న్యూయార్క్ మేయర్ మమ్దానీ ఇంటి వద్ద బాంబుల కలకలం... ఆరుగురి అరెస్ట్

- న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం
- నిరసనల్లో స్క్రూలు, బోల్టులతో నింపిన పేలుడు పదార్థాల వినియోగం
- మమ్దానీ ఇంటిపై దాడికి యత్నం.. ఆరుగురు ఆందోళనకారుల అరెస్ట్
- ఆందోళన సమయానికి ఇంట్లో లేని మేయర్ దంపతులు
- ఘటనను ఇస్లామోఫోబిక్ చర్యగా ఖండించిన మేయర్ కార్యాలయం

మిగతా 2లో



## ఏ ఇంట్లో పుట్టినా మహిళలపై వివక్ష ఉంటుంది

- పెద్దకులం, చిన్నకులమంటూ ఏదీ లేదని మహిళలందరిదీ ఒకే కులమని వ్యాఖ్య
- మహిళలను ప్రతిరోజు గౌరవించాలన్న కవిత
- మహిళలు లేకుండా తెలంగాణ ఉద్యమం లేదన్న కవిత

**హైదరాబాద్ పెన్ పవర్:**పెద్దకులం, చిన్నకులమంటూ ఏదీ లేదని మహిళలందరిదీ ఒకే కులమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఏ ఇంట్లో పుట్టినా సరే వారిపై వివక్ష ఉంటుందని అన్నారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. 'గివ్ హర్ స్పేస్' పేరిట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,

మిగతా 2లో

## జేడీయూలో అధికారికంగా చేరిన నితీశ్ కుమార్ తనయుడు

- పాట్నాలోని పార్టీ కార్యాలయంలో నిశాంత్ కుమార్ ను ఘనంగా ఆహ్వానించిన సీనియర్ నేతలు
- తండ్రి మార్గదర్శకత్వంలోనే బీహార్ అభివృద్ధికి పనిచేస్తానని నిశాంత్ వెల్లడి
- త్వరలో చంపారన్ నుంచి రాజకీయ పర్యటనలు ప్రారంభించే అవకాశం

మిగతా 2లో



## మార్చి 16 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ముహూర్తం ఫిక్స్ అయ్యింది. 2026, మార్చి 16 నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదేశాల మేరకు అసెంబ్లీ కార్యదర్శి ఆదివారం (మార్చి 8) నోటిఫికేషన్ రిలీజ్ చేశారు. మార్చి 16 ఉదయం 11 గంటల 45 నిమిషాలకు అసెంబ్లీ సెషన్స్ ప్రారంభం కానున్నట్లు నోటిషికేషన్?లో పేర్కొన్నారు. తొలి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. ఆ మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. ఇక, 2026---27 వార్షిక బడ్జెట్?ను మార్చి 20న ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్నట్లు సమాచారం. కాగా, 2026, ఫిబ్రవరి 23న సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో మార్చి 16 నుంచి 30 వరకు బడ్జెట్ సమావేశాలు జరపాలని నిర్ణయించిన విషయం తెలిసిందే.

## ఎడిటర్ వ్యూ

# జగన్ పాదయాత్ర కొనసాగుతుందా?

వైఎస్ జగన్ పాదయాత్ర ఈసారి సాగుతుందా? అన్నది అనుమానం వ్యక్తమవుతుంది. జగన్ పై రానున్న కాలంలో వరస కేసులు నమోదయ్యే అవకాశాలున్నాయని ఆ పార్టీ నేతలే అంచనా వేస్తున్నారు. ఇప్పటికే అనేక కేసులకు సంబంధించి జగన్ పాత్రపై లోతుగా అధ్యయనం చేసేందుకు కూటమి ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. గతంలో జగన్ తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేసి యాభై మూడు రోజుల పాటు రాజమండ్రి జైలులో ఉంచారని, అలాగే జగన్ నుకూడా జైలుకు పంపాలని టీడీపీ కార్యకర్తలు బలంగా కోరుకుంటున్నారు. అయితే చంద్రబాబు మాత్రం పదే పదే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, ఎవరినీ వదిలిపెట్టబోమని చెబుతుండటంతో ఈ ప్రచారానికి మరింత ఊపందుకుంది.

**లోకేశ్ వ్యాఖ్యలను ఉదహరిస్తూ...**

మరొకవైపు ఇటీవల నారా లోకేశ్ కూడా ఒక ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జగన్ పేరు రెడ్ బుక్ లో ఉన్నదీ లేనిదీ త్వరలోనే తెలుస్తుందని చెప్పడాన్ని కూడా వైసీపీ నేతలు ఉదహరిస్తున్నారు. జగన్ చుట్టూ ఉచ్చు మామూలుగా బిగుసుకోవడం లేదని, అయితే ఇప్పుడు జగన్ పెద్దగా జనంలో లేరు. బెంగళూరు నుంచి అప్పుడప్పుడు వచ్చి వెళుతున్నారు. వచ్చే ఏడాది నుంచి పాదయాత్రకు వెళతానని జగన్ ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఆ సమయంలోనే జగన్ ను జైలుకు పంపితే బాగుంటుందని అధికార పార్టీ ఆలోచనల్లో ఉన్నట్లు వైసీపీ నేతలు బాహాటంగానే చెబుతున్నారు. కానీ అది తమ పార్టీ అధినేత జగన్ తో పాటు పార్టీకి కూడా మరింత సానుభూతి తెచ్చిపెడుతుందని అంటున్నారు.

**ఉన్న కేసుల్లో కదలిక...**

కానీ గత ప్రభుత్వంలో జగన్ తీసుకున్న నిర్ణయాల ప్రభావం ప్రజలపై ఏ మేరకు ప్రభావం చూపాయన్నది కూలంకషంగా చెప్పిన తర్వాత మాత్రమే చర్యలు తీసుకుంటే మంచిదన్న యోచనలో అధికార పార్టీ ఉన్నట్లు తమకు సమాచారం ఉందని తెలిపారు. ఏ మాత్రం సానుభూతి రాకుండా చేసుకోవడానికి, అవసరమైతే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి ఇప్పటి వరకూ జగన్ పై పెండింగ్ లో ఉన్న కేసుల విషయంలో కొన్నింటిలోనైనా కదలిక తీసుకు రావాలన్న ప్రయత్నంలో కూటమి నేతలున్నారని వైసీపీ నేతలు తమ కార్యకర్తల ఎదుట బాహాటంగానే చెబుతున్నారు. దీంతో వచ్చే ఏడాది జగన్ పాదయాత్ర సాగే అవకాశం లేదని, ముందుగానే అందరూ పార్టీ బలోపేతానికి సిద్ధమయి ఉండాలని వైసీపీ నేతలు అంతర్గత సమావేశాల్లో క్యాడర్ కు చెబుతున్నారు. మరి చూడాలి ఏం జరుగుతుందో?

# కాంగ్రెస్ నిర్ణయంతో ఇరాన్‌తో భారత్ సంబంధాలు దెబ్బతిన్నాయి

- మొదటి పేజి తరువాయి

తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. యూపీఏ ప్రభుత్వం ఆరోజు తీసుకున్న నిర్ణయం భారత్, ఇరాన్ సంబంధాలను దెబ్బతీసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి అనుకూలంగా మాట్లాడకపోయినా పర్వాలేదు కానీ ప్రజల్లో భయాందోళనలు కలిగించే తప్పుడు ప్రచారం చేయవద్దని హితవు పలికారు. గతంలో ఇరాన్‌కు వ్యతిరేకంగా వ్యవహరించిన కాంగ్రెస్, ఇప్పుడు ఇరాన్‌కు అనుకూలంగా మాట్లాడుతున్నట్లు నటిస్తూ, భారతదేశంలో చమురు కొరత ఉందని తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. యూపీఏ హయాంలో కేవలం 16 దేశాల నుంచి మాత్రమే చమురు దిగుమతి చేసుకునే వారమని, నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చాక ఆ సంఖ్య 40 దేశాలకు పెరిగిందని అన్నారు. గ్యాస్ సిలిండర్ ధరలపై ఎటువంటి ప్రభావం ఉండదని ఆయన హామీ ఇచ్చారు. దేశంలో తగినంత ఇంధనం, గ్యాస్ స్టాక్ ఉందని రామచందర్ రావు తెలిపారు. ప్రస్తుతం ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో ఆందోళన కలిగించే అబద్ధపు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. చైనాతో రహస్య ఒప్పందాలు చేసింది కాంగ్రెస్ పార్టీయే అన్నారు. తెలంగాణలో ఖజానా ఖాళీ అయిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిత్యం కథలు చెబుతున్నారని, కానీ అదే ప్రజల ధనంతో ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. కేరళలో జరుగుతున్న ఎన్నికల ప్రచారం కోసం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని తెలిపారు. తెలంగాణలో ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు.

# కొత్త హంగులతో తెలంగాణ శాసన మండలి భవనం ప్రారంభం

- మొదటి పేజి తరువాయి

అయితే ఏపీ అసెంబ్లీ అమరావతికి తరలివెళ్లడంతో ఈ భవనం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరింది. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, అసెంబ్లీ మరియు కౌన్సిల్ రెండూ ఒకే ప్రాంగణంలో ఉండాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు ఈ హెరిటేజ్ భవనాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఆగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ (ఏకేటీసీ) సహకారంతో రూ.30 కోట్లతో 18 నెలల పాటు ఈ పనులు సాగాయి. ఇందులో అధునాతన డ్రైనేజీ, ఎలక్ట్రికల్ సిస్టమ్స్, ఫ్లోరింగ్ పనులు చేపట్టారు. సీఎం, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ కోసం ప్రత్యేక ఛాంబర్లు, మీడియా హాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ భవనం పార్లమెంట్ తరహాలో ఎంతో అద్భుతంగా ఉందని, సభ్యులకు అన్ని సౌకర్యాలు కల్పించామని మండలి ఛైర్మన్ సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. 2018 నుంచి ఇప్పటివరకు జూబ్లీహాల్‌లో మండలి సమావేశాలు జరుగుతుండగా, ఇకపై ఆ హాల్‌ను ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు వినియోగించనున్నారు. అలాగే ఉభయ సభల సంయుక్త సమావేశాల కోసం కొత్త సెంట్రల్ హాల్ నిర్మించే యోచనలో కూడా ప్రభుత్వం ఉంది.

# ఏ ఇంట్లో పుట్టినా మహిళలపై వివక్ష ఉంటుంది

- మొదటి పేజి తరువాయి

'స్టాండ్ విత్ హర్' కాదు, 'గివ్ హర్ స్పేస్' జాగృతి నినాదమని వెల్లడించారు. కేవలం మహిళా దినోత్సవం రోజే కాదని, ప్రతిరోజు మహిళని గౌరవించాలని ఆమె సూచించారు. మహిళను తండ్రి, భర్త, అన్న ఇలా అందరూ తక్కువగానే చూస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు లేకుండా తెలంగాణ ఉద్యమమే లేదని ఆమె పేర్కొన్నారు. సామాజిక తెలంగాణ సాధనలోనూ వారి పాత్ర కీలకమని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలపై నేరాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు 33 శాతం సీట్ల రిజర్వేషన్ సాధనతో జాగృతి చరిత్ర సృష్టించిందని అన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరిని ఈ సంఘటన కలిచివేసింది

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పట్ల మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు అత్యంత బాధాకరమని, ఇది తీవ్ర ఆక్షేపణీయమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరిని ఈ సంఘటన కలిచివేసిందని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఇంటర్నేషనల్ సంతాల్ కాన్ఫరెన్స్ సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై ఆయన ఆదివారం ఒక ప్రకటనలో స్పందించారు. సంతాల్ సమాజం గొప్ప సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించేందుకు నిర్వహించిన ఈ అంతర్జాతీయ సదస్సులో.. అదే సామాజిక వర్గానికి చెందిన రాష్ట్రపతికి సరైన ప్రాధాన్యత దక్కకపోవడం విచారకరమని మాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన ప్రోటోకాల్ పాటించడంలో, అధికారుల సమన్వయంలో మమతా సర్కార్ పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి అక్కడి పరిపాలనలోని అరాచక ధోరణిని బయటపెడుతోందని విమర్శించారు. దేశ పౌరుల రాజ్యాంగ హక్కులను కాలరాయడమే కాకుండా, ప్రథమ పౌరురాలైన రాష్ట్రపతి గౌరవాన్ని కూడా కాపాడలేని స్థితిలో బెంగాల్ ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. గిరిజన సోదర సోదరీమణులు ఎంతో ఆత్మీయంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతిని అవమానించడం అంటే.. అది దేశాన్ని అవమానించడమేనని మాధవ్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను గౌరవించే ప్రతి ఒక్కరూ ఈ ఘటనను నిరసిస్తున్నారని, ఇలాంటి చర్యలే టీఎంసీ ప్రభుత్వ పతనాన్ని సూచిస్తున్నాయని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు.

# జేడీయూలో అధికారికంగా చేరిన నితీశ్ కుమార్ తనయుడు

బీహార్ రాజకీయాల్లో ఆదివారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఆదివారం మధ్యాహ్నం పట్నాలోని జేడీయూ కేంద్ర కార్యాలయంలో ఆయన అధికారికంగా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమానికి జేడీయూ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝా, కేంద్ర మంత్రి లలన్ సింగ్, మంత్రులు విజయ్ కుమార్ చౌదరి, బిజేంద్ర ప్రసాద్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు ఉమేశ్ సింగ్ కుష్వాహ తదితర సీనియర్ నేతలు హాజరయ్యారు. పార్టీలో చేరిన సందర్భంగా సంజయ్ కుమార్ ఝా.. నిశాంత్‌కు పార్టీ టోపీ, జ్ఞాపికను అందించగా, కేంద్ర మంత్రి లలన్ సింగ్ సంప్రదాయ తలపాగా చుట్టి ఘనంగా ఆహ్వానించారు. అనంతరం సీనియర్ నేతల కాళ్లకు నమస్కరించి నిశాంత్ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా నిశాంత్ కుమార్ మాట్లాడుతూ... తన తండ్రి మార్గదర్శకత్వంలోనే పనిచేస్తానని స్పష్టం చేశారు. "ఈరోజు నేను పార్టీలో చేరడానికి వచ్చాను. మా నాన్న రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అది ఆయన నిర్ణయం. ఆయన సూచనల మేరకు బీహార్ కోసం మేం పనిచేస్తాం" అని పేర్కొన్నారు. నితీశ్ కుమార్ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకెళతానని చెప్పారు. కార్యకర్తలు పార్టీపై ఇదే ఉత్సాహం, నమ్మకం కొనసాగించాలని కోరారు. కాగా, నిశాంత్ కుమార్ త్వరలోనే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో మమేకమవుతారని జేడీయూ ఎమ్మెల్సీ నీరజ్ కుమార్ తెలిపారు. చంపారన్ ప్రాంతం నుంచి ఆయన తన రాజకీయ యాత్రను ప్రారంభించే అవకాశముందని పార్టీ వర్గాల సమాచారం. గతంలో నితీశ్ కుమార్ కూడా తన రాజకీయ యాత్రలను అక్కడి నుంచే మొదలుపెట్టేవారు. రాబోయే రోజుల్లో పార్టీ సంస్థాగత బలోపేతంలో నిశాంత్ కీలక పాత్ర పోషిస్తారని, పార్టీ అప్పగించే ఏ బాధ్యతనైనా చిత్తశుద్ధితో నిర్వహిస్తారని జేడీయూ వర్గాలు భావిస్తున్నాయి.

# న్యూయార్క్ మేయర్ మమ్దానీ ఇంటి వద్ద బాంబుల కలకలం... ఆరుగురి అరెస్ట్

న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ నివాసం వెలుపల శనివారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. 'యాంటీ ముస్లిం' నిరసన ప్రదర్శనలో ఆందోళనకారులు స్క్రూలు, బోల్టులతో నింపిన 'స్మోకింగ్ ప్రొజెక్టైల్స్' (పొగ వచ్చే పేలుడు వస్తువులు) విసరడం కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. రైట్ వింగ్ యాక్టివిస్ట్ జేక్ లాంగ్ ఆధ్వర్యంలో ఈ నిరసన జరిగింది. సుమారు 20 మంది మద్దతుదారులు అక్కడ చేరగా.. వారికి వ్యతిరేకంగా 100 మందికి పైగా కౌంటర్ ప్రొటెస్టర్లు నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం పెరిగి ఘర్షణకు దారితీసింది. లాంగ్ మద్దతుదారులు పెప్పర్ స్ప్రే చల్లడంతో పరిస్థితి అదుపు తప్పింది. ఇరువర్గాలు గుద్దులు విసురుకుంటూ, పిడిగుద్దులతో దాడులు చేసుకున్నాయి.

ఈ గొడవలో ఓ వ్యక్తి పొగలు వెదజల్లే రెండు వస్తువులను జనం మధ్యలోకి విసిరాడు. అవి ఈస్ట్ 87వ వీధిలో పడి మంటలు రావడంతో జనం భయంతో పరుగులు తీశారు. ఇవి టేపుతో చుట్టిన జాడీలని, అందులో నట్లు, బోల్టులు, స్క్రూలు నింపి ఉన్నాయని, అలాగే ఫ్యూజ్ కూడా అమర్చారని పోలీస్ కమిషనర్ జెస్సికా టిష్ తెలిపారు. బాంబ్ స్క్వాడ్ బృందాలు వీటిని పరిశీలిస్తున్నాయి. ఘటన జరిగిన సమయంలో మేయర్ మమ్దానీ, ఆయన భార్య ఇంట్లో లేరని పోలీసులు స్పష్టం చేశారు. ఈ దాడిని మేయర్ ప్రతినిధి తీవ్రంగా ఖండించారు. ఇది ముస్లిం వ్యతిరేక చర్య అని, అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. పేలుడు వస్తువులు విసిరిన 18 ఏళ్ల ఎమిర్ బాలాట్, అతనికి సహకరించిన 19 ఏళ్ల ఇబ్రహీం నిక్, పెప్పర్ స్ప్రే చల్లిన ఇయాన్ మెక్‌గిన్నిస్‌తో పాటు మొత్తం ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఉద్రిక్తత కొనసాగుతోంది.

## శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌకపై దాడి... అమెరికా ముందే హెచ్చరించిందా?

- మొదటి పేజి తరువాయి

వెంటనే నౌకను వదిలిపెట్టి వెళ్లాలని ఇరాన్ యుద్ధ నౌక కమాండర్‌ను రెండుసార్లు ఆదేశించినట్లు తెలుస్తోంది. జలాంతర్గామి దాడికి కొన్ని నిమిషాల ముందు నౌకలోని ఓ సిబ్బంది తన తండ్రికి ఫోన్ ద్వారా తెలియజేసినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. మార్చి 4న జలాంతర్గామి నుంచి హెచ్చరికలు వచ్చాయని, సిబ్బంది ఖాళీ చేసి వెళ్లిపోవాలని సూచన చేశారని తెలుస్తోంది. అయితే యుద్ధ నౌక కమాండర్ మాత్రం అందుకు ససేమీరా అన్నారు. దీనితో సిబ్బందిలోని కొంతమంది కమాండర్‌తో వాదనకు దిగినట్లు తెలుస్తోంది. కొంతమంది కమాండర్ ఆదేశాలను ధిక్కరించి లైఫ్ బోట్ల ద్వారా ప్రాణాలతో బయటపడ్డారని తెలుస్తోంది. అమెరికా జలాంతర్గామి నుంచి హెచ్చరికలు వచ్చాయని తెలిపిన నౌక సిబ్బంది ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారని తెలుస్తోంది.

**ఇళ్లలోంచి బయటికి రావొద్దు...**

ఇరాన్ పౌరులకు అమెరికా సైన్యం ఆదివారం కీలక హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్ సైన్యం జనావాసాల మధ్య నుంచే డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగిస్తున్నందున ప్రజలు ఇళ్లలోనే ఉండాలని సూచించింది. ఈ వ్యూహం వల్ల లక్షలాది మంది సామాన్యుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని, దాడులు తీవ్రమవుతున్న వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్ కామ్) ప్రకారం.. ఇరాన్ మిలటరీ డెజ్ ఫుల్, ఇస్ఫహాన్, షిరాజ్ వంటి రద్దీగా ఉండే నగరాల నుంచి తమ కార్యకలాపాలు సాగిస్తోంది. ఇలాంటి ప్రాంతాలను సైనిక అవసరాలకు వాడటం వల్ల అంతర్జాతీయ చట్టాల ప్రకారం అవి రక్షణ హోదాను కోల్పోతాయని, ప్రతీకార దాడులకు గురయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఇరాన్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే అమాయక ప్రజల ప్రాణాలను పణంగా పెడుతోందని సెంట్ కామ్ కమాండర్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ ఆరోపించారు. ఇరాన్ తమ పొరుగు దేశాల్లోని పౌర విమానాశ్రయాలు, హోటళ్లపై కూడా విచక్షణారహితంగా దాడులు చేస్తోందన్నారు. తాము పౌరులకు హాని కలగకుండా సాధ్యమైనంత వరకు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, అయితే ఇరాన్ సైనిక స్థావరాలుగా వాడుకుంటున్న ప్రాంతాల్లో భద్రతకు గ్యారంటీ ఇవ్వలేమని అమెరికా స్పష్టం చేసింది. ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్ వందల కొద్దీ క్షిపణులను ప్రయోగించినప్పటికీ, తమ ప్రతిఘటనతో ఆ వేగం తగ్గిందని పేర్కొంది. మరోవైపు, ఉద్రిక్తతల నేపథ్యంలో మధ్యప్రాచ్యం నుంచి అమెరికన్లను సురక్షితంగా తరలించే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఫిబ్రవరి 28 నుంచి ఇప్పటివరకు 32,000 మందికి పైగా అమెరికన్లు క్షేమంగా స్వదేశానికి చేరుకున్నారని అసిస్టెంట్ సెక్రటరీ డైలాన్ జాన్సన్ తెలిపారు. ఒమన్, కువైట్, సౌదీ అరేబియా, యూఏఈ తదితర దేశాల నుంచి ప్రత్యేక విమానాల ద్వారా తరలింపు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

## నారీశక్తి వట్టిమాటే... మోదీ, చంద్రబాబుపై షర్మిల ఫైర్

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మహిళల భద్రత, సంక్షేమం విషయంలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆమె ఆరోపించారు. ఆకర్షణీయమైన పథకాలతో మహిళలను మభ్యపెట్టి మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో మహిళలకు ఇచ్చిన మూడు హామీలను విస్మరించి నయవంచనకు పాల్పడిందని షర్మిల విమర్శించారు. 'మహాశక్తి' పథకం కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500 ఇస్తామని చెప్పి 1.80 లక్షల మందిని, 'తల్లికి వందనం' కింద 20 లక్షల మంది తల్లులను మోసం చేశారని ఆరోపించారు. వడ్డీ లేని రుణాల హామీతో 1.18 లక్షల డ్వాక్రా మహిళలను వంచించారని అన్నారు. ఇంటికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పి ఒకటి మాత్రమే ఇచ్చారని, ఇప్పుడు గ్యాస్ ధరలు పెంచి వంటింటిపై భారం మోపారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వంపై కూడా షర్మిల విమర్శలు చేశారు. దేశంలో గంటకు 50 మంది మహిళలపై దాడులు జరుగుతుంటే 'నారీశక్తి వందన్' ఎక్కడుందని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం మహిళలను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా మాత్రమే చూస్తోందని ఆమె వ్యాఖ్యానించారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను విస్మరించి, వారిని అర్ధరాత్రి అరెస్టు చేయించి అవమానించారని దుయ్యబట్టారు. రెండేళ్ల పాలనలో కుటుంబాలపై రూ.15 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపిన కూటమి ప్రభుత్వం, మహిళలను ఉద్ధరించామని చెప్పుకోవడానికి సిగ్గుపడాలని షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దివంగత వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు గ్యాస్ ధరల భారాన్ని ప్రభుత్వమే మోసేదని ఆమె గుర్తుచేశారు.




# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్



# ఈనెల 20న తేలనున్న..!


# సర్వే నెం. 227 భవితవ్యం..!

### దాఖలైన రెండు పిటిషన్లను కలిపి విచారించనున్న హైకోర్టు..

**వేలకోట్లు విలువైన సర్వే నెంబర్ 227 ప్రభుత్వ భూమి కబ్జా వ్యవహారంలో, రెవెన్యూ అధికారుల ద్వంద వైఖరి, అక్రమార్కులకు అనుకూలంగా తయారైందా..? లేక అధికారులు చేసిన ధరణి అక్రమ రిజిస్ట్రేషన్‌లు ఎటువైపు తీసుకెళ్తుందదో చూడాలి..? ఒకవైపు వక్రమార్గంలో ధరణి రిజిస్ట్రేషన్‌లు చేసిన అదే జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి, 353.35 ఎకరాలు ప్రభుత్వ భూమిగా తీర్పును వెలువరించారు.. అనంతరం అదే తీర్పును సవాల్ చేసి హైకోర్టుకు వెళ్ళిన పిటిషనర్‌లు.. తాత్కాలికంగా సంబంధిత తీర్పును రద్దు చేస్తూ హైకోర్టు స్టే ఇచ్చింది.. ఇప్పుడు ఆ స్టే ఆధారంగా 22-ఎ జాబితా నుంచి తొలగింపుకు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇస్తూనే ఈనెల 20కి విచారణను కోర్టు వాయిదా వేసింది..**

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మార్చి 8:**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గండిమైసమ్మ-దుండిగల్ మండలం బహుదూర్‌పల్లి గ్రామ శివారు సర్వే నెం.227 ప్రభుత్వ భూమి సుమారు రూ.30-40 వేలకోట్లు విలువైన 353.35 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా వ్యవహారం రోజురోజుకు కీలక మలుపు తిరుగుతోంది..ఈనెల (20 మార్చి 2026న) భవితవ్యం తేలనున్నది.. 22-ఏ నిషేధిత జాబితా నుండి తొలగించాలని తెలంగాణ ఉన్నత న్యాయస్థానాన్ని రెండు పిటిషన్‌లు దాఖలు కావడంతో హైకోర్టు విచారణ ఈనెల 20కి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.. ఒకవైపు రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్య వైఖరితోనే పరిస్థితి ఇంతవరకు వచ్చిందనే ఆరోపణలు లేకపోలేదు.. మరోవైపు కేసు హైకోర్టు పరిధిలో ఉండగానే అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేసుకున్న సాయినాథ్ సొసైటీ అధ్యక్షుడు, సభ్యుల వ్యవహారం తెలిసిందే..! ఇప్పుడు 22-ఎ నుంచి బహుదూర్‌పల్లి సర్వే నెం. 227 ప్రభుత్వ భూమి 353.35 ని తొలగింపు పిటిషన్‌కి మధ్యంతర ఉత్తర్వులు.. ఈ 15 రోజులపాటు తొలగిస్తారని, ఆ వ్యవధిలో రిజిస్ట్రేషన్‌లు చేసుకోవచ్చని సభ్యులతో ముందస్తు ప్రచారం జోరుగా సాగుతున్నట్టు ఓ సభ్యుడు "పెన్ పవర్" ప్రతినిధికి ఫోన్ కాల్‌తో స్పష్టత.. ఇప్పటికే 2022 నుండి 2023 అక్టోబర్11 వరకు ధరణీ చట్టంలోని "నోషనల్ ఖాతా" పేరుతో దాదాపు 200 ఎకరాలకు పలువురి పేరుమీద దుండిగల్ గండిమైసమ్మ మండలంలో ధరణి రిజిస్ట్రేషన్‌లు చేసిన విషయం తెలిసిందే..! ఈ వ్యవహారంలో సీసీఎల్‌ఏ కమిషనర్ అండ్ మేడ్చల్ జిల్లా కలెక్టర్‌లు, దుండిగల్ తహాశీల్దారుల పర్యవేక్షణలోనే అక్రమ ధరణీ రిజిస్ట్రేషన్‌లు చర్చనీయాంశంగా మారింది..?ఆ తప్పుడు ధరణి రిజిస్ట్రేషన్‌లే ఈ కబ్జాలకు బలం చేకూర్చబోతుందా..? ధరణి చట్టంలో పరిపాలనా ఎంట్రీలో భాగమైన "నోషనల్ ఖాతా"తో ధరణి రిజిస్ట్రేషన్‌లు చేయొచ్చా..? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.. మరోవైపు రెండు పిటిషన్‌లకు కలిపి, ఈనెల 20న హైకోర్టు విచారణ వాయిదా ఉన్న నేపథ్యంలో బహుదూర్‌పల్లి సర్వే నెం.227 భవితవ్యం తేలనున్నది.. 22-ఎ నిషేధిత జాబితా నుండి పూర్తిగా తొలగిస్తారా..? లేక అదే జాబితాలో కొనసాగుతుందా..? అనే విషయంపై ఉత్కంఠతో పలువురు ఎదురు చూస్తున్నారు..


Registration & Stamps Department

STATEMENT OF ENCUMBRANCE ON PROPERTY

హైకోర్టు కేసులో ఉండగానే, 2024 జనవరి 8న సాయినాథ్ సొసైటీ రిజిస్ట్రేషన్‌లు

- బహుదూర్‌పల్లి 227 సర్వే నెంబర్‌పై ఈనెల 20న హైకోర్టులో విచారణ..
- ప్రభుత్వానికి ఇప్పటికే నోటీసులు జారీ.. కౌంటర్ దాఖలుకు సిద్ధమైన ప్రభుత్వం..?
- ఈ కేసులో ఇంప్లీడ్ అయిన బహుదూర్‌పల్లి మాజీ సర్పంచ్ శివునూరి సుజాత..
- సాయినాథ్ సొసైటీ, రెడ్డీస్ బయో సైన్సెస్ సంస్థలు, విడివిడిగా పిటిషన్లు దాఖలు..
- 22-ఏ నిషేధిత జాబితా నుంచి సర్వే నెం.227 తొలగించాలన్న పిటిషనర్లు..!
- విచారణకు స్వీకరించిన జస్టిస్ విజయ్ సేన్ రెడ్డి ధర్మాసనం..
- నిషేధిత భూముల జాబితా నుంచి తొలగింపుకు రెడ్డీస్ బయో సైన్సెస్ అభ్యర్థన.
- రెడ్డీస్ సంస్థకు ఊరట కల్పించిన తెలంగాణ ఉన్నత న్యాయస్థానం..
- రెడ్డీస్ సంస్థకిచ్చిన ఉత్తర్వుల ఆధారంగా హైకోర్టును ఆశ్రయించిన సాయినాథ్ సొసైటీ..
- సాయినాథ్ సొసైటీకి కూడా అదే తరహా ఉత్తర్వులు వర్తిస్తాయన్న హైకోర్టు..
- తాత్కాలిక రిజిస్ట్రేషన్లకు అనుమతిచ్చిన హైకోర్టు..తుది విచారణతో రానున్న స్పష్టత..

## 25 ఏళ్ళ క్రితమే మొదలైన కేసు..!

2000 సంవత్సరంలో రెవెన్యూ 'ఎన్‌వోసి'కి వెళ్ళగా..! అదే విషయాన్ని అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ "సీసీఎల్‌ఏ" కమిషనర్‌కు ప్రతిపాదన పంపించారు.. సంబంధిత భూమి ప్రభుత్వ పోరంబోకు భూమిగా రికార్డులు ఉండటంతో తిరస్కరించారు.. వెంటనే హైకోర్టుకు వెళ్ళగా 2004 హైకోర్టు ఆదేశాల మేరకు, అదే రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ సుదీర్ఘ విచారణ అనంతరం 2009లో జగన్మోహన్ రావు ఐఏఎస్ ప్రభుత్వ భూమిగానే ప్రొసీడింగ్ జారీచేశారు.. 2022లో హైకోర్టులో కేసు ఉన్నప్పటికీ..! నాడు సాయినాథ్ సొసైటీ "ఎన్‌వోసి" తిరస్కరించిన అదే "సీసీఎల్‌ఏ" కమిషనర్, మరో ఇద్దరు మేడ్చల్ జిల్లా కలెక్టర్‌లు, ఇద్దరు తహశీల్దార్‌లు, ధరణి చట్టంలోని "నోషనల్ ఖాతా" పేరుతో "2022-2023 అక్టోబర్" వరకు ఇండ్ల ప్లాట్‌లుగా ఉన్న దాదాపు 200 ఎకరాలను..రెడ్డీస్ బయో సైన్సెస్ సంస్థ తోపాటు, పలువురికి వ్యవసాయ భూమిగా ధరణి రిజిస్ట్రేషన్‌లు చేశారు.. పట్టా పాసు బుక్కులు, జారీచేశారు.. మళ్ళీ రెండు నెలల వ్యవధిలోనే, అదే భూమిని సుమారు రూ.6 కోట్లు చెల్లించి నాలా కన్వర్శన్ (వ్యవసాయేతర భూమిగా) చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది..?





## వక్రమార్గంలో రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ..?

ఇదిలా ఉండగానే సాయినాథ్ సొసైటీ రంగంలోకి దిగింది.. సొసైటీ అధ్యక్షుడి హోదాలో ప్రభుత్వ భూమిని 2024 జనవరి 8న 5 ప్లాట్‌లు మేడ్చల్ సబ్ రిజిస్టార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ ప్రారంభించారు.. అయితే కారణం ఏదైనా..! ఈ వ్యవహారంలో సంబంధిత అధికారులు పెద్దగా జోక్యం చేసుకోలేదు.. ఎందుకంటే హైకోర్టులో ఉండగానే "2022-2023"లో ధరణి రిజిస్ట్రేషన్‌లు చేసిన ఘనత రెవెన్యూ యంత్రాంగానికే దక్కుతుంది.. అక్రమ రిజిస్ట్రేషన్‌లే అయినప్పటికీ..! సాయినాథ్ సొసైటీని ప్రశ్నించలేక పోయిందని, ఆరోపణలు వచ్చాయి.. కానీ 'పెన్ పవర్' దినపత్రికలో వస్తున్న వరుస కథనాలకు ఇక తప్పదు అనుకున్నారు కాబోలు..! 2024 జూన్ 28న అప్పటి తహశీల్దార్ మతీన్ కలెక్టర్ ఆదేశాలతో, రిజిస్ట్రేషన్‌లు నిలిపి వేయాలని, మేడ్చల్ రిజిస్టార్‌కు ఓ లేఖను రాశారు.. లేఖలో 227 ప్రభుత్వ పోరంబోకు భూమిగా తేలుస్తూ పూర్తి వివరాలు పేర్కొన్నారు.. అయినా రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ యధావిధిగా నిరంతర ప్రక్రియగా మారింది..

ఇంతలోనే సాయినాథ్ సొసైటీ, మరో అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టు దృష్టికి తీసుకెళ్ళింది.. దీంతో 2004 నాటి హైకోర్టు ఆదేశాలను, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఏకపక్షంగా తీర్పును వెలువరించారని, నాటి హైకోర్టు ఉత్తర్వులను పునః పరిశీలించాలని 2024 అక్టోబర్ 30న మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌ను ఆదేశించింది.. దీంతో జిల్లా అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో సంవత్సరం పాటు ఇరు వర్గాలను పలు వాయిదాలతో డాక్యుమెంట్‌లను పరిశీలించారు.. చివరికి సర్వే నెం. 227 లో మొత్తం 353.35 ఎకరాలు ప్రభుత్వ పోరంబోకు భూమిగా నిర్ధారించి, స్పష్టమైన ఆధారాలతో వెల్లడించారు.. అదనపు కలెక్టర్ విచారణలో బహుదూర్‌పల్లి సర్వే నెం.227 ప్రభుత్వ భూమి 353.35 ఎకరాలు విక్రయించిన వారికి ఎలాంటి డాక్యుమెంట్‌లు లేకుండానే 1966లో క్రయవిక్రయాలు జరిగాయని 1948 నుండి ప్రభుత్వ పోరంబోకు భూమిగానే అదనపు కలెక్టర్ నిర్ధారించారు..


హైకోర్టు పరిధిలో ఉండగానే, అక్రమ షెడ్డు నిర్మాణం, తహశీల్దార్ నోటీసులు ఇచ్చినా చర్యల్లేవు..




# మహిళల భద్రత..! నినాదాలకే పరిమితమా..?

సహ చట్టంలో 'ఐసీసీ' పట్ల వీస్తూపోయే సంచలన నిజాలు వెలుగులోకి..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మధుబాబు చికిలే వ్యాసం..



- పని ప్రదేశాల్లో 'ఐసీసీ' బలోపేతంపై లేవనెత్తిన ప్రశ్నలు..!
- మహిళల పని ప్రదేశాల్లో భద్రత ఎక్కడ..? ఐసీసీ లేని సంస్థల్లో ఆందోళన..
- మహిళా దినోత్సవం సందేశమే: ప్రతి కార్యాలయంలో 'ఐసీసీ' తప్పనిసరి..!

- పనిచేసే ప్రదేశాల్లో మహిళల భద్రతపై మళ్లీ చర్చకు దారితీస్తున్న వైనం..
- ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ(ఐసీసీ) ఏర్పాటు ప్రతి సంస్థలో తప్పనిసరి ఉండాలి..!
- నేటికీ అనేక సంస్థల్లో కమిటీలే లేవని సహ చట్టంతో నిజాలు బట్టబయలు..
- చిన్న సంస్థల్లో తక్షణమే అమలు ఆవశ్యకత అత్యవసరం..
- "హక్కులు- న్యాయం- చర్యలు: మహిళల భద్రతకు ఐసీసీ బలోపేతమే మార్గం..
- చట్టం ఉంది..! కమిటీలు ఎక్కడ..? పని ప్రదేశాల్లో మహిళల భద్రతపై ప్రశ్నలు..
- మహిళల గౌరవానికి రక్షణ కవచంగా ఐసీసీ.. కమిటీలు ఎందుకు లేవు..?

-4లో

# రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ నేత మోత్కుపల్లి నర్సింహులు సంచలన ఆరోపణలు


- రెండున్నరేళ్లుగా సీఎంను కలవడానికి ప్రయత్నిస్తున్నానన్న మోత్కుపల్లి నర్సింహులు
- ఆయన అపాయింట్‌మెంట్ దొరకడం లేదన్న కాంగ్రెస్ నాయకుడు
- 200 సార్లు ఫోన్ చేసిన లిఫ్ట్ చేయడం లేదని ఆవేదన

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకుడు మోత్కుపల్లి నర్సింహులు సంచలన ఆరోపణలు చేశారు. మా జాతి సమస్యలు చెప్పుకుందామని రెండున్నరేళ్లుగా ముఖ్యమంత్రిని కలవడానికి ప్రయత్నిస్తున్నానని, కానీ ఆయన దొరకడం లేదని అన్నారు.

-4లో



# మహిళల భద్రత..! నినాదాలకే పరిమితమా..?



- సహ చట్టంలో 'ఐసీసీ' పట్ల వీస్తూపోయే సంచలన నిజాలు వెలుగులోకి..
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మధుబాబు చికిలే వ్యాసం..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, మహిళల భద్రత.. నినాదాలకే పరిమితమా..? అన్న ప్రశ్నలకు తావిస్తుందని 'ఐసీసీ'పై సహ చట్టం ద్వారా, సంచలన నిజాలతో ఓ సామాజిక వేత్త ప్రత్యేక వ్యాసంతో బట్టబయలు చేశారు.. "మహిళలు- బాలికలకు హక్కులు, న్యాయం, చర్యలు" ఈ మూడింటిపై పని ప్రదేశాల్లో భద్రతకు "అంతర్గత ఫిర్యాదుల కమిటి (ఐసిసి) బలోపేతం ఆవశ్యకత తక్షణమే అత్యవసరమని మధుబాబు చికిలే పేర్కొన్నారు.. మార్చి 8న జరుపుకునే ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఒక ఉత్సవం మాత్రమే కాదు.. అది సమాజం తన మనసును పరిశీలించుకునే రోజు.. మహిళలు నిజంగానే గౌరవంతో, భద్రంగా జీవిస్తున్నారా..? వారి హక్కులు కేవలం నినాదాలుగా మిగిలిపోయాయా..? లేక నిజంగానే అమలవుతున్నాయా..? అనే ప్రశ్నలు మన ముందుకు వస్తున్నాయి.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మధుబాబు చికిలే ప్రత్యేక వ్యాసం సమాజంలో పలువురిని ఆలోచింప చేస్తున్న శీర్షిక 'పెన్ పవర్' దినపత్రికలో ప్రత్యేకం..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మార్చి 8:



- పనిచేసే ప్రదేశాల్లో మహిళల భద్రతపై మళ్లీ చర్చకు దారితీస్తున్న వైనం..
- ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ(ఐసీసీ) ఏర్పాటు ప్రతి సంస్థలో తప్పనిసరి ఉండాలి..!
- నేటికీ అనేక సంస్థల్లో కమిటీలే లేవని సహ చట్టంతో నిజాలు బట్టబయలు..
- చిన్న సంస్థల్లో తక్షణమే అమలు ఆవశ్యకత అత్యవసరం..
- "హక్కులు- న్యాయం- చర్యలు: మహిళల భద్రతకు ఐసీసీ బలోపేతమే మార్గం..
- చట్టం ఉంది..! కమిటీలు ఎక్కడ..? పని ప్రదేశాల్లో మహిళల భద్రతపై ప్రశ్నలు..
- మహిళల గౌరవానికి రక్షణ కవచంగా ఐసీసీ.. కమిటీలు ఎందుకు లేవు..?

INTERNATIONAL WOMEN'S DAY MARCH 8

- పని ప్రదేశాల్లో 'ఐసీసీ' బలోపేతంపై లేవనెత్తిన ప్రశ్నలు..!
- మహిళల పని ప్రదేశాల్లో భద్రత ఎక్కడ..? ఐసీసీ లేని సంస్థల్లో ఆందోళన..
- మహిళా దినోత్సవం సందేశమే: ప్రతి కార్యాలయంలో 'ఐసీసీ' తప్పనిసరి..!

## 'ఐసిసి' అనేది ఒక కమిటీ మాత్రమే కాదు..! మహిళల గౌరవం..

ఇవన్నీ గణాంకాలు చెప్పే వాస్తవం.. అధికారిక వివరాలు పరిశీలిస్తే ప్రభుత్వ విభాగాల్లో ఐసిసి ల ఏర్పాటు కొంత మేర జరిగిందని తెలుస్తోంది.. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన "ఐసిసి లు-1808" ఉపజిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన "ఐసిసి లు-1881" అదేవిధంగా జిల్లాల వారీగా ప్రైవేట్ రంగంలో "740 ఐసిసి"లు మాత్రమే నమోదు అయ్యాయి.. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ వంటి ప్రాంతాల్లో ఎక్కువ సంస్థలు ఉండటం వల్ల అక్కడ ఐసీసీ'లు ఎక్కువగా ఉన్నాయి.. అయితే ఈ సంఖ్యలు చూస్తే మరో నిజం కూడా బయటపడుతోంది.. ఇంకా అనేక సంస్థల్లో "అంతర్గత ఫిర్యాదుల కమిటిలు" లేవని స్పష్టమవుతుందని మధుబాబు చికిలే ఈ వ్యాసంలో ప్రస్తావించారు..



మధుబాబు చికిలే.. ప్రపంచ మానవ హక్కుల సమితి జాతీయ డైరెక్టర్..

ఈ ఏడాది మహిళా దినోత్సవం థీమ్ "మహిళలకు, బాలికలకు హక్కులు : న్యాయం- కార్యాచరణ" ఈ మూడు పదాలు ఒక సమాజ పురోగతిని కొలిచే ప్రమాణాలుగా నిలుస్తాయి.. ముఖ్యంగా మహిళలు పనిచేసే కార్యాలయాలు, సంస్థలు ఈ మూడు విలువలను నిజంగా అమలు చేసినప్పుడే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుంది.. పనిచేసే ప్రదేశాల్లో భద్రత-హక్కుల మొదటి అడుగుగా చెప్పాలి.. మహిళలు ఉద్యోగం చేయడం ఒక అవకాశమే కాదు, అది వారి మౌలిక హక్కుగా భావించాలి... అయితే ఆ హక్కు నిజంగా అర్థవంతం కావాలంటే పని ప్రదేశం భద్రంగా ఉండాలి.. మహిళలు భయపడకుండా, గౌరవంతో పనిచేసే వాతావరణం కల్పించడమే నిజమైన అభివృద్ధికి సంకేతం.. ఈ అవసరాన్ని గుర్తించి భారతదేశంలో పనిచేసే ప్రాంతాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013 అనే చట్టాన్ని అమలు చేసింది.. ఈ చట్టం ప్రకారం పది మంది లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న ప్రతి సంస్థలో "అంతర్గత ఫిర్యాదుల కమిటీలు"(ఐసిసి) ఏర్పాటు చేయడం తప్పనిసరిగా ఈ చట్టం ఉద్దేశం..

## హక్కులు-న్యాయం-చర్యలు..

మహిళా దినోత్సవం థీమ్‌లోని మూడు పదాలు మనకు ఒక స్పష్టమైన దిశను చూపిస్తున్నాయి.. అందులో మొదటిది..


(1)హక్కులు..! మహిళలకు పనిచేసే హక్కు మాత్రమే కాదు, గౌరవంగా పనిచేసే హక్కు, భయంలేకుండా పనిచేసే హక్కు, వేధింపులు లేకుండా జీవించే హక్కులు కూడా ఉన్నాయి. అంతర్గత ఫిర్యాదుల కమిటి వ్యవస్థ ఈ హక్కులను రక్షించే విభాగంలో ఒక ముఖ్యమైన యంత్రాంగం.. రెండవది (2)న్యాయం..! పని ప్రదేశంలో వేధింపులకు గురైన మహిళకు త్వరితగతిన న్యాయం అందాలి.. 'అంతర్గత ఫిర్యాదుల కమిటి' వలన ఫిర్యాదు చేయడానికి ఒక అధికారిక వేదికగా ఉంటుంది.. విచారణ వేగంగా జరిగేందుకు దోహదపడుతుంది. బాధితురాలికి రక్షణ లభిస్తుంది.. ఇక మూడవది.. (3)చర్యలు..! ఇప్పుడు అత్యంత అవసరమైన మూడవ అంశం చర్యలు..నేటికీ అనేక రంగాల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటిలు ఏర్పాటు కాలేదు. ప్రత్యేకంగా చెప్పాలంటే చిన్నపాటి ప్రైవేట్ సంస్థలు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, నిర్మాణ రంగం, సేవారంగ సంస్థలు.. ఇవి మహిళలు ఎక్కువగా పనిచేసే రంగాలు. కాబట్టి అక్కడ అంతర్గత ఫిర్యాదుల కమిటి వ్యవస్థ బలపడాలని మధుబాబు చికిలే అభిప్రాయపడ్డారు..




Every Women's Day they come — to seek her protection from the system.

## మహిళల భద్రతే- సమాజ పురోగతికి పునాది..!

ఒక దేశం అభివృద్ధి చెందిందని చెప్పాలంటే మహిళలు భయపడకుండా పనిచేసే వాతావరణం ఉండాలి.. భద్రత లేని చోట ప్రతిభ కూడా వికసించదు.. మహిళల గౌరవాన్ని కాపాడే కార్యాలయాలే నిజమైన అభివృద్ధికి సూచికలు.. ఒక సామాజిక స్పృహ, సంకల్పంతో, ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మనం ఒక స్పష్టమైన సంకల్పం తీసుకోవాలని ఆయన సూచించారు.. ప్రతి సంస్థలో 'అంతర్గత ఫిర్యాదుల కమిటి' (ఐసిసి) ఉంటే..! ప్రతి మహిళకు భద్రత కల్పించవచ్చు.. అలాంటి సందర్భంలో మాత్రమే మహిళల హక్కులు నిజంగా అమలవుతాయి.. అప్పుడు మాత్రమే న్యాయం అందుతుంది, చర్యలు ఫలిస్తాయి.. మహిళల భద్రత ఒక చట్టం వల్ల మాత్రమే సాధ్యం కాదు. సమాజం మొత్తం కలిసొచ్చినప్పుడు మాత్రమే అది నిజమవుతుందని, ప్రపంచ మానవహక్కుల సమితి జాతీయ డైరెక్టర్ మధుబాబు చికిలే "పెన్ పవర్"తో పేర్కొన్నారు.




# రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ నేత మోత్కుపల్లి నర్సింహులు సంచలన ఆరోపణలు

- 3 పేజి తరువాయి

200 సార్లు ఫోన్ చేసినా తన ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని, అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆరోపించారు.ఒక యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ కోసం అమరులైన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం కోసం అడుగుదామని ప్రయత్నిస్తే కలవడానికి అవకాశం రావడం లేదని అన్నారు. ఐదు ఎకరాల భూమి ఇస్తే తాము మాదిగ భవనం నిర్మించుకుంటామని తెలిపారు. ఈ రెండున్నరేళ్ల కాలంలో తమ వర్గానికి అన్ని చోట్ల అన్యాయమే చేశారని ఆరోపించారు.


నిన్న జరిగిన మాదిగల సన్మాన సభకు తనను పిలవలేదని ఆవేదన చెందారు. ముఖ్యమంత్రి తనను పిలవలేదు కాబట్టి నిర్వాహకులు కూడా పట్టించుకోలేదేమో అని వాపోయారు. తాను కూడా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని, ఎంతకాలమైనా ముఖ్యమంత్రి పదవిలో ఉండు... నిన్ను మా భుజాన మోస్తాం అని రేవంత్ రెడ్డితో చెప్పానని, కానీ ఆయన మాత్రం తనకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని వాపోయారు. మాదిగ కులాన్ని రేవంత్ రెడ్డి పట్టించుకోడం లేదని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో, రాజ్యసభ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాదిగలకు ప్రాధాన్యత ఇవ్వలేదని ఆరోపించారు. వందల కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని, కానీ మాదిగలకు మాత్రం ఒక్కటే ఇచ్చారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తమకు ఎలాంటి కోపం లేదని, కానీ తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

# సైబర్ బ్లాక్ మెయిలింగ్.. ధైర్యంగా ఫిర్యాదు చేయండి : సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ శిఖా గోయల్



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతి మహిళా ఆన్‌లైన్‌లో సురక్షితంగా, ధైర్యంగా ఉండాలని, సైబర్ బ్లాక్ మెయిలింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ శిఖా గోయల్ తెలిపారు. మహిళ దినోత్సవం సందర్భంగా సైబర్ బ్లాక్ మెయిలింగ్ పై అవగాహన కలిగిస్తూ ఆదివారం వీడియో విడుదల చేశారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు పెడతామంటూ బెదిరింపులకు పాల్పడే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, డబ్బులు అడిగితే పంపవద్దని సూచించారు. ఇలాంటి బెదిరింపులు వచ్చిన సమయంలో భయాన్ని వీడి ,

ధైర్యంగా సైబర్ క్రైమ్ లో ఫిర్యాదు చేయాలని కోరారు.ఒకసారి డబ్బు పంపితే వారు పదే పదే బ్లాక్‌మెయిల్ చేస్తూనే ఉంటారని, ఏదైనా సైబర్ బెదిరింపు లేదా స్పామ్ కాల్స్ వస్తే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాని సూచించారు. సైబర్ నేరాలు మౌనం సంకోచం చెందవద్దని, అవగాహనతో పరిస్థితిని మార్చవచ్చుని, ప్రతి మహిళా ఆన్‌లైన్‌లో సురక్షితంగా, ధైర్యంగా ఉండాలని ఆశిస్తున్నట్లు డీజీ తెలిపారు.




## నైటా ఆధ్వర్యంలో అమెరికాలో ఘనంగా శివరాత్రి, మహిళా దినోత్సవ వేడుకలు



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా ప్రధాన నగరంలో న్యూయార్క్ తెలంగాణ తెలుగు సంఘం (నైటా) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని, మహిళా దినోత్సవం రెండు వేడుకలను కలిపి నైటా సంబరాలను ఆదివారం అద్వితీయంగా నిర్వహించారు. ప్రత్యేక నైటా సంబరాల సావనీర్–2026 ను ప్రముఖ ఎన్ఆర్ఐ వ్యాపారవేత్త, వితరణశీలి డాక్టర్ పైళ్ల మల్లారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. న్యూయార్క్, న్యూజెర్సీ తో పాటు పరిసర ప్రాంతాల్లో ఉన్న తెలుగు వారందరూ పెద్ద సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మ్యూజికల్ కన్సర్ట్ అందరినీ అలరించింది. భక్త కన్నప్ప స్కిట్, టీ అండ్ టీ సిస్టర్స్ నృత్య ప్రదర్శన, ఘర్షణ బ్యాండ్, అంజనా సౌమ్య, సృష్టి చిల్లాల ఫర్మార్మెన్స్‌లు ఆకట్టుకున్నాయి. చిన్నారులు ప్రదర్శించిన కళారూపాలు, వివిధ స్కిట్‌లు ఆకట్టుకున్నాయి.

**శుభాకాంక్షలు తెలిపిన సీఎం, డిప్యూటీ సీఎం**

సంస్కృతి సంప్రదాయాల కలబోతగా న్యూయార్క్ వేదికగా నైటా నిర్వహిస్తున్న కార్యక్రమాలను ప్రశంసిస్తూ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, న్యూయార్క్ కాన్సులేట్ జనరల్ ప్రత్యేక సందేశాలు పంపారు. అమెరికాలో స్థిరపడిన కూడా పుట్టిన ప్రాంతం పండుగలు, సంప్రదాయాలను గౌరవిస్తూ కొనసాగిస్తున్నామని, వేడుకల విజయాన్ని ఆకాంక్షిస్తూ సహకరించిన అందరికీ ఈ సందర్భంగా నైటా అధ్యక్షుడు రవీందర్ కోడెల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నైటా వైస్ ప్రెసిడెంట్ హరిచరణ బొబ్బిలి, సెక్రటరీ మహేశ్ బాబు, ట్రెజరర్ డాక్టర్ సౌమ్య శ్రీ, ఇతర కార్యవర్గ సభ్యులు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, అడ్వయిజరీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## హాకీ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో ప్రతిష్టాత్మక మహిళల హాకీ ప్రపంచ కప్ 2026 క్వాలిఫైయర్స్ టోర్నమెంట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. భారత్‌కు ఉరుగ్వే జట్టుకు మధ్య మ్యాచ్‌ను ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. వచ్చే ఆగస్టులో బెల్జియం, నెదర్లాండ్స్‌లో జరగనున్న ప్రపంచ హాకీ కప్ కోసం క్వాలిఫైయర్స్ మ్యాచ్‌లు హైదరాబాద్‌లో జరుగుతున్నాయి. 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరగనున్న ఈ క్వాలిఫైయింగ్ మ్యాచ్‌ల టోర్నమెంట్‌లో 8 దేశాలు పాల్గొంటున్నాయి. గ్రూప్--ఏలో ఆస్ట్రియా, ఇంగ్లండ్, ఇటలీ, కొరియా దేశాలు, గ్రూప్--బీలో ఇండియా, స్కాట్లాండ్, ఉరుగ్వే, వేల్స్ జట్లు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, తెలంగాణ ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## 'ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి'

**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళలను, మాతృత్వాన్ని జరుపుకునే రోజున సురక్షితమైన, ఆరోగ్యకరమైన గర్భధారణకు ప్రాధాన్యత ఇవ్వడం గురించి ఈ చొరవ ఒక శక్తివంతమైన సందేశాన్ని పంపుతుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గర్భస్థ శిశువుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేకమైన, సమగ్రమైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా నగరంలోని వెస్ట్‌ఎండ్ మాల్లో ఏర్పాటు చేసిన 'నెస్ట్ ఫీటల్ మెడిసిన్ సెంటర్'ను ఆదివారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, జి.కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. డా. అమిత ఇందర్సేన్ మాట్లాడుతూ.. అత్యాధునిక సామర్థ్యాలు, అంకితభావం కలిగిన బృందంతో తల్లులు, శిశువుల కోసం సురక్షితమైన గర్భధారణలు మెరుగైన ఫలితాలను అందించాలని ఈ కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ ఎమ్మెల్యే రామచంద్ర రెడ్డి, దీపక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖ కృత్రిమ మేధను సమర్థవంతంగా వినియోగించుకోవాలి: మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్ పెన్ పవర్:** మారుతున్న కాలానికి అనుగుణంగా నేర పరిశోధనలో అత్యాధునిక కృత్రిమ మేధ సాంకేతికతను పోలీసు శాఖ సమర్థవంతంగా వినియోగించుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. గండిపేట మండలం బండ్లగూడలోని ఆర్.బి.వి.ఆర్.ఆర్. తెలంగాణ పోలీస్ అకాడమీలో ఆదివారం 'తెలంగాణ పోలీస్ రిట్రీట్–2026' ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను తొలిసారి శాసనసభ్యుడిగా ఎన్నికైన సమయంలో రాష్ట్రంలో తీవ్రవాదం విస్తృతంగా ఉండేదన్నారు. పోలీసు అధికారుల అలుపెరగని కృషి, త్యాగాల వల్ల నేడు తీవ్రవాదం అంతమైందన్నారు. సెలవులు కూడా లేకుండా విధులు నిర్వర్తిస్తూ, ఎందరో అధికారులు, సిబ్బంది ప్రాణత్యాగం చేశారనీ, వారి సేవలకు ఎప్పటికీ గౌరవం ఉంటుందని కొనియాడారు. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా పోలీసింగ్ వ్యవస్థను సిద్ధం చేయడమే ఈ రిట్రీట్ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. పోలీసు అధికారులు తమ విధి నిర్వహణలో ప్రజలకు వాస్తవంగా న్యాయం చేస్తున్నామా? లేదా? అని స్వీయ విమర్శ చేసుకోవాలని మంత్రి సూచించారు.

**వాస్తవికతకు దగ్గరగా ఉండాలి..**

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలకు నమ్మకం కలిగించినప్పుడే వ్యవస్థకు గుర్తింపు వస్తుందన్నారు. ఈ రెండు రోజుల రిట్రీట్ ద్వారా సమీక్షించుకుని, తెలంగాణ పోలీస్ శాఖకు మరింత ఖ్యాతి తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం డీజీపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. రిట్రీట్ లో జరిగే చర్చలు వాస్తవికతకు దగ్గరగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పోలీసు శాఖలో చేపట్టాల్సిన సంస్కరణలపై మేధోమథనం జరగాలన్నారు. ఓపెన్ ఫోరంలో అధికారులు తమ అభిప్రాయాలను నిర్భయంగా వెల్లడించి, వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు. మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పోలీసు సిబ్బంది నియామకం ఎప్పుడూ సాధ్యపడదని, అందుకే అందుబాటులో ఉన్న వనరులతోనే పనితీరును ఎలా మెరుగుపరుచుకోవాలో యోచించాలన్నారు.

**లోతైన చర్చలు జరిపి నివేదికలు రూపొందిస్తాం..**

ప్రస్తుతం దేశంలోనే తెలంగాణ పోలీస్ అగ్రస్థానంలో ఉందని, ఆ స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మరో మాజీ డీజీపీ హెచ్.జె. దొర మాట్లాడుతూ.. అధికారులు తమ అనుభవాలను రంగరించి శాంతిభద్రతల పరిరక్షణలో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో అధికారులను ఆరు గ్రూపులుగా విభజించినట్లు తెలిపారు. వివిధ అంశాలపై లోతైన చర్చలు జరిపి నివేదికలు రూపొందిస్తామని వివరించారు.

ఈ కార్యక్రమంలో టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్, శాంతి భద్రతల అదనపు డిజిపి మహేష్ ఎం భగవత్, గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీపీ అనిల్ కుమార్, 'ఈగల్' డైరెక్టర్ సందీప్ శాండిల్య, సైబరాబాద్ సిపి డాక్టర్ ఎం. రమేష్ సహా పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# నేరాలపై 'ట్రిపుల్ టీ' వ్యూహం



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్య సాధనలో పోలీసుల పాత్ర కీలకమని , ప్రజల నమ్మకాన్ని చూరగొన్నప్పుడే అసలైన పోలీసింగ్ సాధ్యమవుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. నక్సలిజంపై పోరాటంలో అసువులు బాసిన పోలీస్ అమరవీరులను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు స్మరించుకున్నారు. వారి త్యాగం వృథా కాలేదన్నారు. ఆర్బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో 'తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్ 2026' పేరిట ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'ఫ్యూచర్ రెడీ' పోలీసింగ్‌లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలపాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని మంత్రి తెలిపారు.

రాబోయే రోజుల్లో పోలీసింగ్‌లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు 'ట్రిపుల్ టీ'(టెక్నాలజీ, ట్రస్ట్, టాలెంట్) వ్యూహంతో ముందుకెళ్తున్నామన్నారు. ప్రొఫెషనలిజం, ఆపరేషనల్ రెడీనెస్, లీడర్‌షిప్, ఇన్నోవేషన్, కొలాబరేషన్ , ఎథిక్స్ తో కూడిన ఫ్యూచర్ రెడీ పోలీసింగ్ ఆవశ్యకమన్నారు. టెక్నాలజీ ఎనేబుల్డ్ పోలీసింగ్ లో తెలంగాణ ముందు వరుసలో ఉందన్నారు. రాబోయే రోజుల్లో డేటా అనలిటిక్స్, ఏఐ లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ సాయంతో నేరాల జరగకముందే అడ్డుకునే 'ప్రెడిక్టివ్ పోలీసింగ్'కు పెద్దపీట వేస్తామన్నారు. ప్రస్తుతం నేరగాళ్లకు ఆయుధాలతో పనిలేదని, స్మార్ట్ ఫోన్, డేటా, డిజిటల్ ఐడెంటిటీస్ తో నేరాలకు పాల్పడుతున్నారన్నారు. 2024లో దేశవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు రూ.22,845 కోట్లు కొల్లగొట్టారని, అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది 206 శాతం ఎక్కువన్నారు. సైబర్ బాధితుల్లో నిరక్షరాస్యుల కంటే అక్షరాస్యులే అధికంగా ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డీప్‌ఫేక్ వీడియోలు, వాయిస్ క్లోనింగ్, ఆటోమేటెడ్ ఫిషింగ్ స్కామ్‌లు పోలీసులకు పెను సవాల్‌గా మారాయన్నారు. కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష భిష్త్, రిటైర్డ్ డీజీపీ మహేందర్ రెడ్డి , ఏ డీజీపీ మహేష్ భగవత్ , తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ఫోకస్.. మంత్రి దామోదర కీలక ప్రకటన


**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళలకు అవకాశం ఇస్తే అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తారని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఒక మహిళ చదువుకుంటే ఒక తరమే ముందుకు వెళుతుందని, మహిళలకు ప్రాధాన్యం ఇచ్చే సమాజమే నిజమైన అభివృద్ధి చెందిన సమాజం అని మంత్రి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని ఆదివాసీ భవన్‌లో ఆదివారం జరిగిన వేడుకల్లో మంత్రి సీతక్కతో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆదివాసీ భవన్‌లో ఏర్పాటు చేసిన డయాగ్నస్టిక్, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, ఫీడింగ్ కియోస్క్ స్టాళ్లను మంత్రులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆడిటోరియంలో మహిళల ఆరోగ్య పరీక్షలు, క్యాన్సర్ టీకాలపై రూపొందించిన షార్ట్ వీడియోస్‌ను ప్రదర్శించారు. ఉద్యోగ రీత్యా వేరే ప్రాంతాల్లో ఉండే మహిళల భద్రత, వసతి కోసం ప్రత్యేకంగా రూపొందించిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఆన్‌లైన్ బుకింగ్ పోర్టల్‌ను, సెర్ప్ గతేడాది సాధించిన విజయాలకు సంబంధించిన బుక్‌లెట్‌ను మంత్రులు ఆవిష్కరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా సంఘాల సభ్యులను మంత్రులు సన్మానించారు.

ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ... మహిళలు ఎదగడానికి ఆకాశమే హద్దని, అవకాశం ఇస్తే వారు అసాధ్యాన్ని కూడా సాధిస్తారని కొనియాడారు. మహిళా సాధికారత కేవలం సంక్షేమ నినాదం కాదని, అది దేశ అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగానే కాదు, ఆరోగ్యంగానూ బలంగా ఉండాలనే ఉద్దేశంతో వారి కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా డ్వాక్రా మహిళల కోసం ఉచిత హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో ఉన్న 4.37 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని దాదాపు 46 లక్షల మంది మహిళలకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు. సెర్ప్ సహకారంతో మహిళలను సమీప పీహెచ్‌సీలకు తీసుకెళ్లి బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి 30 రకాల కీలక పరీక్షలు ఉచితంగా చేయిస్తున్నామన్నారు. ఆరోగ్య పరీక్షల అనంతరం ప్రతి మహిళకు క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ హెల్త్ రికార్డును సృష్టించి, ఈ – హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో భద్రపరుస్తారని మంత్రి వెల్లడించారు. దీనివల్ల భవిష్యత్తులో వారి ఆరోగ్య సమస్యలను సులభంగా గుర్తించి చికిత్స అందించవచ్చని మంత్రి వివరించారు.

**సుమారు 3,200 సర్వికల్ క్యాన్సర్ కేసులు...**

మన దేశంలో మహిళల్లో రొమ్ము క్యాన్సర్ తర్వాత అత్యధికంగా వేధిస్తున్న సర్వైకల్ (గర్భాశయ ముఖ ద్వార) క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఏటా సుమారు 3,200 సర్వికల్ క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని, దీని నివారణకు హెచ్‌పీవీ టీకా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. 14 ఏళ్లు నిండిన సుమారు 4లక్షల మంది బాలికలకు ఈ టీకా వేస్తున్నామని తెలిపారు. బయట మార్కెట్లో రూ.3 వేల నుంచి రూ.4 వేల విలువ చేసే గార్డాసిల్–4 టీకాను ప్రభుత్వ ఆసుపత్రుల్లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఉచితంగా అందిస్తున్నట్లు ప్రకటించారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# ఉమెన్ కాదు.. మల్టీ టాస్కర్!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆడపిల్ల పుట్టింది అంటే చాలు భారంగా భావించే సమాజంలో ఆడపిల్ల ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఒక మల్టీ టాస్కర్ అనే విషయాన్ని ఎందుకు మరిచిపోతున్నారు. కోడి కూయక ముందే తెలవారకముందే నిద్రలేచే అమ్మ నిజంగానే మల్టీ టాస్కర్.. తల్లిగా, భార్యగా, కూతురిగా, కోడలిగా ఏకకాలంలో అన్ని బాధ్యతలు నెరవేర్చగల ఏకైక ఎక్స్పర్ట్. ఇంట్లో జీతం తీసుకోని .. రిటైర్మెంట్ అడగని గృహిణి.. కుటుంబాన్ని నడిపించే ఆర్థికవేత్త.. ఓపిక ఆమె బలం అయితే సహనం ఆమె ఆభరణం.. ప్రేమ పంచడంలో దైవానికి మించింది. అవకాశాల్ని అందిపుచ్చుకొని.. అడ్డంకులను దాటుకొని.. తమను నిరూపించుకొని ..ఈ ప్రపంచానికి వెలుగు నిచ్చే ప్రతి మహిళా కూడా ఒక మల్టీ టాస్కర్ అనే చెప్పాలి.

**అసలైన మల్టీ టాస్కర్..**

మహిళలు కేవలం వంటింటికే పరిమితం అనే కాలం నుండి బయటకు వచ్చి నేడు అంతర్జాతీయంగా గుర్తింపు సొంతం చేసుకుంటున్నారు. ప్రాంతీయంతో సంబంధం లేకుండా.. భాషతో పట్టింపు లేకుండా.. దేశవ్యాప్తంగా కాదు అటు ప్రపంచవ్యాప్తంగా.. రాజ్యాలను ఏలుతూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆడపిల్ల అంటే అమాయకురాలు కాదు శక్తి అని నిరూపిస్తూ అన్నింటా తానై ఉంటూ అందరికీ అండగా నిలుస్తూ సమాజాన్ని ముందుకు నడిపించడంలో ప్రథమ పాత్ర పోషిస్తున్నారు.

**కుటుంబానికి అండగా.. సమాజ అభివృద్ధికై పోరాడుతూ..**

మహిళా అంటే ప్రయాణించేదే కాదు అటు బైక్ ని మొదలుకొని విమానాన్ని కూడా అవలీలగా నడిపేస్తూ ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరుస్తూ.. ప్రాణం యొక్క విలువను అందరికీ నేర్పిస్తుంది. ఆడది లేనిదే సమాజమే లేదు అనేంతలా ప్రతి చోట తానే ఉంటూ ప్రతిక్షణం కంటికి రెప్పలా అటు కుటుంబాన్ని ఇటు కన్నబిడ్డలని కాపాడుకుంటూ ముందుకు వెళ్తున్న ప్రతి మహిళకి వందనం.ఇంతటి చేసిన మహిళకంటూ ఒక రోజున కేటాయించాలని ప్రపంచ దేశాలన్నీ కలిపి మార్చి 8వ తేదీని ఎంపిక చేసుకున్నాయి. అలా నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. మహిళల పట్ల గౌరవం, ప్రశంశ, ప్రేమ, మహిళల ఆర్థిక , రాజకీయ, సామాజిక విజయాలను జరుపుకోవడం ఈ రోజు యొక్క ప్రత్యేకత. వివిధ రంగాలలో విశేష సేవలు అందించిన ప్రతి మహిళను గౌరవిస్తూ ఆమె కష్టానికి తగిన ప్రతిఫలం అందించే రోజు..


**2026 అంతర్జాతీయ మహిళా దినోత్సవం థీమ్..**

మరి ఈ 2026 అంతర్జాతీయ మహిళా దినోత్సవం థీమ్ ఏంటి అనే విషయానికి వస్తే.." గివ్ టు గెయిన్".. ప్రపంచవ్యాప్తంగా విరాళం ఇవ్వడానికి పిలుపు.. ఒకరికొకరు తోడుగా నిలబడడం.. మగవారితో సమానమైన జీతం.. గౌరవం ఇవ్వడం.. డబ్బు రూపంలోనే కాకుండా మనకున్న జ్ఞానాన్ని.. వనరులను పంచుకోవడం ద్వారా మహిళలను పైకి తీసుకురావడం.. మహిళలకు చదువు , శిక్షణ , మంచి అవకాశాలు కల్పించడం , మహిళలు అభివృద్ధి చెందితే మొత్తం సమాజమే పురోగమిస్తుంది అనేది ఈ ఏడాది సందేశం.

**మహిళా దినోత్సవం ఎలా ప్రారంభమైంది?**

మహిళా దినోత్సవం వెనుక ఒక పెద్ద పోరాటమే జరిగిందనే చెప్పాలి.. ఫిబ్రవరి 28 1909న అమెరికాలోని సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో న్యూయార్క్ నగరంలో తొలిసారి ఈ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. జర్మనీకి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త క్లారా జెట్కిన్ మహిళా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహించాలని ఆమె ప్రతిపాదన తీసుకొచ్చారు. ఇక ఆమె ప్రతిపాదనను అంగీకరించిన తర్వాత మార్చి 19 1911న మొదటిసారి జర్మనీ, డెన్మార్క్, స్విట్జర్లాండ్ , ఆస్ట్రియా దేశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఒక మహిళలకు ఓటు హక్కు కల్పించాలని, పని ప్రదేశాలలో మెరుగైన సౌకర్యాలు కనిపించాలని.. డిమాండ్ చేస్తూ భారీ మెరుగు ర్యాలీలు కూడా నిర్వహించారు. అలా ఐక్యరాజ్యసమితి 1975లో దీనిని అధికారికంగా ప్రకటిస్తూ.. ప్రపంచమంతా మార్చి 8న జరుపుకోవాలని సూచించింది అలా అప్పటి నుంచి ఈ మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

# అసెంబ్లీ సమావేశాలు... బాబు ఊహించనంత సూపర్ హిట్..!



**హైదరాబాద్ పెన్ పవర్:** అసెంబ్లీ సమావేశాలు 15 రోజుల పాటు కొనసాగాయి. అదే విధంగా శాసనమండలి సమావేశాలు కూడా 15 రోజులు పాటు సాగాయి. మొత్తం సమావేశాల్లో వైసిపి ఆది నుంచి చెప్పినట్టుగానే అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరయింది. కేవలం గవర్నర్ ప్రసంగం రోజు మాత్రమే వైసిపి సభకు వచ్చింది. అనంతరం సభను పూర్తిస్థాయిలో బాయికాట్ చేశారు. మరోవైపు శాసనమండలిలో వైసిపి సభ్యులు పూర్తిస్థాయిలో హాజరయ్యారు. ముఖ్యంగా ప్రభుత్వ విధానాలను అదే సమయంలో తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించి శ్రీవారి లడ్డు ప్రసాదంలో కల్తినెయ్యి వినియోగంపై చర్చ వంటి అంశాల్లో వైసిపి బలమైన గళం వినిపించింది.

అసెంబ్లీ విషయాన్ని చూసుకుంటే మాత్రం ఈ 15 రోజుల్లో 75 గంటల పాటు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో ఎక్కువగా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి నియోజకవర్గాల్లో పరిస్థితులు అదే విధంగా వైసిపి హయాంలో జరిగిన అవినీతి అక్రమాలు వంటి కీలక అంశాలపై సభ్యులు చర్చించారు. అదేవిధంగా బడ్జెట్ కేటాయింపులు, సంక్షేమ పథకాలకు నిధుల పెంపు వంటి అంశాలపై కూడా ఈ సమావేశాల్లో కీలకంగా చర్చలు జరిగాయి.

ఓ రకంగా అసెంబ్లీలో కూటమి పార్టీలు అర్థవంతమైన చర్చలు చేశాయనే వాదన బలంగా వినిపించింది. విపక్షం లేకపోతే సభలో కేవలం ప్రశంసలు వంటి వాటికే అవకాశం ఉంటుందని భావించే వారికి అసెంబ్లీ ఈసారి చాలా భిన్నంగా కనిపించింది. ఒకవైపు అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ప్రశ్నించడం దానికి మంత్రులు సమాధానం ఇవ్వడం బలమైన ప్రశ్నలే ఎమ్మెల్యేలు కూడా అడగడంతో సభ సజావుగానే అర్థవంతంగా సాగిందన్న వాదన వినిపించింది.ఇక మండలి విషయానికి వస్తే అటు వైసీపీ ఇటు కూటమి పార్టీలు పైచేయి సాధించేందుకు ప్రయత్నించాయి. తిరుమల లడ్డు వివాదంపై వైసిపి నేతలు అదేవిధంగా కూటమి పార్టీల నేతలకు జరిగిన వివాదాలు మాటల మంటలు రూపాయి. ఇదే సమయంలోమండలి చైర్మన్ మోషన్ రాజు కుల ప్రస్తావన జగన్ మతప్రస్తావన వంటివి కూడా మండలిలో ఆగ్రహా వేశాలకు, సభ్యుల మధ్య తీవ్ర వివాదానికి దారితీసాయి.ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన టిడిపి నాయకుడు తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్న ప్రతిపాదన ఈసారి కూడా అసెంబ్లీలో మాత్రమే పాస్ అయింది. శాసనమండలిలో దానిని ప్రవేశపెట్టాల్సి ఉంది కానీ అది ప్రవేశ పెట్టలేదు. మరి దీన్ని బట్టి దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది అన్నది చూడాలి. మొత్తంగా చూస్తే అసెంబ్లీలో టిడిపిది, మండలిలో వైసీపీ ఇటు కూటమి పార్టీలు పరస్పరం పై చేయి సాధించేందుకు చేసిన ప్రయత్నాలు చేశాయి.

# భారత విద్యతో నేపాల్ గద్దెపైకి.. ర్యాపర్ నుంచి ప్రధానిగా బాలెన్ షా అద్భుత ప్రస్థానం!

**హైదరాబాద్ పెన్ పవర్:** నేపాల్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. జెన్ జీ ఉద్యమానికి ప్రతీకగా ఎదిగిన యువ నాయకుడు బాలెన్ షా ఇప్పుడు ఆ దేశ ప్రధాని పీఠానికి చేరువ కావడం విశేషం. సంప్రదాయ రాజకీయ శైలికి భిన్నంగా యువత ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ ఆయన చేసిన రాజకీయ ప్రయాణం ప్రస్తుతం నేపాల్లో పెద్ద చర్చగా మారింది. ముఖ్యంగా ఆయన ఉన్నత విద్య భారత్లో పూర్తి చేయడం ఈ పరిణామానికి మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది.నేపాల్ పార్లమెంటు ఎన్నికల్లో బాలెన్ షా నేతృత్వంలోని రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్ఎస్పీ) ఆశ్చర్యకర విజయాన్ని సాధించింది. మొత్తం 165 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ఇప్పటి వరకు వచ్చిన ఫలితాల ప్రకారం ఆర్ఎస్పీ 104 స్థానాలు గెలుచుకోగా.. మరో 21 స్థానాల్లో లీడింగ్లో కొనసాగుతోంది. దీంతో ప్రభుత్వం ఏర్పాటు దిశగా పార్టీ బలంగా అడుగులు వేస్తోంది. బ్యాలెట్ పేపర్ విధానంలో పోలింగ్ జరగడం వల్ల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొంత ఆలస్యంగా సాగుతున్నప్పటికీ, ఆదివారం సాయంత్రానికి పూర్తి ఫలితాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

బాలెన్ షా వ్యక్తిగత ప్రయాణం కూడా అంతే ఆసక్తికరంగా ఉంటుంది. 1990 ఏప్రిల్లో కాఠ్మాండులో జన్మించిన ఆయన చిన్నప్పటి నుంచే చదువులో ప్రతిభ చూపాడు. సివిల్ ఇంజినీరింగ్లో డిగ్రీ పూర్తిచేసిన తరువాత ఉన్నత విద్య కోసం భారత్ను ఎంచుకున్నాడు. బెంగళూరులోని విశ్వేశ్వరయ్య టెక్నికల్ యూనివర్సిటీలో 2016 నుండి 2018 వరకు స్ట్రక్చరల్ ఇంజినీరింగ్లో ఎంటెక్ పూర్తి చేశాడు. భారత విద్యా వ్యవస్థలో పొందిన సాంకేతిక పరిజ్ఞానం, విశాల దృక్పథం ఆయన ఆలోచనా విధానాన్ని మరింత పదును పెట్టిందని విశ్లేషకులు చెబుతున్నారు.

ఇంజినీరింగ్ విద్యతో పాటు బాలెన్ షా కళారంగంలో కూడా ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. రాప్ సంగీతం ద్వారా యువతలో అవగాహన కల్పిస్తూ అవినీతి వ్యతిరేక సందేశాలను ప్రసారం చేశాడు. సమాజంలోని అన్యాయాలపై ఆయన రాసిన పాటలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయనకు



లక్షలాది మంది యువత మద్దతు లభించింది.రాజకీయాల్లోకి ఆయన ప్రవేశం 2022లో జరిగింది. ఆ సంవత్సరం కాఠ్మాండు మేయర్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి సంచలన విజయాన్ని నమోదు చేశాడు. మేయర్గా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ నిర్మాణాలు తొలగించడం, రహదారుల అభివృద్ధి, తాగునీటి సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో కఠిన నిర్ణయాలు తీసుకొని ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుకున్నాడు. ఇదే ఆయనను జాతీయ రాజకీయాల్లో ముందుకు నడిపింది.తాజా పార్లమెంటు ఎన్నికల్లో జాపా నియోజకవర్గం నుంచి పోటీ చేసిన బాలెన్ షా 68,348 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించాడు. మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలిపై 49,614 ఓట్ల తేడాతో గెలవడం ఆయన రాజకీయ బలాన్ని చూపిస్తోంది. ఎన్నికల ప్రచారంలో గ్రేటర్ నేపాల్ మ్యాప్ను ప్రస్తావిస్తూ కాలాపానీ, లిపులేఖ్ వంటి భూవివాదాలపై దృష్టి సారించాడు.అయితే విదేశాంగ విధానంలో ఆయన సమతుల్యతను పాటించనున్నట్లు సంకేతాలు ఇచ్చారు. భారత్తో ఓపెన్ బోర్డర్ వాణిజ్యం, జలవిద్యుత్ ప్రాజెక్టులు, అగ్నివీర్ వంటి అంశాలపై పరస్పర సహకారం కొనసాగించే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. యువత మద్దతుతో ఎదిగిన బాలెన్ షా నిజంగా నేపాల్ రాజకీయాల్లో కొత్త మార్పులకు నాంది పలుకుతారా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## హైదరాబాద్ రియల్ ఎస్టేట్ గుట్టు.. మెరిసేవన్నీ బంగారం కాదు.. బేరం ఆడితేనే లాభం!



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ రంగం జోరు మీద ఉన్నట్లు మనకు అనిపిస్తుంది. ఎక్కడ చూసినా భారీ అపార్ట్మెంట్ కాంప్లెక్స్లు, ఆకాశాన్ని తాకే ఎత్తైన టవర్లు వెలుస్తున్నాయి. అయితే, భారీ ప్రకటనలు చూసి మార్కెట్ అంతా డిమాండ్తో నిండిపోయింది అనుకుంటే మనం పొరపడ్డట్లే. నిజానికి, ఎత్తైన గేటెడ్ కమ్యూనిటీలలో చాలా ఫ్లాట్లు ఇప్పటికీ అమ్ముడుపోకుండా ఖాళీగా ఉన్నాయి.

**ధరల వెనుక అసలు రహస్యం**

మార్కెట్లో ఫ్లాట్లు మిగిలిపోయినా ధరలు ఎందుకు తగ్గడం లేదనేది చాలా మందిని వేధించే ప్రశ్న. ఇక్కడే డెవలపర్లు తమ తెలివితేటలను ప్రదర్శిస్తున్నారు. మొదట ధరను చాలా ఎక్కువగా నిర్ణయించి, ఆ తర్వాత స్వల్పంగా తగ్గింపులు ఇస్తున్నట్లు ప్రకటిస్తారు. ఇది చూసి కొనుగోలుదారులు ఏదో పెద్ద అవకాశం అనుకొని పోటీ పడుతుంటారు. కానీ నిజానికి ఇది ఒక ఫుట్పాత్ వ్యాపారం లాంటిదని నిపుణులు చెబుతున్నారు. అంటే, ఇక్కడ మనం ఎంత గట్టిగా బేరం ఆడితే అంత లాభం అన్నమాట.

**బేరసారాలే పెట్టుబడి!**

ఒక కొనుగోలుదారుడు చేతిలో చెక్కు పట్టుకొని సీరియస్గా బేరం కుదిరితే, చదరపు అడుగుకు (రాఖీ) సుమారు రూ. 2 వేల వరకు కూడా తగ్గింపు పొందే అవకాశం ఉంది. బలమైన ఆర్థిక అండదండలు ఉన్న పెద్ద డెవలపర్లు ధర తగ్గించడానికి ఇష్టపడకపోవచ్చు కానీ, అనేక ఇతర ప్రాజెక్టులలో మాత్రం వ్యూహాత్మకంగా బేరం ఆడితే భారీ తగ్గింపులు లభిస్తున్నాయి. మార్కెట్లో పోటీ ఎక్కువగా ఉండటంతో, సీరియస్ కొనుగోలుదారుని కోల్పోవడానికి ఏ బిల్డర్ సిద్ధంగా లేడు.

**షాకింగ్ ఉదాహరణలు**

ఒక సాఫ్ట్వేర్ ఇంజినీర్ చెప్పిన ఒక ఉదాహరణ చూస్తే మనం ముక్కున వేలు వేసుకోవాల్సిందే. తెల్లాపూర్ ప్రాంతంలో ఒక ఫ్లాట్ అధికారిక ధర చదరపు అడుగుకు రూ. 7 వేలు ఉంటే, ఆయన స్నేహితుడు గట్టిగా బేరం ఆడి దానిని కేవలం రూ. 4500 కే సొంతం చేసుకున్నాడు. అంటే ఏకంగా రూ. 2500 తగ్గింపు లభించింది. రాజేంద్రనగర్, కోకాపేట, గచ్చిబౌలి, కొండాపూర్ వంటి ప్రాంతాల్లో కూడా ఇవే పరిస్థితులు ఉన్నాయి. అక్కడికక్కడే గణనీయమైన అడ్వాన్స్ లేదా పూర్తి మొత్తం చెల్లించడానికి సిద్ధపడితే భారీ డీల్స్ కుదురుతున్నాయి.


**నియోపోలిస్ ప్రాంతంలోనూ ఇదే పరిస్థితి**

ఈ భారీ తగ్గింపుల పర్వం కేవలం పాత ఏరియాలకే పరిమితం కాలేదు, కొత్తగా వస్తున్న నియోపోలిస్ వంటి ఖరీదైన ప్రాంతాల్లో కూడా తన ప్రభావం చూపుతోంది. సాఫ్ట్వేర్ సహచరులు, స్నేహితులు చాలా మంది ఇలాంటి వ్యూహాత్మక ఒప్పందాల ద్వారా గణనీయమైన మొత్తాన్ని ఆదా చేయగలిగారు. కొనుగోలుదారుడు అక్కడికక్కడే భారీ మొత్తంలో అడ్వాన్స్ చెల్లించడానికి లేదా కొన్ని సందర్భాల్లో పూర్తి పేమెంట్ ఒకేసారి చేయడానికి సిద్ధంగా ఉంటే, బిల్డర్లు కూడా అడిగినంత తగ్గింపు ఇవ్వడానికి ముందుకు వస్తున్నారు. ఇది రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న తీవ్రమైన పోటీని, అమ్ముడుపోని ఇన్వెంటరీ ఒత్తిడిని స్పష్టంగా తెలియజేస్తోంది.

**అప్రమత్తంగా ఉండాలి**

మరిన్ని అపార్ట్మెంట్ కాంప్లెక్స్లు, ఎత్తైన టవర్లు నిరంతరాయంగా నిర్మితం అవుతుండటంతో సరఫరా అనేది డిమాండ్ను మించిపోయింది. ఈ విచిత్రమైన పరిస్థితి వల్ల మార్కెట్లో స్పష్టమైన అనిశ్చితి నెలకొంది, అందుకే కొనుగోలుదారులు ప్రకటనల్లో కనిపించే బోల్డ్ ధరలను చూసి భయపడకుండా దృఢంగా బేరసారాలు జరపడం ముఖ్యం. సీరియస్ కొనుగోలుదారులు తమ ఆర్థిక వెసులుబాటును బట్టి సరైన సమయంలో సరైన డీల్ను కుదుర్చుకుంటే, భవిష్యత్తులో అది ఒక గొప్ప పెట్టుబడిగా మారుతుందనడంలో సందేహం లేదు.హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్లో కొనుగోలుదారులదే పైచేయిగా ఉంది. అమ్ముడుపోని ఫ్లాట్లు కోకొల్లలుగా ఉండడంతో, బిల్డర్లు ఆకర్షణీయమైన ఆఫర్లతో వేచి చూస్తున్నారు. కాబట్టి, కొత్త ఫ్లాట్ కొనాలనుకునే వారు ప్రకటనల్లోని ధరలను చూసి భయపడకుండా, తమ బేరసారాల నైపుణ్యాలను వాడితే లక్షల రూపాయల ఆదా చేసుకోవచ్చు. ఇల్లు కొనడం అంటే కేవలం ఇన్వెస్ట్మెంట్ మాత్రమే కాదు, అది ఒక తెలివైన ఒప్పందం కూడా!

## మాయా లోకం 'ఒరెగాన్ వోర్టెక్స్'... ఎత్తు కూడా మారిపోతుందా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలో ఎన్నో వింతలు మనిషి అర్థానికి అందకుండా ఇంకా రహస్యంగానే మిగిలిపోయాయి. అలాంటి ఆశ్చర్యకరమైన ప్రదేశాల్లో అమెరికాలోని ఒరెగాన్ వోర్టెక్స్ ఒకటి. ప్రకృతి నియమాలనే సవాలు చేస్తూ కనిపించే ఈ ప్రాంతం శాస్త్రవేత్తలకు కూడా ఇప్పటికీ పూర్తిగా అర్థంకాని మర్మంగా నిలిచింది. అమెరికా దేశంలోని ఒరెగాన్ రాష్ట్రంలో ఉన్న ఈ వింత ప్రదేశం పర్యాటకులను విపరీతంగా ఆకర్షిస్తోంది. ఈ ప్రాంతంలో అడుగుపెడితే సాధారణంగా మనం తెలిసిన భౌతిక శాస్త్ర నియమాలు పనిచేయడం లేదన్నట్టుగా అనిపిస్తుంది. ముఖ్యంగా అక్కడ కనిపించే దృశ్యాలు మన కళ్లను, మెదడును గందరగోళానికి గురిచేస్తాయి.

ఈ వోర్టెక్స్ ప్రాంతంలో ఒక చిన్న గుడిసె ఆకారంలోని ఇల్లు ఉంది. ఈ ఇంటి లోపలికి వెళ్తే ఆశ్చర్యకరమైన ఘటనలు కనిపిస్తాయి. ఇద్దరు వ్యక్తులు ఒకే ఎత్తు ఉన్నా, ఒకరు మరోకరితో పోలిస్తే చాలా పొడవుగా లేదా చాలా పొట్టిగా కనిపిస్తారు. ఒకే వ్యక్తి రెండు స్థానాల్లో నిల్చుంటే ఎత్తు మారిపోయినట్టుగా కనిపించడం కూడా ఇక్కడ సాధారణమే.ఇక్కడి మరో విశేషం ఏమిటంటే బంతిని నేలపై ఉంచితే అది కిందికి కాకుండా పైవైపు దొర్లుతున్నట్టుగా కనిపిస్తుంది. కొన్ని సందర్భాల్లో నీరు కూడా గురుత్వాకర్షణకు వ్యతిరేకంగా ప్రవహిస్తున్నట్టుగా కనిపిస్తుంది. ఈ దృశ్యాలు చూసిన వారు నిజంగానే ఇది మాయలోకం అనిపిస్తుందని చెబుతుంటారు.ఈ వింతల వెనుక అసలు కారణం ఏమిటన్నది మాత్రం ఇప్పటికీ స్పష్టంగా తెలియలేదు. కొందరు శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం ఇది కేవలం కంటి భ్రమ మాత్రమే. భూమి ఒరుసు, చెట్ల పెరుగుదల కోణం, భవనం నిర్మాణం అన్ని కలిసి మన కళ్లకు వాస్తవం కాకుండా వేరేలా కనిపించేలా చేస్తాయని వారు చెబుతున్నారు.అయితే మరికొందరు మాత్రం ఇక్కడ భూమి అయస్కాంత క్షేత్రంలో ఏదో ప్రత్యేకమైన మార్పు ఉండొచ్చని భావిస్తున్నారు. ఆ అయస్కాంత ప్రభావం వల్లే మన శరీర సమతుల్యత, దృష్టి భ్రమలు కలుగుతాయని వారు అనుమానిస్తున్నారు.ఏది నిజమో ఇప్పటికీ ఖచ్చితంగా చెప్పలేకపోయినా ఒరెగాన్ వోర్టెక్స్ ప్రపంచంలోని అత్యంత రహస్యమైన ప్రదేశాల్లో ఒకటిగా నిలిచింది. ప్రతి సంవత్సరం వేలాది మంది పర్యాటకులు ఈ వింతను ప్రత్యక్షంగా చూడటానికి అక్కడికి వెళ్తుంటారు.శాస్త్రానికి సవాలు విసురుతున్న ఈ రహస్య ప్రదేశం మనకు ఒక విషయాన్ని మాత్రం గుర్తు చేస్తుంది. ప్రకృతి ముందు మనిషి జ్ఞానం ఇంకా చాలా చిన్నదే. ఇంకా ఎన్నో వింతలు, రహస్యాలు ఈ భూమిలో దాగి ఉన్నాయనే విషయాన్ని ఈ వోర్టెక్స్ మళ్లీ మనకు తెలియజేస్తోంది.

# హ్యాండిచ్చిన బ్రిటన్ కు షాక్ ఇచ్చిన డొనాల్డ్ ట్రంప్



**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా–బ్రిటన్ సంబంధాలు కొత్త మలుపు తిరిగాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకంగా తమ చిరకాల మిత్రదేశమైన బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పశ్చిమాసియా ప్రాంతానికి విమాన వాహక నౌకలను పంపించే విషయంలో యూకే ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడంపై ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఈ అంశంపై ఆయన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చకు దారి తీశాయి. పశ్చిమాసియాలో ఇరాన్‌తో పెరుగుతున్న ఘర్షణల నేపథ్యంలో అమెరికా తన సైనిక బలగాలను భారీగా సమీకరిస్తోంది. ఈ క్రమంలో తమకు మిత్రదేశమైన బ్రిటన్ కూడా సహకరించాలని అమెరికా ఆశించింది. ముఖ్యంగా యూకేకు చెందిన ఆధునిక విమాన వాహక నౌక 'హెచ్‌ఎంఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్'ను పశ్చిమాసియాకు పంపాలని అమెరికా వర్గాలు భావించాయి. అయితే ఈ అంశంపై బ్రిటన్ ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. యూకే రక్షణ మంత్రిత్వశాఖ నౌకను సిద్ధం చేస్తున్నామని తెలిపినా దానిని పశ్చిమాసియాకు తరలించే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. ఈ విషయాన్ని యూకేకు చెందిన ఓ అధికారి మీడియాతో వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే ట్రంప్ స్పందిస్తూ బ్రిటన్ వైఖరిపై తీవ్ర విమర్శలు చేశారు. ఒకప్పుడు యూకే అమెరికాకు అత్యంత సన్నిహిత మిత్రదేశమని గుర్తుచేసిన ఆయన ఇప్పుడు కీలక సమయంలో నిర్ణయం తీసుకోలేకపోవడం నిరాశ కలిగిస్తోందన్నారు. యుద్ధం కీలక దశలో ఉన్నప్పుడు మిత్రదేశాల మద్దతు అవసరమని పేర్కొన్న ట్రంప్.. ఇప్పుడు ఆలస్యంగా మద్దతు తెలిపే అవసరం లేదని వ్యాఖ్యానించారు. "యుద్ధం గెలిచిన తర్వాత చేరే మిత్రులు మాకు అవసరం లేదు. ఈ చర్యను మేము ఎప్పటికీ గుర్తుంచుకుంటాం" అంటూ స్టార్మర్‌కు హెచ్చరికల ధోరణిలో వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉండగా ఇరాన్‌పై జరుగుతున్న యుద్ధంలో తమ బలగాలు ప్రత్యక్షంగా పాల్గొనబోవని బ్రిటన్ ఇప్పటికే ప్రకటించింది. అయితే అమెరికా , ఇజ్రాయెల్ తమ సైనిక స్థావరాలను ఆత్మరక్షణ కోసం ఉపయోగించుకునేందుకు అనుమతిస్తామని బ్రిటన్ ప్రధాని స్టార్మర్ తెలిపారు. ఈ నిర్ణయంపై కూడా ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బ్రిటన్ పూర్తి స్థాయిలో మద్దతు ఇవ్వకపోవడం తాను ఆశ్చర్యపోయేలా చేసిందని వ్యాఖ్యానించారు. ఇక మరోవైపు ఇరాన్ అంశంలో కుర్దుల పాత్రపై కూడా ట్రంప్ తన వైఖరిని మార్చుకున్నారు. ఇరాన్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుర్దులు ముందుకు రావాలని ఇటీవల ఆయన పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అయితే తాజాగా ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ప్రయాణిస్తూ మీడియాతో మాట్లాడిన ట్రంప్ ప్రస్తుతం ఇరాన్‌పై దాడి చేయడానికి కుర్దుల సహకారం అవసరం లేదన్నారు. కుర్దులతో అమెరికాకు మంచి సంబంధాలు ఉన్నాయని కానీ యుద్ధాన్ని మరింత సంక్లిష్టం చేయాలనే ఉద్దేశం తమకు లేదని తెలిపారు. మొత్తంగా పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు కేవలం ప్రాంతీయ రాజకీయాలకే పరిమితం కాకుండా అమెరికా--బ్రిటన్ వంటి మిత్రదేశాల మధ్య సంబంధాలపై కూడా ప్రభావం చూపుతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిస్థితులు భవిష్యత్ అంతర్జాతీయ రాజకీయ సమీకరణాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

# ఫైనల్ పిచ్ ట్యాంపర్.. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ పిచ్చి ఆరోపణలు



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ అంటే ఎప్పుడూ ఇంగ్లండ్ క్రికెటర్లకు చిన్న చూపే.. మన దేశ క్రికెట్ వ్యవస్థ ఎదగడాన్ని వారు ఎప్పటికీ జీర్ణించుకోలేరని మరోసారి స్పష్టమైంది. క్రికెట్ కు పుట్టిల్లయినా.. జెంటిల్మన్ గేమ్ గా పేరున్న ఆటలో వారి తీరు మాత్రం అసహ్యకరమే. ఇది మరింత ఇప్పుడు తేలిపోయింది. అదికూడా భారత్ లో పుట్టి ఇంగ్లండ్ కు కెప్టెన్ గా వ్యవహరించిన క్రికెటర్ కారణంగా కావడం గమనార్హం. టి20 ప్రపంచ కప్ లో టీమ్ ఇండియా మరికొద్ది గంటల్లో న్యూజిలాండ్ తో అహ్మదాబాద్ లో ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. దీనిపై ఇప్పటికే జట్ల విశ్లేషణలు మొదలయ్యాయి. ఎవరి బలం ఎంతో చెప్పేస్తూ విదేశీ కామెంటేటర్లు తమ నోటికి పనిచెబుతున్నారు. ఈ క్రమంలో ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ నాసిర్ హుస్సేన తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. అసలే, టి20 ప్రపంచ కప్ ఫైనల్.. పైగా భారత్ ఆడుతోంది. అందుకే ఇంగ్లండ్ ఆటగాళ్ల సహజ అక్కసును చాటుకున్నాడు.

**అసలు అది సాధ్యమా?**

అహ్మదాబాద్ లో జరిగే ఫైనల్ కు సంబంధించిన పిచ్ ను టీమ్ఇండియాకు అనుకూలంగా ట్యాంపరింగ్ చేసే ప్రయత్నాలు జరిగాయని నాసిర్ హుస్సేన్ ఆరోపించాడు. ఈ మేరకు తనకు వార్తలు వచ్చాయంటూ నోరు జారాడు. తెల్లవారుజామున 1 నుంచి 2 గంటల మధ్య అహ్మదాబాద్ స్టేడియం బయట కొందరు ఉన్నారని.. పిచ్ ఏదో చేసేందుకే వారు ఉన్నారని హుస్సేన్ అన్నాడు. ఇది అక్షరాలా పిచ్ ట్యాంపరింగ్ అని నోరు పారేసుకున్నాడు. ఈ రోజుల్లో అసలు ఇలాంటిది సాధ్యమా? అని కూడా ఆలోచన లేకుండా మాట్లాడాడు.

**టాస్ ను కూడా వదలరంట.. బంతుల్లో చిప్స్ అట**

టీమ్ఇండియాకు పిచ్ ను అనుకూలంగా మార్చుకోవడమే కాదు.. టాస్ ను కూడా అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నాలు సాగుతున్నట్లు తాను విన్నానని హుస్సేన్ కుళ్లును చాటుకున్నాడు. అంతేకాదు.. బంతుల్లో చిప్స్ ఉన్నట్లు వదంతులు వస్తున్నట్లు కడుపు మంట చూపాడు. నిజంగా ఏదో జరుగుతోంది... క్రికెట్ ను తారుమారు చేసే ప్రయత్నం అది అంటూ దుర్బుద్ధి చాటాడు.

**ఇంగ్లండ్ లోనే ఆడాలా?**

సెమీఫైనల్లో టీమ్ఇండియా చేతిలో దారుణ పరాజయంతో ఇంగ్లండ్ టి20 ప్రపంచ కప్ నుంచి నిష్క్రమించింది. ఇది కూడా నాసిర్ హుస్సేన్ ఏడుపునకు కారణమైనట్లుంది. అందుకే, ప్రపంచ కప్ అసలు ఇండియాలో నిర్వహించవద్దంటూ దిక్కుమాలిన సలహా ఇచ్చాడు. శ్రీలంకలో అయితే కప్ బాగా జరుగుతుందని దిక్కుమాలిన సలహా ఇచ్చాడు.

**అసలు భారత మూలాలున్నోడేనా?**

ప్రపంచంలో ఎక్కడున్నా మన మూలం మర్చిపోకూడదు. కానీ, ఇంగ్లండ్ కు కెప్టెన్ గా వ్యవహరించిన నాసిర్ హుస్సేన్ తమ కుటుంబానికి భారత్ తో సంబంధాలున్న సంగతి కూడా మర్చిపోయినట్లున్నాడు. అందుకే, భారత్ వంటి పెద్ద దేశంపై నోరు పారేసుకున్నాడు.

## ఇస్కాన్ దేవాలయం నిర్మాణంతో ఆధ్యాత్మిక సేవలు : కొండా సురేఖ



**హైదరాబాద్ పెన్ పవర్:** సైబరాబాద్ పరిధిలోని నలగండ్లలో నిర్మించబోయే అతిపెద్ద ఇస్కాన్ దేవాలయం నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ కార్యక్రమం రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా అంగరంగ వైభవంగా జరిగింది. ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు మంత్రి కొండా సురేఖకు ఘన స్వాగతం పలికారు. అర్చకులు వేద మంత్రాల నడుమ కొండా సురేఖ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇస్కాన్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మికత, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. భారతీయ సంస్కృతిని ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడంలో వారి పాత్ర గొప్పదని కొనియాడారు. వారు కృష్ణతత్వాన్ని బోధించడంతో పాటుగా పేదవారికి ఆకలి తీర్చడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఈ దేవాలయ నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ కార్యక్రమంలో నేను పాల్గొనడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. గత ప్రభుత్వంలో దేవాలయ నిర్మాణానికి సంబంధించిన భూమి కోసం కాళ్లు అరిగేలా తిరిగారని అయినా వారికి స్థలం కేటాయించలేదని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకొని ఇస్కాన్ దేవాలయం నిర్మాణం కోసం 6000 గజాల భూమిని 22 సంవత్సరాల పాటు లీజ్‌పై కేటాయించినట్లు తెలిపారు. ఇస్కాన్ దేవాలయం నిర్మాణంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి సమాజానికి మేలు జరుగుతుందన్న విశ్వాసం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి, నాయకులు జగదీశ్వర్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇస్కాన్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మూసీ పునరుజ్జీవనానికి భారీ స్కెచ్.. ఫేజ్-1 కోసమే వేల కోట్ల ఖర్చు.. గాంధీ సరోవర్ స్పెషల్ అట్రాక్షన్!



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ అంటే చార్మినార్, బిర్యానీతో పాటు మూసీ నది కూడా అందరికీ గుర్తొస్తుంది. అయితే, ప్రస్తుతం మురుగుతో నిండిపోయిన ఈ నదిని మళ్లీ స్వచ్ఛంగా మార్చేందుకు ప్రభుత్వం 'మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు'ను ప్రతిపాదించింది. ఈ భారీ ప్రాజెక్టు మొదటి దశ (ఫేజ్–1) కోసమే సుమారు రూ. 5,812.4 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేశారు. నగర పర్యావరణ పరిస్థితులను మెరుగుపరచడానికి ఈ ప్రాజెక్టును దశలవారీగా అమలు చేయనున్నారు.

**వేల కోట్ల వ్యయ విభజన**

ఈ ప్రాజెక్టు మొదటి దశను ప్రధానంగా రెండు జోన్లుగా విభజించి పనులు చేపట్టబోతున్నారు. హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు ఉండే జోన్–1 కోసం రూ. 1,684 కోట్లు, అలాగే ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు ఉండే జోన్–2 కోసం రూ. 1,992 కోట్లు ఖర్చు చేయనున్నారు. వీటికి అదనంగా పన్నులు, ఇతర చట్టబద్ధమైన నిబంధనల కోసం మరో రూ. 1,596 కోట్లు అవసరమవుతాయని ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఈ ప్రాజెక్టులో అత్యంత ఆకర్షణీయమైన భాగం 'గాంధీ సరోవర్'. ఇక్కడ పర్యాటకులను ఆకట్టుకునేలా భారీ ఎత్తున నిర్మాణాలు చేపట్టబోతున్నారు. మహాత్మా గాంధీ భారీ విగ్రహం కోసం రూ. 73.8 కోట్లు, ఆ విగ్రహం పీఠం కోసం రూ. 22.6 కోట్లు ఖర్చు చేయనున్నారు. అక్కడే ఒక అత్యాధునిక మ్యూజియం, విగ్రహ సముదాయ భవనాన్ని రూ. 220 కోట్లతో నిర్మించనున్నారు. వీటికి సంబంధించిన ఎలక్ట్రికల్, మెకానికల్ పనుల కోసం మరో రూ. 79 కోట్లు కేటాయించారు.

**ప్రాజెక్ట్ లక్ష్యం ఏంటి?**

కేవలం అందం కోసమే కాదు.. మూసీ నది పర్యావరణ వ్యవస్థను పూర్తిగా పునరుద్ధరించడమే ఈ చొరవ వెనుక అసలు ఉద్దేశం. ఇందులో భాగంగా నదిలోకి మురుగు నీరు చేరకుండా మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపడతారు. వరద యాజమాన్యం, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు, నది ఒడ్డున ప్రజల కోసం బహిరంగ ప్రదేశాలు, సైక్లింగ్ ట్రాక్ లను అభివృద్ధి చేస్తారు. అలాగే నది వెంబడి వంతెనలు, రిటైనింగ్ గోడలు, ట్రంక్ మురుగునీటి లైన్ల నిర్మాణం కూడా ఈ ప్రాజెక్టులో భాగంగా ఉండబోతోంది. మూసీ నది మళ్లీ స్వచ్ఛంగా మారి, గాంధీ సరోవర్ వంటి అద్భుతమైన కట్టడాలతో నగరం కొత్త శోభను సంతరించుకోవాలని కోరుకుందాం. ఈ వేల కోట్ల రూపాయల ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తే, హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరాల సరసన నిలవడం ఖాయం. పేద ప్రజల ఇళ్ల విషయంలో కూడా ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తూ, ఈ అభివృద్ధిని ముందుకు తీసుకువెళితే అందరికీ మేలు జరుగుతుంది.

# ఇరాన్ ఆయువుపట్టుపై కొట్టిన ఇజ్రాయెల్..



**హైదరాబాద్ పెన్ పవర్:** మధ్యప్రాచ్యం మరోసారి అగ్నిగుండంగా మారుతోంది. దశాబ్దాలుగా ఇరాన్–ఇజ్రాయెల్ దేశాల మధ్య కొనసాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం.. ఇప్పుడు ప్రత్యక్ష సైనిక ఘర్షణల రూపంలో అత్యంత ప్రమాదకర మలుపు తీసుకుంది. తాజాగా ఇరాన్ రాజధాని టెహ్రాన్ సమీపంలోని కీలకమైన అక్దసియెహ్ ఆయిల్ డిపోపై జరిగిన దాడి.. ఈ ప్రాంతంలో భద్రతా పరిస్థితులను తలకిందులు చేసింది. ఈ ఘటన కేవలం ఒక ఆయిల్ డిపో విధ్వంసం మాత్రమే కాదు.. ప్రాంతీయ శక్తి సమతుల్యతలో వచ్చిన పెను మార్పుకు నిదర్శనమని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**దాడి ఘటనతో తీవ్రమైన ఉద్రిక్తతలు..**

టెహ్రాన్ ఈశాన్య ప్రాంతంలోని సోహాంక్ పరిధిలో అరాష్ హైవే చివరన ఉన్న అక్దసియెహ్ ఆయిల్ నిల్వ కేంద్రంపై జరిగిన దాడి ఇరాన్ రక్షణ సామర్థ్యాలపై ప్రశ్నలు లేవనెత్తింది. ఈ కేంద్రం నగరానికి ప్రధాన ఇంధన సరఫరా దారుగా పనిచేస్తుంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న దృశ్యాలను బట్టి చూస్తే పేలుళ్ల తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆకాశాన్ని తాకుతున్న భారీ మంటలు.. దట్టమైన నల్లటి పొగ మేఘాలు టెహ్రాన్ నగరాన్ని భీతావహంలోకి నెట్టాయి. సమీప ప్రాంతాల్లోని ప్రజలు విన్న భారీ శబ్దాలు.. ఇది ఒక ప్రణాళికాబద్ధమైన క్షిపణి లేదా డ్రోన్ దాడి అని స్పష్టం చేస్తున్నాయి.

**వ్యూహాత్మక మార్పు: ఇజ్రాయెల్ వ్యూహం**

గతంలో ఇజ్రాయెల్ దాడులు ప్రధానంగా సిరియా లేదా లెబనాన్‌లోని ఇరాన్ అనుకూల మిలిటెంట్ స్థావరాలకే పరిమితమయ్యేవి. అయితే ఇప్పుడు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని వ్యూహాత్మక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం, ఇజ్రాయెల్ తన 'రెడ్ లైన్స్'ను మార్చుకుందని సంకేతం ఇస్తోంది. ఇంధన నిల్వ కేంద్రాలను ధ్వంసం చేయడం ద్వారా ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై అలాగే యుద్ధ సామర్థ్యంపై దెబ్బ కొట్టాలని ఇజ్రాయెల్ భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇది ఇరాన్ సైనిక నాయకత్వానికి ఒక బలమైన హెచ్చరిక అని పరిశీలకుల విశ్లేషణ.

**అంతర్జాతీయ ప్రభావం.. ఆర్థిక పరిణామాలు**

ఈ దాడి ప్రభావం కేవలం ఇరాన్‌కే పరిమితం కాకుండా ప్రపంచ చమురు మార్కెట్లపై పడటం అనివార్యం. ఇప్పటికే మధ్యప్రాచ్యంలో నెలకొన్న అస్థిరత కారణంగా అంతర్జాతీయంగా ఇంధన ధరలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇరాన్ వంటి కీలక చమురు ఉత్పత్తిదారు దేశంలో మౌలిక సదుపాయాలు ధ్వంసమవ్వడం, సరఫరా గొలుసులపై ప్రభావం చూపి, ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే ప్రమాదాన్ని రేకెత్తిస్తోంది. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ద్రవ్యోల్బణం వైపు నెట్టే అవకాశం ఉంది.

ప్రస్తుతం ఇరాన్ ప్రభుత్వం, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయితే, ఈ దాడికి ప్రతీకారంగా ఇరాన్ ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేదే ఇప్పుడు ప్రపంచాన్ని కలవరపెడుతున్న అంశం. ఇది ఒక పూర్తిస్థాయి యుద్ధానికి దారితీస్తే ఫలితాలు ఊహాతీతం. దౌత్యపరమైన పరిష్కారాలు మరుగునపడి, సైనిక చర్యలే రాజ్యమేలుతున్న ప్రస్తుత తరుణంలో మధ్యప్రాచ్య శాంతి మరింత మృగ్యమవుతోంది. రాబోయే గంటలు, రోజులు ఈ ప్రాంత భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

# వైసీపీ లేకపోయినా అసెంబ్లీ రక్తికట్టిందే...!

**హైదరాబాద్ పెన్ పవర్:** అసెంబ్లీ వ్యవహారాలపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన కీలక వ్యాఖ్యలు కూటమి పార్టీల మధ్య చర్చకు దారితీసాయి. సభలో కూటమి పార్టీలకు సంబంధించిన 164 మంది సభ్యులు ఉన్నారు. మంత్రులు సభ్యులకు మధ్య అర్థవంతమైన చర్చలు కూడా నడిచాయి. అదే విధంగా కొందరు ఎమ్మెల్యేలు పదునైన ప్రశ్నలతోనే తమ తమ నియోజకవర్గాల్లోని సమస్యలను ప్రస్తావించారు. ఒక్కొక్క సందర్భంలో అయితే మంత్రులు చేస్తున్న పనులను కూడా వారు నిలదీశారు. దీనిలో బిజెపి, జనసేన అదేవిధంగా టిడిపి సభ్యులు కూడా ఎవరికి వారు తమ తమ పాత్రలను మెరుగ్గా పోషించారని చెప్పక తప్పదు.అయితే ఇది ఎలా ఉన్నప్పటికీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన కీలక వ్యాఖ్యలు ఆసక్తిగా మా రాయి. ప్రతిపక్షం లేకపోతే అసెంబ్లీలో మసాలా లేదని ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని కలిగించాయి. అదే సమయంలో వైయస్ రాజశేఖర్ రెడ్డికి జగన్ కు పోలిక పెడు తూ వైఎస్ రాజశేఖర్ రెడ్డిపై స్పీకర్ చేసిన ప్రశంసలు కూడా కూటమి పార్టీల మధ్య చర్చకు వచ్చాయి. అసెంబ్లీ లాబీల్లో ఈ విషయాన్ని ఎమ్మెల్యేలు చర్చించుకున్నారు. స్పీకర్ తన అలవా టుగా మాత్రమే ఈ వ్యాఖ్యలు చేశారని ఆయనకు ప్రత్యేక ఉద్దేశాలు ఏమీ లేవని టిడిపి ఎమ్మెల్యేలు చెప్పుకొచ్చారు.ఇక స్పీకర్ చెప్పినట్టుగానే అసెంబ్లీలో మసాలా లేదా వైసిపి లేకపోతే అసెంబ్లీకి అందం రాలేదా అనే అం శాలపై కూడా నాయకులు వ్యాఖ్యలు చేశారు. వైపీపీ రాకపో యినా అసెంబీ ్లలో చర్చలు బానే నడిచాయని మంత్రులు కూడా సమాధానం చెప్పారని ఒకానొక దశలో మంత్రి నారా లోకేష్ చేసిన వ్యాఖ్య లను ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. ప్రతిపక్షం లేని లోటును మా సభ్యులు తీర్చేస్తున్నారు అంటూ నారా లోకే ష్ వ్యాఖ్యానించారు.బలమైన ప్రశ్నలతో అదేవిధంగా నిధులు, అధికారుల పనితీరును కూడా గోరంట్ల బచ్చయ్య చౌదరి వంటి సీనియర్ నాయకులు సభలో ప్రస్తావించారు. దీనికి మంత్రులు సమాధానం ఇవ్వాల్సి వచ్చింది. అదే విధంగా బిజెపి సభ్యుడు విష్ణుకుమార్ రాజు కూడా క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను సభ దృష్టికి తీసుకువచ్చి లోపాలను ఎత్తి చూపించారు.

# నితీష్ ఢిల్లీలో కాలు-తేజస్వి నెత్తిన పాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** బీహార్ రాజకీయాల్లో కీలక పరిణామాలు సంభవిస్తున్నాయి. గత ఏడాది చివరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బంపర్ మెజారిటీతో ఎన్డీయే కూటమి గెలిచింది. 243 సీట్లలో 200కి పైగా సీట్లను ఎన్డీయే కూటమి గెలుచుకుంది. విపక్షంలోకి వచ్చిన ఆర్జేడీకి 30కి అటు ఇటుగా సీట్లు మాత్రమే దక్కాయి. జస్ట్ అలా ప్రతిపక్ష హోదా అయితే దక్కింది కానీ ఆర్జేడీ పని అయిపోయింది అన్న మాట వినిపించింది. అయితే కేవలం నాలుగు నెలల తేడాలో ఆర్జేడీ లేచి కూర్చుకునేలా ఎన్డీయే నేతల నిర్ణయాలు ఉంటున్నాయని అంటున్నారు.

**మూడున్నర దశాబ్దాలుగా :**

బీహార్ లో జాతీయ పార్టీలకు గుర్తింపు అయితే లేదు, అవి మనుగడ సాగించాలి అంటే ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకోవాల్సిందే. వాటి జట్టు కట్టాల్సిందే. దశాబ్దాల తరబడి బీహార్ ని ఏలిన కాంగ్రెస్ 1989లో ఓటమి పాలు అయింది. అది లగాయితూ మళ్ళీ గట్టిగా యాభై సీట్లు ఎపుడూ గెలుచుకున్న దాఖలాలు లేవు. జూనియర్ పార్టనర్ గా కాంగ్రెస్ మిగిలిపోయింది. బీజేపీ విషయానికి వస్తే ఆ పార్టీ 2000 దాకా పెద్దగా పెర్ఫార్మ్ చేసింది లేదు. నితీష్ కుమార్ అనే బలమైన రాజకీయ నేత ఇమేజ్ తోనే బీజేపీ ఎదుగుతూ వస్తోంది. ఎంత చేసినా 243 సీట్లు ఉన్న సభలో బీజేపీ పూర్తి మెజారిటీకి ఎపుడూ చేరువ కాలేకపోతోంది.

**పోటీ వారి మధ్యనే :**

ఇక బీహార్ రాజకీయ ముఖ చిత్రం చూస్తే కనుక అవతల లాలూ ప్రసాద్ యాదవ్ ఇవతల నితీష్ కుమార్ ల మధ్యనే రాజకీయం మోహరించి ఉంది. లాలూ హవాను అడ్డుకున్న ఘనత కచ్చితంగా నితీష్ దే. బీహార్ ప్రజలు తమ బిడ్డగా నితీష్ ని భావిస్తారు, అందుకే ఆయన రెండు దశాబ్దాల పాటు సీఎం గా పని చేయగలిగారు. ఇక బీజేపీ కూడా నితీష్ నే నమ్ముకుని తన రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకుంది. జేడీయూలో కూడా నితీష్ వారసులు ఎవరూ లేరు. ఆర్జేడీలో లాలూ కుమారుడు బాగానే రాణిస్తున్నారు. నితీష్ కుమారుడు నిశాంత్ కుమార్ కి రాజకీయంగా ఇంకా అరంగేట్రం లేదు అన్నది గుర్తు చేస్తున్నారు.

**జేడీయూలో వ్యతిరేకత :**

ఇదిలా ఉంటే నితీష్ కుమార్ రాజ్యసభకు వెళ్లాలనుకోవడం పట్ల 85 మంది ఎమ్మెల్యేలు ఉన్న జేడీయూ పార్టీలో మెజారిటీ ఎమ్మెల్యేలు, మంత్రులు తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. స్వయంగా వారికి నచ్చచెప్పేందుకు నితీష్ కుమార్ తన నివాసానికి పిలిపించి మీటింగ్ పెట్టారు. అయితే రాజ్యసభకు వెళ్ళొద్దు అని అనేక మంది నితీష్ కి సూచించారు. బీహార్ సీఎం గానే ఉంటూ పాలన చేయాలని కోరారు వారి మాటలను విన్న నితీష్ కుమార్ యాదవ్ తీవ్ర భావోద్వేగానికి గురు అయ్యారని అంటున్నారు.

**క్యాడర్ ఆగ్రహం :**

ఇక పాట్నాలో జేడీయూ క్యాడర్ అయితే నితీష్ సీఎం పదవికి రాజీనామా చేయాలనుకోవడం వెనక భారీ కుట్ర ఉందని మండిపడుతున్నారు. నితీష్ నే బీహార్ ముఖ్యమంత్రి అని వారు నినాదాలు చేస్తున్నారు. ఆయన సీఎం గా ఉండాలని పాట్నావ్యాప్తంగా పోస్టర్లు వేశారు. అదే సమయంలో బీజేపీ నేతల మీద జేడీయూ కార్యకర్తలు విరుచుకుపడుతున్నారు. దీంతో ఇబ్బందికరమైన వాతావరణం అయితే కనిపిస్తోంది అని అంటున్నారు.

**ఆర్జేడీ హాట్ కామెంట్స్ :**

బీహార్ సీఎం నితీష్ కుమార్ రాజ్యసభకు వెళ్ళడం మీద ఆర్జేడీ అధినేత తేజస్వి యాదవ్ సంచలన కామెంట్స్ చేశారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఉన్న ప్రాంతీయ పార్టీలను బీజేపీ లేకుండా చేస్తోంది అని ఆగ్రహం వ్యక్తం చేసారు. బీజేపీతో పొత్తు అంటే ఇదే పరిస్థితి ఉంటుందని మహారాష్ట్ర శివసేనను తమిళనాడులోని అన్నా డీఎంకేని అలాగే ఇతర పొత్తు పార్టీలను ఆయన ఉదహరించారు. ఇవన్నీ పక్కన పెడితే ఈ పరిణామాలు ఆర్జేడీకి వరంగా మారుతాయా అన్న చర్చకు తెర లేచింది. బీహార్ వారు తన ప్రాంతీయ నేతకే పగ్గాలు అందిస్తారు. ప్రాంతీయ పార్టీలకే వారు గత మూడున్నర దశాబ్దాలుగా ఓటేస్తూ వస్తున్నారు. నితీష్ లేని జేడీయూ సైతం ఎలా ముందుకు సాగుతుందో తెలియని నేపథ్యంలో ఆర్జేడీ పుంజుకుంటుందా అన్న విశ్లేషణలు అయితే వినిపిస్తున్నాయి.

## ట్రంప్ ను వదలనంటున్న ఇరాన్.. ప్రతీకారం పీక్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ , అమెరికా మధ్య ఉద్రిక్తతలు మరోసారి ముదురుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. తాజాగా ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజాని చేసిన ప్రకటన అంతర్జాతీయ రాజకీయాల్లో సంచలనంగా మారింది. తమ అత్యున్నత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ మరణానికి అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బాధ్యత వహించాల్సిందేనని ఈ ఘటనకు మూల్యం చెల్లించక తప్పదని ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో చేసిన పోస్టులో లారిజాని ఘాటుగా స్పందించారు. “మా నాయకుడి రక్తం వృథా కాదు. ట్రంప్‌ను వదిలే ప్రసక్తే లేదు. అతను చేసిన దానికి ప్రతీకారం తప్పకుండా తీసుకుంటాం” అని స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో మధ్యప్రాచ్యంలో ఇప్పటికే ఉన్న ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.లారిజాని మరో కీలక వ్యాఖ్య కూడా చేశారు. మిడిల్ ఈస్ట్ దేశాలకు ఆయన హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా తమ భూభాగాలను ఉపయోగించి ఇరాన్‌పై దాడులు చేయకుండా ఆ ప్రాంత దేశాలు అడ్డుకోవాలని కోరారు. “ఏ దేశం భూభాగం నుంచైనా ఇరాన్‌పై దాడి జరిగితే మేము కచ్చితంగా ప్రతిస్పందిస్తాం. ఆ ప్రాంతాన్ని కూడా లక్ష్యంగా చేసుకోవాల్సి వస్తుంది” అని ఆయన తేల్చి చెప్పారు. ఈ వ్యాఖ్యలు గల్ఫ్ ప్రాంత దేశాలకు ప్రత్యక్ష హెచ్చరికగా భావిస్తున్నారు.

ఇక ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్.జీసీ) కూడా కీలక ప్రకటన చేసింది. ఇటీవల జరిగిన ఉద్రిక్త పరిణామాల్లో కొందరు అమెరికన్ సైనికులను తమ బలగాలు బంధించాయని పేర్కొంది. అయితే ఈ విషయంపై అమెరికా అధికారికంగా స్పందించలేదు. అయినప్పటికీ ఈ ప్రకటన ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.ఇప్పటికే ఇరాన్ -- ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా పశ్చిమాసియా ప్రాంతం అట్టుడుకుతోంది. ఆయిల్ డిపోలు, సైనిక స్థావరాలపై దాడులు జరుగుతున్నట్టు సమాచారం వస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా కూడా తన సైనిక దళాలను ఆ ప్రాంతంలో అప్రమత్తం చేసినట్లు అంతర్జాతీయ మీడియా నివేదిస్తోంది.అంతర్జాతీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. ఇరాన్ నాయకత్వం నుంచి వచ్చిన ఈ తాజా హెచ్చరికలు ప్రాంతీయ భద్రతకు పెద్ద సవాల్‌గా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా అమెరికా, ఇరాన్ మధ్య ప్రత్యక్ష ఉద్రిక్తతలు పెరిగితే గల్ఫ్ ప్రాంతంలో పెద్ద స్థాయి ఘర్షణలకు దారితీయవచ్చని వారు చెబుతున్నారు. మరోవైపు ఈ ప్రకటనలపై అమెరికా ప్రభుత్వం లేదా డొనాల్డ్ ట్రంప్ నుంచి ఇంకా అధికారిక స్పందన రాలేదు. కానీ ఇరాన్ చేసిన ఈ హెచ్చరికలు అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించాయి. పరిస్థితులు ఎలా మారుతాయో చూడాల్సి ఉంది. మొత్తానికి ఖమేనీ మరణం నేపథ్యంలో ఇరాన్ చేసిన ఈ ప్రతీకార ప్రకటన ప్రపంచ రాజకీయాల్లో కొత్త ఉద్రిక్తతలకు నాంది పలికే అవకాశాలు కనిపిస్తున్నాయి. పశ్చిమాసియాలో పరిస్థితులు మరింత సంక్లిష్టంగా మారే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# జెన్ జెడ్ : నేపాల్ లో ఎలా గెలిచింది? బంగ్లాలో ఎందుకు ఓడింది?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఒకే రకమైన ఆగ్రహం.. ఒకే తరహా పోరాటం.. కానీ ఫలితాలు మాత్రం విభిన్నం! బంగ్లాదేశ్ వీధుల్లో గద్దెలను కూల్చిన ‘జెన్ జెడ్’ నినాదం ఎన్నికల బరిలో ఎందుకు విఫలమైంది? నేపాల్ యువత అదే నినాదంతో అధికార పీఠాన్ని ఎలా అధిష్టించింది? ఆసియా రాజకీయాల్లో మారుతున్న యువతరం ప్రస్థానంపై ప్రత్యేక విశ్లేషణ.

ప్రస్తుత ప్రపంచ రాజకీయాల్లో ‘జెన్ జెడ్’ ఒక శక్తివంతమైన రాజకీయ కార్యాచరణ శక్తిగా అవతరించింది. నిరుద్యోగం, అవినీతి, సామాజిక అసమానతలు.. ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా ఈ యువతరం గళమెత్తుతోంది. అయితే శ్రీలంక నుంచి మొదలై బంగ్లాదేశ్, నేపాల్ మీదుగా సాగిన ఈ ‘యువ తరంగం’ పర్యవసానాలు ఆయా దేశాల్లో విభిన్నంగా ఉన్నాయి. ఉద్యమం చేయడం వేరు.. ఆ ఉద్యమాన్ని రాజకీయ అధికారంగా మార్చుకోవడం వేరు అని ఈ రెండు దేశాల ఫలితాలు మనకు స్పష్టం చేస్తున్నాయి.

**బంగ్లాదేశ్.. ఉద్యమం నుంచి అధికారం వైపు అడుగుల్లో వైఫల్యం**

2024లో బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వ పతనానికి దారితీసిన ‘జులై విప్లవం’ చరిత్రలో నిలిచిపోయేది. కోటా వ్యవస్థకు వ్యతిరేకంగా మొదలై అవినీతి, మానవహక్కుల ఉల్లంఘనలపై ఉధృతమైన ఈ ఉద్యమం పాలకులను గద్దె దింపడంలో సఫలీకృతమైంది. ఈ ఉద్యమ సారథులు నహిద్ ఇస్లాం, హస్నాత్ అఫ్తాబ్, అబ్దుల్లా అఖ్తర్ వంటి విద్యార్థి నాయకులు ‘నేషనల్ సిటిజన్ పార్టీ’ని స్థాపించి రాజకీయ అరంగేట్రం చేశారు. అయితే ఆ ఎన్నికల్లో వారు ఘోర పరాజయాన్ని ఎదుర్కొన్నారు.

**ఓటమికి కారణాలు**

రాజకీయ అనుభవలేమి ప్రధాన కారణం.. ఉద్యమ పోరాట పటిమ ఉన్నప్పటికీ క్షేత్రస్థాయి రాజకీయ వ్యూహాలు.. పరిపాలనాపరమైన పరిణతి లేకపోవడం ప్రధాన లోపంగా మారింది. విప్లవం తర్వాత కూడా అశాంతి కొనసాగడం, హింస పెరిగి హత్యలు జరగడం.. సామాన్య ప్రజలలో అభద్రతా భావాన్ని పెంచింది. హఠాత్తుగా పుట్టుకొచ్చిన పార్టీ కావడంతో ప్రజలు తమ భవిష్యత్తును వీరి చేతుల్లో పెట్టడానికి వెనకాడారు. అంతేకాకుండా మేనిఫెస్టోలో స్పష్టత లేకపోవడం, పార్టీలో అంతర్గత విభేదాలు అదనపు శాపాలుగా మారాయి.

**నేపాల్.. కళాత్మక రాజకీయాలతో సత్తా చాటిన జెన్ జెడ్**

బంగ్లాదేశ్‌కు భిన్నంగా నేపాల్‌లో జెన్ జెడ్ ఒక పరిణతి చెందిన రాజకీయ శైలిని ప్రదర్శించింది. సోషల్ మీడియాను కేవలం నిరసనకే కాకుండా నిర్మాణాత్మక రాజకీయ ప్రచారానికి వేదికగా మార్చుకుంది. ర్యాపర్ బాలెన్ షా నాయకత్వంలో యువత అద్భుతమైన వ్యూహాన్ని అమలు చేసింది.

**గెలుపునకు కీలకాంశాలు**

ప్రజా సమస్యలతో అనుసంధానించారు. కేవలం నినాదాలకే పరిమితం కాకుండా బాలెన్ షా కాఠ్‌మాండూ మేయర్‌గా రోడ్లు, చెత్త నిర్వహణ వంటి మౌలిక సమస్యలను పరిష్కరించి ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్నారు. సోషల్ మీడియా వినియోగం ద్వారా పాటల ద్వారా అవినీతిపై గళమెత్తడం, ఆకర్షణీయమైన రీల్స్ ద్వారా యువతను ఏకం చేయడం వంటివి ‘రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ’ (ఆర్ ఎస్ పీ)కి ప్లస్ పాయింట్ అయ్యాయి. ఉద్యమ దశలోనే పీఎం పదవి వంటి ఆశలను తిరస్కరించి స్థానిక సంస్థల నుంచి రాజకీయ నైపుణ్యాన్ని పెంచుకోవడం, అంచెలంచెలుగా ఎదగడం వారి విజయ రహస్యం.

**బంగ్లాదేశ్ పాఠాలు.. నేపాల్ భవిష్యత్తు**

బంగ్లాదేశ్, నేపాల్ ఘటనలు ఒక ముఖ్యమైన పాఠాన్ని చెబుతున్నాయి. కేవలం ఆగ్రహంతో కూడిన ఉద్యమాలు ప్రభుత్వాలను కూల్చగలవు, కానీ సుస్థిరమైన పాలనను అందించలేవు. రాజకీయాల్లో గెలవాలంటే ‘ఉడుకు రక్తం’తో పాటు ‘చల్లని ఆలోచన’, స్పష్టమైన ప్రణాళిక, క్షేత్రస్థాయి అనుభవం, ప్రజలకు భరోసా కల్పించగల సామర్థ్యం చాలా అవసరం. నేపాల్ యువత చూపిన చొరవ, క్రమశిక్షణతో కూడిన రాజకీయ ప్రయాణం రాబోయే కాలంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువతరానికి ఒక దిశానిర్దేశం చేస్తుంది అనడంలో సందేహం లేదు.

# పదేళ్లుగా వీల్ చైర్ కే అంకితం.. విధిరాతను జయించిన ఆణిముత్యం



**హైదరాబాద్ పెన్ పవర్:** పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు అని ఇప్పటికే ఎంతోమంది నిరూపిస్తున్నారు. ఈ క్రమంలోనే ఒక యువతి దాదాపుగా పది సంవత్సరాలుగా వీల్ చైర్ కే పరిమితమై.. తన జీవితం అంతే అని అనుకోకుండా విధి రాతను ఎదురించి మరీ సివిల్స్ ఫలితాలలో 483వ ర్యాంకు సాధించి అందరికీ ఆశ్చర్యం కలిగించారు. ఇక నేడు అంతర్జాతీయ మహిళా సందర్భంగా ఇటీవల వెలువడిన సివిల్స్ ఫలితాల ఆధారంగా బయటపడ్డ ఈ యువతి ప్రతి ఒక్కరికి రోల్ మోడల్ అనే చెప్పాలి. సివిల్స్ రాయడం అంటే కష్టం.. మనతో కాదు. మనం సాధించలేం అనే వారికి ఈమె ఒక స్ఫూర్తి అనడంలో సందేహం లేదు.

**విధిరాతను ఎదురించిన యువతి..**

కేరళకు చెందిన 30 సంవత్సరల అథిర.. బీడీఎస్ చదువుతుండగానే ఆక్సిడెంట్ జరగడంతో తల , వెన్నెముకకు తీవ్ర గాయాలయ్యాయి. ఛాతీ కింది భాగం ప్యారలైజ్ అయిపోయింది. కదలలేని పరిస్థితి.. రెండేళ్లు జ్ఞాపకశక్తి కూడా కోల్పోయింది. ఆ తర్వాత నెమ్మదిగా కోలుకొని బీడీఎస్ పూర్తి చేసింది. ఎన్జీవో లో డిసెబిలిటీ వింగ్లో పనిచేయడం వల్లే తనలో ఆత్మవిశ్వాసం పెరిగిందని, తన తల్లిదండ్రులు, సోదరి సహాయంతో ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేశానని అథిర చెప్పుకొచ్చింది. ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసి సివిల్స్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్న ఈ యువతి నేడు ఈ స్థాయిలో దేశవ్యాప్తంగా ర్యాంకు అందుకని అందరిని ఆశ్చర్యపరిచింది.. ఇక మహిళా దినోత్సవం సందర్భంగా సాధించిన విజయాన్ని సగౌరవంగా జరుపుకుంటూ ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

**సక్సెస్ పై అథిర భావోద్వేగం..**

ఇకపోతే తాను పడిన కష్టానికి దక్కిన ప్రతిఫలం గురించి ఆమె మాట్లాడుతూ భావోద్వేగం అయ్యారు.. దంత వైద్యురాలు కావాలన్నది నా కల . అందుకే విదేశాలలో ముఖ్యంగా ఫ్రాన్స్ లో ఎండీఎస్ చేయాలనుకున్నాను. కానీ ఈ ప్రమాదం నన్ను, నా ఆలోచనను పూర్తిగా మార్చేసింది. బహుశా ఈ ప్రమాదం జరిగి ఉండకపోతే నేను సివిల్స్ రాయాలన్న ఆలోచన గురించి ఒక్కసారి కూడా ఆలోచించేదాన్ని కాదేమో. పదేళ్ల క్రితం బెంగళూరులో బిడిఎస్ చదువుకునేటప్పుడు ఎప్పటిలాగే ఆ రోజు కూడా అలాగే బయటకు వెళ్లాను.. అయితే ఒక ఘోర రోడ్డు ప్రమాదం నా జీవితాన్ని అతలాకుతలం చేసింది .తలకు, వెన్నెముకకు తీవ్ర గాయాలయ్యాయి. రెండు సంవత్సరాల పాటు జ్ఞాపక శక్తిని కూడా కోల్పోయాను. మొదట్లో వైద్యులు నేను బ్రతికి ఉన్నా.. మంచానికే పరిమితం అవుతానని చెప్పారు. కానీ వెంటిలేటర్ పై పోరాడుతున్నప్పుడే ఒకరోజు నా వేలు కదలడంతో వైద్యుల్లో నేను కోలుకోగలుగుతుందనే ఆశ మొదలైంది. అనుకున్నట్లుగానే నెమ్మదిగా నా శక్తినంత కూడతీసుకొని చక్రాల కుర్చీలో కూర్చోగలిగాను. ఆ తర్వాత చాలా రోజులపాటు చికిత్స కొనసాగింది .నెమ్మదిగా నా జ్ఞాపకశక్తి తిరిగి వచ్చింది. చదువును కొనసాగించాలనుకున్నాను. అయితే ఈ ప్రమాదానికి ముందు మూడేళ్ల పాటు నేను చదువుకున్న విషయాలు ఏవి కూడా నాకు గుర్తులేవు. అయినప్పటికీ మళ్ళీ ఒక సంవత్సరం పాటు మొదటి నుంచి చదివాను. ఆపై ఫైనల్ పరీక్షలు రాసి బిడిఎస్ కోర్సు పూర్తి చేయగలిగాను. ఈ కఠిన సమయంలో నా చెల్లి, తల్లిదండ్రులు తోడుగా నిలిచారు” . అంటూ తన సక్సెస్ వెనుక పడ్డ శ్రమ గురించి చెప్పి అందరిని ఆశ్చర్యపరిచారు.

# పసిడిని మించిన ‘నల్ల బంగారం’: కిలో ధర లక్షల్లో పలికే ప్రపంచపు ఖరీదైన కలప ఇవే!

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రకృతి ఒడిలో దాగి ఉన్న సంపద కేవలం వజ్రవైఢూర్యాలకే పరిమితం కాదు. కొన్ని రకాల వృక్షాలు పసిడి కంటే మిన్నగా, అత్యంత అరుదైన సంపదగా విరాజిల్లుతున్నాయి. సాధారణంగా మనకు ఎర్రచందనం అత్యంత ఖరీదైనదని తెలుసు, కానీ ప్రపంచ మార్కెట్‌లో దానిని మించిన విలువ కలిగిన అడవి సంపదలు కొన్ని ఉన్నాయి. అగర్ ఉడ్, ఆఫ్రికన్ బ్లాక్ ఉడ్, ఎబోని వంటి వృక్షాలు వాటి ప్రత్యేక గుణాల వల్ల ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ‘లిక్విడ్ గోల్డ్’,’బ్లాక్ డైమండ్స్’గా పిలవబడుతున్నాయి. వీటి ధరలు వింటే సామాన్యులు ఆశ్చర్యపోవాల్సిందే.

**అగర్ ఉడ్: దేవుళ్ల కలప!**

ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన కలపగా అగర్ ఉడ్ ను పేర్కొంటారు. దీనిని ‘దేవుళ్ల కలప’ అని కూడా పిలుస్తారు. వాస్తవానికి, ఈ చెట్టుకు ‘ఫియలోఫోరా పారాసిటికా’ అనే ఫంగస్ సోకినప్పుడు, ఆ ఇన్ఫెక్షన్ నుంచి తనను తాను రక్షించుకోవడానికి చెట్టు ఒక రకమైన సుగంధ రెసిన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ రెసిన్ వల్లే అగర్ ఉడ్‌కు ఆ విపరీతమైన విలువ వస్తుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని నాణ్యతను బట్టి కిలో ధర రూ. 7 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు ఉంటుంది. దీని నుంచి తీసే నూనె (ᰀబᰀ ᰀఅᰀ) లీటరు ధర రూ. 50 లక్షల పైమాటే. అత్యంత ఖరీదైన పెర్ఫ్యూమ్‌లు, అత్తరులు, ధూప ద్రవ్యాల తయారీలో దీనిని వాడతారు. అరబ్ దేశాల్లో దీనికి విపరీతమైన డిమాండ్ ఉంది.

**ఆఫ్రికన్ బ్లాక్ ఉడ్.. సంగీత వాయిద్యాల రారాజు!**

ఎర్రచందనం కంటే కొన్ని రెట్లు ఎక్కువ ధర పలికే మరో కలప ఆఫ్రికన్ బ్లాక్ ఉడ్ . ఇది ఆఫ్రికాలోని పొడి ప్రాంతాల్లో పెరుగుతుంది. ఈ చెట్టు పూర్తిస్థాయిలో పెరగడానికి దాదాపు 60 నుంచి 200 ఏళ్ల సమయం పడుతుంది. ఇది చాలా గట్టిగా, నీటిలో మునిగిపోయేంత సాంద్రత కలిగి ఉంటుంది. దీని కిలో ధర సుమారు రూ. 7 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు ఉంటుంది. ప్రపంచ ప్రఖ్యాత సంగీత వాయిద్యాలైన క్లారినెట్, ఒబో . బాగ్ పైప్స్ తయారీలో దీనిని వాడతారు. దీనికి ఉండే సహజమైన మెరుపు వల్ల లగ్జరీ ఫర్నిచర్ తయారీలోనూ దీనికి ప్రాధాన్యత ఇస్తారు.


**ఎబోని: రాజసం ఉట్టిపడే నలుపు!**

చీకటి లాంటి గాఢమైన నలుపు రంగులో ఉండే ఎబోని కలప శతాబ్దాలుగా సంపన్నతకు, రాచరికానికి చిహ్నంగా ఉంది. ఇది చాలా బరువుగా, నునుపుగా ఉంటుంది. సాధారణ కలప నీటిపై తేలితే, ఎబోని మాత్రం నీటిలో మునిగిపోతుంది. నాణ్యతను బట్టి దీని కిలో ధర రూ. 8 లక్షల వరకు ఉంటుంది. శ్రీలంకన్ ఎబోని వంటి రకాలు మరింత ఖరీదైనవి. పియానో కీలు, చెస్ బోర్డులోని నలుపు పావులు, ఖరీదైన కత్తుల పిడి వంటి వాటి తయారీలో దీనిని ఉపయోగిస్తారు. దీనికి ఉండే అద్దం లాంటి మెరుపు మరే ఇతర కలపలోనూ కనిపించదు.

ప్రకృతి ప్రసాదించిన ఈ అపురూపమైన కలప రకాలు కేవలం వస్తువుల తయారీకే కాదు, ఒక దేశపు ఆర్థిక సంపదగా మారుతున్నాయి. అగర్ ఉడ్ నుంచి వచ్చే సుగంధం కానీ, ఆఫ్రికన్ బ్లాక్ ఉడ్ ఇచ్చే నాణ్యమైన సంగీతం కానీ, ఎబోని ఇచ్చే రాజసం కానీ సామాన్యులకు అందనంత ఎత్తులో ఉన్నాయి. అందుకే వీటిని ‘నల్ల బంగారం’ అని పిలవడం వంద శాతం సమంజసం. ఇలాంటి అరుదైన వృక్షాలను కాపాడుకోవడం మన బాధ్యత!

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## నీటి మీద యుద్ధం..! బహ్రెయిన్ డీశాలినేషన్ ప్లాంట్‌పై ఇరాన్ డ్రోన్ దాడి



**హైదరాబాద్ పెన్ పవర్:** గల్ఫ్ ప్రాంతంలో నీరు అంటే జీవనాడి. సహజసిద్ధమైన నదులు, సరస్సులు లేకపోవడం వల్ల అక్కడి దేశాలు దాదాపుగా సముద్రపు నీటినే ఆధారంగా చేసుకుని జీవనం సాగిస్తున్నాయి. అందుకే డీశాలినేషన్ ప్లాంట్లు ఆ ప్రాంతానికి కేవలం ఒక సాంకేతిక సదుపాయం మాత్రమే కాదు.. ప్రజల జీవనాధారంగా మారాయి. సముద్రపు ఉప్పునీటిని శుద్ధి చేసి తాగునీటిగా మార్చే ఈ టెక్నాలజీ గల్ఫ్ దేశాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. గల్ఫ్ ప్రాంతంలో సహజమైన మంచినీటి వనరులు చాలా తక్కువ. ఎడారి భూభాగం ఎక్కువగా ఉండటం వల్ల భూగర్భజలాలు కూడా పరిమితంగా ఉంటాయి. ఈ పరిస్థితుల్లో డీశాలినేషన్ టెక్నాలజీ లేకపోతే అక్కడి నగరాలు, పరిశ్రమలు, వ్యవసాయం కొనసాగడం చాలా కష్టమవుతుంది. ప్రస్తుతం గల్ఫ్ దేశాల్లో 400కు పైగా డీశాలినేషన్ ప్లాంట్లు పనిచేస్తున్నాయి. ఇవి కోట్లాది మందికి ప్రతిరోజూ తాగునీటిని అందిస్తున్నాయి.

ప్రత్యేకంగా చూస్తే కువైట్ తన తాగునీటి అవసరాల్లో దాదాపు 90 శాతం, సౌదీ అరేబియా సుమారు 70 శాతం డీశాలినేషన్ ప్లాంట్లపైనే ఆధారపడుతున్నాయి. అంటే అక్కడి ప్రజల జీవితం ఈ ప్లాంట్ల పనితీరుపైనే నిలబడి ఉందని చెప్పాలి. ఎడారి ప్రాంతాల్లో ఉన్నప్పటికీ ఆధునిక నగరాలు, భారీ మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు ఏర్పడటానికి కూడా ఈ టెక్నాలజీ పెద్ద కారణంగా నిలిచింది. అందుకే గల్ఫ్ దేశాలు ఈ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతూ కొత్త ప్లాంట్లు నిర్మించడంపై దృష్టి పెడుతున్నాయి.ఇలాంటి కీలక మౌలిక వనరులపై దాడులు జరగడం అంతర్జాతీయంగా ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఇటీవల బహ్రెయిన్‌లోని ఒక ప్రధాన డీశాలినేషన్ ప్లాంట్‌పై ఇరాన్ డ్రోన్లతో దాడి చేసిన ఘటన దీనికి ఉదాహరణగా నిలిచింది. ఈ దాడి వెనుక కారణంగా ఇరాన్ ఒక వివరణ ఇచ్చింది. తమ దేశంలోని కేశమ్ ఐలాండ్‌లో ఉన్న వాటర్ ప్లాంట్‌పై అమెరికా దాడి చేసిందని అందుకే ప్రతీకారంగా ఈ దాడి చేశామని ఇరాన్ పేర్కొంది.అయితే నిపుణుల అభిప్రాయం ప్రకారం తాగునీటి వనరులను లక్ష్యంగా చేసుకోవడం యుద్ధంలో అత్యంత ప్రమాదకరమైన దిశగా భావించబడుతోంది. ఎందుకంటే విద్యుత్ కేంద్రాలు లేదా సైనిక స్థావరాలపై దాడి చేయడం ఒక విషయం అయితే నీటి వనరులను టార్గెట్ చేయడం నేరుగా ప్రజల జీవనంపై ప్రభావం చూపుతుంది. ఒక డీశాలినేషన్ ప్లాంట్ పనిచేయకుండా పోతే లక్షలాది మంది ప్రజలు తాగునీటి కొరతను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ పరిణామం మధ్యప్రాచ్య ప్రాంతంలో జరుగుతున్న ఉద్రిక్తతలు కొత్త మలుపు తీసుకుంటున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా నీరు వంటి ప్రాథమిక వనరులు యుద్ధ వ్యూహాల్లో భాగమవుతుంటే అది మానవతా సంక్షోభానికి దారితీసే ప్రమాదం ఉంది. అందువల్ల భవిష్యత్తులో గల్ఫ్ దేశాలు తమ డీశాలినేషన్ ప్లాంట్ల భద్రతపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.మొత్తంగా చూస్తే డీశాలినేషన్ ప్లాంట్లు గల్ఫ్ దేశాలకు కేవలం టెక్నాలజీ ప్రాజెక్టులు కాదు. అవి అక్కడి ప్రజల జీవనరేఖ. అందుకే ఈ వనరులపై జరిగే దాడులు ప్రాంతీయ భద్రతకే కాదు, ప్రపంచానికి కూడా ఒక పెద్ద హెచ్చరికగా మారుతున్నాయి.

## టీమ్‌ఇండియానే జగజ్జేత.. వరుసగా రెండో టి20 ప్రపంచకప్ టైటిల్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల వరుసగా టీమ్‌ఇండియాను టెస్టుల్లో క్లీన్ స్వీప్ చేసి, వన్డేల్లోనూ భారత్ గడ్డపై సిరీస్ సాధించి పరాభవం పాల్జేసిన న్యూజిలాండ్ కు సరైన సమాధానం దక్కింది. టెస్టుల్లో వరుస ఓటములు.. వన్డేల్లో అనూహ్య పరాజయాలు.. కానీ, టి20 ఫార్మాట్ లో మాత్రం పటిష్ఠ జట్టుతో దుమ్మురేపుతున్న టీమ్‌ఇండియా అందరి అంచనాలను నిజం చేస్తూ వరుసగా రెండోసారి టి20 ప్రపంచ కప్ టైటిల్ సాధించింది. ఆదివారం గుజరాత్ లోని అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో కఠినమైన ప్రత్యర్థి న్యూజిలాండ్ ను మట్టి కరిపించింది. అచ్చం సెమీఫైనల్లో ఇంగ్లండ్ తరహాలో టాస్ గెలిచినా, ఫైనల్లోనూ టీమ్ ఇండియాకే బ్యాటింగ్ ఇచ్చి బోల్తాపడింది న్యూజిలాండ్. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ ఏకంగా 255 పరుగులు చేసింది. ఓపెనర్లు సంజూ శాంసన్ (46 బంతుల్లో 89, 5 ఫోర్లు, 8 సిక్సులు), అభిషేక్ శర్మ (21 బంతుల్లో 52, 6 ఫోర్లు, 3 సిక్సులు) ఆకాశమే హద్దుగా చెలరేగి శుభారంభం అందించారు. అభిషేక్ కేవలం 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ కొట్టి ప్రపంచ కప్ చరిత్రలో అత్యంత తక్కువ బంతుల్లో ఈ ఘనత సాధించి రికార్డులకెక్కాడు. అభిషేక్–సంజూ దూకుడుతో టీమ్‌ఇండియా 7.1 ఓవర్లోనే 98 పరుగులు సాధించింది. హాఫ్ సెంచరీ అనంతరం అభిషేక్ వెంటనే ఔటైనా.. అగ్నికి వాయువు తోడైనట్లు సంజూకు ఇషాన్ కిషన్ (25 బంతుల్లో 54, 4 ఫోర్లు, 4 సిక్సులు) జత కలిశాడు. ఇషాన్– సంజూ జోడీ 48 బంతుల్లోనే 105 పరుగులు చేసింది. దీంతో టీమ్ ఇండియా 15.1 ఓవర్లలోనే 200 మార్క్ దాటింది.

**300 కొట్టేసేలా కనిపించినా...**

15.1 ఓవర్లకే 203 పరుగులు.. సంజూ ఔటయ్యేటప్పటికి టీమ్‌ఇండియా స్కోరిది. ఈ ఊపు చూస్తే జట్టు 300 కొట్టేసేలా కనిపించింది. లేదా కనీసం 280 పరుగులైనా చేస్తుందని అనిపించింది. కానీ, నీషమ్ వేసిన 16వ ఓవర్లో సంజూ ఔటవడం, అదే ఓవర్ 5వ బంతికి ఇషాన్, చివరి బంతికి కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (0) వెనుదిరగడంతో షాక్ తగిలింది. హార్దిక్ పాండ్యా (13 బంతుల్లో 18, సిక్స్, ఫోర్), తిలక్ వర్మ (6 బంతుల్లో 8 నాటౌట్)లను న్యూజిలాండ్ బౌలర్లు కట్టడి చేశారు. దీంతో 16 వ ఓవర్ నుంచి స్కోరు మందగించింది. హార్దిక్ వెనుదిరిగాక.. శివమ్ దూబె (8 బంతుల్లో 26 నాటౌట్, 3 ఫోర్లు, 2 సిక్స్ లు) రావడంతో పరిస్థితి మారిపోయింది.

**దూబె ధనాధన్...**

ఓ దశలో 250 దాటుతుందా? అనే అనుమానం వచ్చినా దూబె దూకుడుతో టీమ్‌ఇండియా 255 పరుగుల భారీ స్కోరు అందుకుంది. మరీ ముఖ్యంగా 20వ ఓవర్లో దూబె 2 సిక్సులు, 3 ఫోర్లు బాది 24 పరుగులు సాధించడం గమనార్హం. తొలుత సంజూ–అభిషేక్ పార్ట్ నర్ షిప్, చివర్లో దూబె ధనాధన్ మ్యాచ్ లో కివీస్ ను మానసికంగా వెనుకంజ వేసేలా చేశాయి.

**బెంగ లేకుండా బౌలింగ్**

టి20 ప్రపంచ కప్ లో టీమ్‌ఇండియాకు అతిపెద్ద బెంగ బౌలింగ్. పేస్ లో అర్షదీప్ సింగ్, స్పిన్ లో వరుణ్ చక్రవర్తిలు తురుపు ముక్కలు అనుకుంటే వారిద్దరే తీవ్రంగా నిరాశపరిచారు. ఎప్పటిలానే మేటి పేసర్ జస్ప్రీత్ బుమ్రా అద్భుతంగా బౌలింగ్ దాడి కొనసాగించినా, పేస్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా అతడికి తోడుగా నిలిచినా... ప్రధాన బౌలర్లయిన అర్షదీప్, వరుణ్ వైఫల్యం ఇబ్బందిపెట్టింది. కానీ, ఫైనల్లో మాత్రం ఆందోళన లేకపోయింది. కివీస్ ఓపెనర్ టిమ్ సీఫర్ట్ (26 బంతుల్లో 52, 2 ఫోర్లు, 5 సిక్సులు) దూకుడు కొనసాగించినా.. మరో ఓపెనర్ ఫిన్ అలెన్ (9) విఫలమయ్యాడు. భారత సంతతి కుర్రాడు రచిన్ రవీంద్ర (1)ను బుమ్రా వెనక్కు పంపాడు. ఇక అంతే, న్యూజిలాండ్ ఛేజింగ్ లో తేలిపోయింది. ఫిలిప్స్ (5), చాప్ మన్ (3) ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. సీఫర్ట్ కు తోడుగా నిలిచేవారు లేకపోవడంతో కివీస్ రెక్కలు విరిగాయి. ఇటీవలి వన్డే సిరీస్ లో వరుస సెంచరీలు కొట్టిన డారిల్ మిచెల్ (17)ను అక్షర్ పటేల్ ఔట్ చేయడంతో కివీస్ తేలిపోయింది. 16వ ఓవర్లో బుమ్రా వరుస బంతుల్లో నీషమ్ (8), హెన్రీ (0)ని ఔట్ చేసి ప్రత్యర్థి కథ త్వరగా ముగిసేలా చేశాడు. కెప్టెన్ శాంటర్న్ (35 బంతుల్లో 43, 3 ఫోర్లు, 2 సిక్సులు) పోరాటం కేవలం టీమ్ ఇండియా గెలుపు అంతరాన్ని తగ్గించడానికే ఉపయోగపడింది. 19 ఓవర్లలో 159 పరుగుల వద్ద కివీస్ ఇన్నింగ్స్ ముగిసింది. టీమ్ ఇండియా 95 పరుగుల తేడాతో నెగ్గింది.

# విజయ్ పార్టీకి బీజేపీ బంపర్ ఆఫర్



**హైదరాబాద్ పెన్ పవర్:** తమిళనాడులో కొత్త పార్టీగా జనంలోకి వస్తున్న టీవీకేకి బీజేపీ బంపర్ ఆఫర్ ఇస్తోంది. తమతో కలసి పనిచేయాలని ఓపెన్ గానే ఆహ్వానం పంపించింది. తమిళనాడులో డీఎంకేని దెబ్బ తీయాలీ అంటే విజయ్ పార్టీ ఎన్డీయే కూటమిలోకి చేరాలని బీజేపీ పిలుపు ఇచ్చింది. తమతో జట్టు కలిస్తే విజయ్ పార్టీకి అంతా మంచే జరుగుతుందని కూడా చెబుతోంది.

**విడిగా ఉంటే కష్టం :**

తమిళనాడులో డీఎంకే అధికారంలో ఉంది. విపక్షాలు చీలిపోతే ఎవరికి వారుగా పోటీ చేస్తే అది డీఎంకే కే లాభం అని బీజేపీ అభిప్రాయపడింది. డీఎంకే కే వ్యతిరేక ఓట్లు చీలకుండా ఉండాలీ అంటే విజయ్ ఎన్డీయే కలిసి రావడమే మేలు అని సూచిస్తోంది. మరోసారి డీఎంకే గద్దె మీద కూర్చోకుండా ఆపాలీ అంటే విజయ్ ఇపుడే ఆలోచించుకోవాలని బీజేపీ తమిళనాడు అధికర ప్రతినిధి ఏఎన్ఎస్ ప్రసాద్ తాజాగా విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**స్టాలిన్ మీద తీవ్ర అసంతృప్తి :**

తమిళనాడులో డీఎంకే పాలన మీద ముఖ్యమంత్రి స్టాలిన్ మీద జనంలో తీవ్ర అసంతృప్తి ఉందని ఆయన చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో విపక్షాలు విడిపోతే ఎవరు మటుకు వారు పోటీకి దిగితే అంతిమంగా అది స్టాలిన్ పార్టీకే లాభం చేకూరుస్తుంది అని ఆయన హెచ్చరించారు. తాము విజయ్ పార్టీని ఈ సమయంలో కోరేది ఒక్కటే అని స్టాలిన్ ని మళ్ళీ సీఎం చేయకుండా సహకరించాలి అంటే అన్నాడీఎంకే సారథ్యంలోని ఎన్డీయే కూటమిలోకి విజయ్ పార్టీ తప్పనిసరిగా వచ్చి చేరాలని బీజేపీ గట్టిగా కోరుతోంది. విజయ్ కి నిజంగా డీఎంకే పార్టీ ఓటమి చెందాలని ఉంటే కీలక నిర్ణయం తీసుకోవాలని బీజేపీ చెబుతోంది.

**విజయ్ గమనించాల్సిందే :**

తమిళనాడులో డీఈంకే పార్టీ పాలనలో లా అండ్ ఆర్డర్ బ్రేక్ అయ్యాయని, అలాగే నిత్యావసర వస్తువుల ధరలు దారుణంగా పెరిగిపోయాయని అవినీతి అక్రమాల ఆరోపణలు పెచ్చరిల్లాయని బీజేపీ గుర్తు చేస్తోంది. వీటితో ప్రజలు పూర్తిగా విసిగిపోయారని అంటోంది. ఈ వ్యతిరేకతను డీఎంకే గమనించి తన కూటమిలో కొత్త పార్టీలని నేతలను చేర్చుకుంటోందని బీజేపీ చెబుతోంది. ఈ పరిణామాలను విజయ్ జాగ్రత్తగా గమనించాలని సూచిస్తోంది.

**అంతా ఏకం కావాలి :**

తమిళనాడులో డీఎంకే కూటమికి వ్యతిరేకంగా అంతా ఏకం కావాల్సిన పరిస్థితి ఉందని బీజేపీ అంటోంది. నిజంగా విజయ్ కి డీఎంకేని అధికారంలోకి రానీయకూడదు అన్న ఆలోచన ఉంటే కనుక కచ్చితంగా ఎన్డీయే కూటమిలో ఆయన చేరాల్సిందే అని బీజేపీ చెబుతోంది. గత ఎన్నికల పరిస్థితులు, ఓటింగ్ సరళిని, ప్రస్తుతం తమిళనాట రాజకీయ వాతావరణాన్ని విజయ్ గమనించాలని కూడా కోరుతోంది. ఇదిలా ఉంటే 2026 ఎన్నికలు తమిళనాడు భవిష్యత్తుకు అతి ముఖ్యమని బీజేపీ అంటోంది. అందువల్ల డీఎంకేకు యాంటీగా అంతా కలిసి ఐక్య ప్రజాస్వామ్య కూటమిగ మారాల్సిన అవసరం ఉందని అంటోంది.

**విజయ్ స్టెప్ ఏంటి :**

మరి బీజేపీ చేసిన ఈ ప్రతిపాదనను విజయ్ పరిశీలిస్తారా అన్నదే చర్చగా ఉంది. తమకు ఎవరితోనూ పొత్తులు ఉండవని ఇప్పటికే విజయ్ చెబుతూ వస్తున్నారు. అంతే కాదు ఎట్టి పరిస్థితుల్లోనూ బీజేపీతో పొత్తు ఉండని ఆయన అంటున్నారు. అంతే కాదు మొత్తం 234 అసెంబ్లీ సీట్లకు తాము పోటీ చేస్తామని ఆయన చెబుతున్నారు. విజయ్ కనుక ఎన్డీయేలో చేరితే ముఖ్యమంత్రి పదవిని షేర్ చేసుకునే ప్రతిపాదన కూడా ఉందని ప్రచారం సాగుతోంది. మరి బీజేపీ ఈ ఆఫర్ ఇచ్చినా విజయ్ పార్టీ ఒప్పుకోకపోవచ్చు అని అంటున్నారు. విజయ్ పార్టీ ఈ ఎన్నికలను ఫైనల్స్ గా భావిస్తున్నారా లేక సెమీ ఫైనల్స్ గా తీసుకుంటున్నారా అన్నది తెలియదు కానీ త్రిముఖ పోటీకి అయితే దారులు పరుస్తున్నారు. ఇక్కడ ఒక విషయం ఉంది మరో సారి డీఎంకే గెలిస్తే మాత్రం విజయ్ టీవీకే పార్టీ ప్రతిపక్షంలో అయిదేళ్ల పాటు ఉండడం కష్టమే. అలాగే అన్నా డీఎంకే మరోసారి పరాజయం పాలు అయితే ఆ పార్టీ మనుగడ ఇబ్బందులలో పడుతుంది అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# పూజ చేస్తున్న వారిపై బాంబుల వర్షం.. బంగ్లాలో ప్రభుత్వం మారినా హిందువులపై ఆగని దాడులు



**హైదరాబాద్ పెన్ పవర్:** బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరినా మైనార్టీలైన హిందువులపై దాడులు ఆగడం లేదు. తాజాగా మరో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. కోమిల్లా జిల్లాలో పూజ నిర్వహిస్తున్న హిందువుల బృందంపై గుర్తు తెలియని దుండగులు బాంబులతో దాడి చేయడంతో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఈ ఘటనలో పలువురు గాయపడగా.. ఒక పూజారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

స్థానిక సమాచారం ప్రకారం.. కోమిల్లా ప్రాంతంలోని ఒక ఆలయంలో శనివారం సాయంత్రం హిందువులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో అక్కడికి చేరుకున్న కొంతమంది దుండగులు అకస్మాత్తుగా బాంబులు విసిరి అక్కడి నుంచి పరారయ్యారు. బాంబు పేలుళ్లతో ఒక్కసారిగా ఆ ప్రాంతం మొత్తం ఉలిక్కిపడింది. అక్కడ ఉన్న భక్తులు ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీశారు. ఈ ఘటనలో పలువురు గాయపడగా, వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.ఈ దాడిలో పూజారి కేశవ్ చక్రవర్తి తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కేసు నమోదు చేసి నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.ఇటీవల బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ, సామాజిక ఉద్రిక్తతల నేపథ్యంలో మైనారిటీలపై దాడులు పెరుగుతున్నాయని అక్కడి మీడియా వర్గాలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ హత్యకు గురైన ఘటన తర్వాత దేశవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ సంఘటనకు సంబంధించి వివిధ వర్గాల మధ్య ఉద్రిక్తతలు పెరిగి, కొన్ని ప్రాంతాల్లో మతపరమైన ఉద్రిక్తతలు కూడా చెలరేగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో హిందూ దేవాలయాలు, వారి ఇళ్లు, దుకాణాలు లక్ష్యంగా దాడులు జరుగుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. గత కొద్ది వారాల్లోనే

అనేక ప్రాంతాల్లో హిందువులపై దాడులు జరిగినట్లు తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో దేవాలయాలను ధ్వంసం చేయడం, ఇళ్లకు నిప్పంటించడం వంటి ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. ఈ హింసాత్మక ఘటనల్లో ఇప్పటివరకు పదుల సంఖ్యలో హిందువులు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక వర్గాలు చెబుతున్నాయి.ఈ పరిణామాల నేపథ్యంలో బంగ్లాదేశ్‌లోని మైనారిటీ వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తమకు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. మరోవైపు ప్రభుత్వం శాంతి భద్రతల పరిరక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నామని, మతపరమైన ఉద్రిక్తతలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది.అయితే వరుసగా జరుగుతున్న దాడులతో హిందూ సమాజంలో భయం నెలకొంది. పూజలు, ఉత్సవాలు నిర్వహించడానికే భయపడే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కోమిల్లా ప్రాంతంలో భద్రతను పెంచిన పోలీసులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని అధికారులు తెలిపారు.

## అదృష్టం నీ కోసమే వెతుకుతోంది.. ఎక్కడున్నా వచ్చేయ్ బాబూ!.. పంజాబ్‌లో వింత పరిస్థితి!



**హైదరాబాద్ పెన్ పవర్:** సాధారణంగా ఎవరికైనా లాటరీ తగిలిందంటే ఆ వార్త తెలిసిన మరుక్షణమే ఎగిరి గంతేస్తారు, పరుగు పరుగున వెళ్లి ఆ డబ్బును తమ సొంతం చేసుకుంటారు. కానీ పంజాబ్‌లో మాత్రం పరిస్థితి పూర్తిగా రివర్స్‌లో ఉంది. ఒక వ్యక్తికి అక్షరాలా 30 లక్షల రూపాయల లాటరీ తగిలింది, కానీ ఆ విజేత ఎక్కడ ఉన్నాడో, ఏం చేస్తున్నాడో ఎవరికీ తెలియడం లేదు. దీంతో లాటరీ నిర్వాహకులే మైకులు పట్టుకొని, డప్పులు కొట్టిస్తూ గల్లీ గల్లీలో చాటింపు వేయిస్తున్నారు. 'నాయనా.. నీకు 30 లక్షలు వచ్చాయి, వచ్చి తీసుకెళ్లు' అని వారు చేస్తున్న ఈ ప్రయత్నం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

**అసలేం జరిగిందంటే..**

పంజాబ్ రాష్ట్రంలో నెలవారీ లాటరీ నిర్వహించే ఒక సంస్థ ఫిబ్రవరి 26న విజేతల వివరాలను ప్రకటించింది. ఇందులో బర్నాలా రైల్వేస్టేషన్ సమీపంలోని ఒక ఏజెంట్ దగ్గర కొన్న టికెటుకు మొదటి బహుమతి లభించింది. కేవలం 50 రూపాయలు పెట్టి కొన్న ఆ టికెటుకు ఇప్పుడు 30 లక్షల రూపాయల విలువ ఉంది. అయితే, ఆ టికెటుపై విజేత పేరు గానీ, ఫోన్ నంబరు గానీ లేకపోవడంతో అసలు ఆ లక్కీ పర్సన్ ఎవరనేది నిర్వాహకులకు అంతుచిక్కడం లేదు. ఆ వ్యక్తికి ఘనంగా స్వాగతం పలకడం కోసం, విజేతను గౌరవించడం కోసం నిర్వాహకులు ఆ ప్రాంగణాన్ని బెలూన్లతో చాలా కలర్‌ఫుల్‌గా అలంకరించి మరీ ఎదురుచూస్తున్నారు.

**కాలం మించిపోతోంది.. గడువు ముగుస్తోంది!**

ఇక్కడ అసలైన ట్విస్ట్ ఏంటంటే? ఈ ఆనందం ఎంతో కాలం ఉండదు. లాటరీ నిబంధనల ప్రకారం.., విజేతను ప్రకటించిన నెల రోజుల్లోపు ఆ ప్రైజ్ మనీని క్లెయిమ్ చేసుకోకపోతే, ఆ డబ్బు తిరిగి ప్రభుత్వ ఖజానాకు వెళ్లిపోతుంది. అంటే ఆ వ్యక్తికి ఇంకా చాలా తక్కువ సమయం మాత్రమే ఉంది. ఒకవేళ ఆ విజేత తన టికెటును ఎక్కడైనా పారేసుకున్నాడా? లేక తనకే లాటరీ తగిలిందన్న విషయం తెలియక ఎప్పటిలాగే తన కష్టాల్లో మునిగిపోయాడా? అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడో ఒక మూల కోటీశ్వరుడిగా మారిన వ్యక్తి, ఆ విషయం తెలియక ఇంకా పేదరికంలోనే ఉండిపోవడం నిజంగా ఒక విషాదమే అని చెప్పాలి.

**వినూత్న ప్రయత్నాలు**

లాటరీ ఏజెంటు, నిర్వహణ సంస్థ ఈ విజేతను ఎలాగైనా పట్టుకోవాలని పట్టుదలతో ఉన్నారు. కేవలం చాటింపు వేయించడమే కాకుండా, స్థానిక వార్తా పత్రికల్లో, సోషల్ మీడియాలో కూడా ఈ సమాచారాన్ని వైరల్ చేస్తున్నారు. బర్నాలా రైల్వే స్టేషన్ అంటే నిత్యం వేలమంది ప్రయాణికులు తిరిగే చోటు. కాబట్టి ఆ వ్యక్తి ఏదో పని మీద వచ్చి అక్కడ టికెట్ కొని ఉండి ఉండవచ్చు. ఆ టికెట్ ఒకవేళ ప్రయాణికుడిదే అయితే, ఆయన తన ఊరికి వెళ్లిపోయి ఉండే అవకాశం ఉంది. అందుకే ఈ వార్తను రాష్ట్రం మొత్తం వ్యాప్తి చేసేలా ప్లాన్ చేస్తున్నారు. అదృష్టం అనేది అందరినీ వరించదు, అలాంటిది 30 లక్షలు గెలుచుకొని కూడా ఆ విషయం తెలియకుండా ఉండడం నిజంగా ఆ వ్యక్తి దురదృష్టమనే చెప్పాలి. బర్నాలా రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఆ సమయంలో ఎవరైనా టికెట్లు కొని ఉంటే, ఒక్కసారి మీ జేబులు, పాత డైరీలు, పర్స్ లోపల వెతుక్కోండి! ఎవరికి తెలుసు.. ఆ అదృష్టవంతుడు మీరే కావచ్చు. ఆ అపరిచిత విజేత త్వరగా దొరకాలని, తన కష్టార్జితానికి దక్కిన ఆ బహుమతిని సొంతం చేసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం.

## రూ.లక్ష కోట్ల సాగు ఎగుమతులకు యుద్ధ గండం




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్, అమెరికా యుద్ధం ప్రభావం భారత వ్యవసాయ, ఆహార ఉత్పత్తుల ఎగుమతులపై తీవ్రంగా ఉంటుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) పేర్కొంది. గల్ఫ్ మార్కెట్ మనకు చాలా ముఖ్యమని తెలిపింది. ఈ సంస్థ ప్రకారం, కిందటేడాది వెస్ట్ ఏసియా దేశాలకు సుమారు 11.8 బిలియన్ డాలర్ల (రూ.1.08లక్షల కోట్ల) విలువైన ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, పాలు, మసాలాలు వంటి ఉత్పత్తులను ఇండియా ఎగుమతి చేసింది. ఇది మొత్తం వ్యవసాయ ఎగుమతుల్లో 21.8 శాతానికి సమానం. ప్రస్తుతం ఈ ఎగుమతులు తగ్గిపోనున్నాయి. గల్ఫ్ ఏరియా ఇండియాకు దగ్గరగా ఉండడం, భారతీయ ప్రవాసులు ఎక్కువగా ఉండడంతో మన వ్యవసాయ ఉత్పత్తులకు సహజ మార్కెట్‌గా ఉంది. కానీ యుద్ధం కారణంగా షిప్పింగ్ మార్గాల్లో అంతరాయం ఏర్పడింది. అంతేకాకుండా ఇన్సూరెన్స్ ఖర్చులు పెరుగుతున్నాయి. లాజిస్టిక్స్‌లో అనిశ్చితి నెలకొంది. బియ్యం ఎగుమతులపై యుద్ధ ప్రభావం ఎక్కువగా ఉంటుందని అంచనా. 2025లో భారత్ 4.43 బిలియన్ డాలర్ల విలువైన బియ్యాన్ని పశ్చిమాసియాకు ఎగుమతి చేసింది. ఇది గ్లోబల్ బియ్యం ఎగుమతుల్లో 36.7శాతం వాటాకు సమానం. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రైతులు పశ్చిమాసియా దేశాలపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. అదనంగా, అరటిపండ్లు (396.5 మిలియన్ డాలర్లు), ఉల్లిపాయలు, వెల్లుల్లి (111 మిలియన్ డాలర్లు), మసాలాలు ( 295.5 మిలియన్ డాలర్లు), కాఫీ (240.7 మిలియన్ డాలర్లు), టీ (410.1 మిలియన్ డాలర్లు), ప్రాసెస్డ్ ఫుడ్, చక్కెర, కోకో (1.35 బిలియన్ డాలర్లు), చేపలు, మాంసం (1.81 బిలియన్ డాలర్లు) వంటి ఉత్పత్తులు కూడా గల్ఫ్ మార్కెట్‌కు పెద్ద ఎత్తున వెళ్తున్నాయి.

## లక్ష కోట్ల ఎగుమతులపై యుద్ధం దెబ్బ: తెలుగు రైతన్నలకూ తప్పని తిప్పలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** మిడిల్‌ఈస్ట్ లో యుద్ధం నేపథ్యంలో భారతదేశం నుంచి పశ్చిమాసియా దేశాలకు జరిగే వ్యవసాయ ఎగుమతులు ఇప్పుడు సంక్షోభంలో పడ్డాయి. ముఖ్యంగా నౌకా రవాణా మార్గాల్లో అంతరాయాలు కలగడం, బీమా వ్యయాలు భారీగా పెరగడం, సరఫరాలో అనిశ్చితి నెలకొనడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. మన దేశం నుంచి ఎగుమతి అయ్యే మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల్లో ఐదో వంతుకు పైగా (21.8%) కేవలం ఈ పశ్చిమాసియా దేశాలకే వెళ్తున్నాయి. దశాబ్దాలుగా మన ఆహార ఉత్పత్తులకు గల్ఫ్ ప్రాంతం ఒక కీలక మార్కెట్‌గా మారింది, కానీ ప్రస్తుత ఉద్రిక్తతలు ఆ బంధాన్ని దెబ్బతీస్తున్నాయి.

**తెలుగు రాష్ట్రాల బియ్యం రైతులకు కష్టాలేనా?**

ఈ యుద్ధ ప్రభావం మన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని రైతులపై నేరుగా పడనుంది. గతేడాది పశ్చిమాసియాకు భారత్ 4.43 బిలియన్ డాలర్ల విలువైన బియ్యాన్ని ఎగుమతి చేసింది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే, భారత్ చేసే మొత్తం బియ్యం ఎగుమతుల్లో 36.7 శాతం వాటా ఈ దేశాలదే. ముఖ్యంగా ఏపీ, తెలంగాణతో పాటు పంజాబ్, హరియాణ వంటి రాష్ట్రాల నుంచి గల్ఫ్ మార్కెట్లకు బియ్యం అధికంగా వెళ్తుంటాయి. ఇప్పుడు అక్కడ యుద్ధం వల్ల రవాణా ఆగిపోతే, మన ఊరి మిల్లుల్లో బియ్యం నిల్వలు పెరిగిపోయి, రైతులకు మద్దతు ధర దక్కడం కష్టంగా మారవచ్చు.

**సుగంధ ద్రవ్యాల నుంచి పాల ఉత్పత్తుల వరకు..**

బియ్యం మాత్రమే కాదు, పశ్చిమాసియాకు మనం పంపే కూరగాయలు, సుగంధ ద్రవ్యాల వాటా చాలా పెద్దది. ప్రపంచవ్యాప్తంగా భారత్ చేసే ఎగుమతుల్లో సుమారు 29.2 శాతం వాటా ఈ ప్రాంతానిదే. అరటి ఎగుమతులు 396.5 మిలియన్ డాలర్లు, ఉల్లి, వెల్లుల్లి ఎగుమతులు 111 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి.యాలకులు, జాజికాయ (295.5 మిలియన్ డాలర్లు), జీలకర్ర, ధనియాలు (163 మిలియన్ డాలర్లు), అల్లం, పసుపు (173 మిలియన్ డాలర్లు) వంటివి కూడా భారీగా ఎగుమతి అవుతున్నాయి. వీటితో పాటు కాఫీ, తేయాకు, పంచదార, సుమారు 1.81 బిలియన్ డాలర్ల విలువైన మాంసం, చేపల ఉత్పత్తులు కూడా ఇబ్బందుల్లో పడే అవకాశం ఉంది.ప్రభుత్వం ఇచ్చిన చిన్న ఊరట కష్టకాలంలో ఎగుమతిదారులను ఆదుకోవడానికి ప్రభుత్వం కొన్ని సడలింపులను ప్రకటించింది. ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కేపిటల్ గూడ్స్ (ఈపీసీజీ) అనుమతులకు సంబంధించి ఎక్స్‌పోర్ట్ ఆబ్లిగేషన్ (ఈఓ) సమయాన్ని 2026, ఆగస్టు 31 వరకు ఆటోమేటిక్‌గా పొడిగించారు. దీని కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేయాల్సిన అవసరం, రుసుము చెల్లించాల్సిన అవసరం గానీ లేదు. అంతేకాకుండా, ఓడరేవుల్లో రవాణా ఛార్జీలను తగ్గించాలని లేదా రద్దు చేయాలని ప్రభుత్వం పోర్టులకు సూచించింది. యుద్ధం ఎక్కడో జరిగినా, దాని ప్రభావం మన పొలాల వరకు వస్తుందని ఈ గణాంకాలు చెబుతున్నాయి. ఒకవైపు పశ్చిమాసియాలో మార్కెట్ దెబ్బతింటుంటే, మరోవైపు ఐస్‌లాండ్ వంటి దేశాలు భారత్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతుండటం కొంత ఆశాజనకమైన విషయం. పర్యావరణ హిత ఇంధనం, ఫిషరీస్ వంటి రంగాల్లో కొత్త ఒప్పందాలు కుదిరే అవకాశం ఉంది. ఏదేమైనా, మన అన్నదాతల కష్టం వృథా కాకుండా ఉండాలంటే పశ్చిమాసియాలో త్వరగా శాంతి నెలకొనడం చాలా అవసరం.

## అమెరికాతో యుద్ధం : ఇరాన్ కి టన్నుల కొద్దీ ధైర్యం !

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎక్కడ అమెరికా ఎక్కడ ఇరాన్. ఆయుధాల పరంగా ఆర్థిక పరంగా ఇతరత్రా ఎలా చూసుకున్నా పసి కూన లాంటిది. కానీ ఎక్కడా తగ్గేదే లేదు అని చెబుతోంది. ఇప్పటికి దాదాపు పది రోజులు అవుతున్నా అమెరికా ప్లస్ ఇజ్రాయెల్ కలసి ఇరాన్ మీద భీకరమైన పోరు సాగిస్తున్నా ఇరాన్ మాత్రం ఏ మాత్రం జంకూ గొంకూ లేకుండా రెడీ అంటోంది. గుండె నిండా టన్నుల కొద్దీ ధైర్యం ఉంది అంటోంది. ఒక దేశంగా చూస్తే ఇరాన్ ఇంతలా అగ్ర రాజ్యం మీద పోరాటం చేయడం గ్రేట్ అనే అంటారు. కానీ దాని వెనక బలమైన ధీమా ఏంటి అన్నదే చర్చగా ఉంది.

**చమటలు పట్టిస్తున్నా :**

ఇజ్రాయెల్ తో ఎవరు యుద్ధం చేసినా చుక్కలు చూపిస్తుంది అని అంటారు. ఎందుకంటే రక్షణపరంగా ఇజ్రాయెల్ అలాంటిది మరి. ఆయుధ సంపత్తితో పాటు అత్యాధునిక టెక్నాలజీని మిక్స్ చేసి మరీ యుద్ధాన్ని నడుపుస్తుంది. అలాంటి ఇజ్రాయెల్ కి అమెరికా తోడు అయింది. దాంతో ఈ రెండు దేశాల ముందు నిలిచి గెలవడం ఇరాన్ వశం అయ్యేనా అని అంతా చర్చించుకునే పరిస్థితి ఉంది. యుద్ధం మొదలైన కొద్ది గంటలలోనే ఇరాన్ అధినేత సుప్రీ లీడర్ ఖమేనీని లేకుండా చేశారు. దాంతో తల తెగిన మొండెం మాదిరిగా ఇరాన్ తయారవుతుందని కకావికలు అవుతుందని భావించారు. కానీ పది రోజుల పాటు అలుపెరగని యుద్ధానికి ఇరాన్ సిద్ధం కావడం అంటే ప్రపంచమే నివ్వెర పోతోంది ఇక అమెరికా పెద్దన్నకు అయితే అసహనం తన్నుకుని వస్తోంది. మేమే గెలిచామని పైకి ఎంతలా బీరాలు పలుకుతున్నా ఇరాన్ తో కొలిక్కిరాని ఈ యుద్ధాన్ని చూసి అమెరికాకు కూడా ఏమి చేయాలో పాలుపోవడం లేదు అని అంటున్నారు.


**చమురు అస్త్రంతో :**

ఒక వైపు చూస్తే అమెరికా ఇరాన్ ని ఎలాగైనా లొంగదీయాలని తమ రాజ్యం అక్కడ స్థాపించాలని గట్టి ప్రయత్నమే చేస్తోంది. అయితే ఇరాన్ మాత్రం ఏ విధమైన ఒత్తిళ్లకు తాము తల వంచమని స్పష్టం చేస్తోంది. తమ మీద జరుగుతున్న దాడులకు ఇంతకు ఇంతా బదులు ఇస్తామని కూడా సవాల్ చేస్తోంది. అసలు ఇరాన్ వెనక ఉన్నదేంటి, ఇంతటి డేరింగ్ ఎలా వచ్చింది అంటే ఒక్కటే జవాబు దొరుకుతుంది. అంతే చమురు అస్త్రం. ఈ రోజున ప్రపంచం అనే బండి నడవడానికి చమురు చాలా అవసరం. ఇంధనం లేకపోతే ఈ ప్రపంచం కదిలేది ఉండదు. అందుకే అమెరికా ఎంతలా టార్గెట్ చేస్తున్నా ఇరాన్ మాత్రం తమ వద్ద ఉన్న చమురు అస్త్రాన్ని ముందుకు పెడుతోంది. దానితోనే ప్రపంచన్ని అమెరికా మీదకు ఎగదోయవచ్చు అని చూస్తోంది.

**అమెరికా మీద తీవ్ర ఒత్తిడి :**

యుద్ధం అన్నది తొందరలో ముగియదని, ఎంతకాలం అయినా చేస్తామని అమెరికా అంటూంటే ఇరాన్ మాట ఎలా ఉన్నా ప్రపంచం మాత్రం బెదిరిపోతోంది. ఎందుకు అంటే చమురు సంక్షోభం తలెత్తుతుంది అని దాని వల్ల అన్ని దేశాలూ ఇబ్బందుల్లో పడతాయి అన్నదే ఇరాన్ మార్క్ వ్యూహం. ఇదే అసలు నిజం కూడా. కొన్ని రోజులు అయితే ఏ దేశమైనా తట్టుకుంటుంది కానీ దీర్ఘ కాలం యుద్ధం జరిగితే మాత్రం ఇంధన కొరతతో దేశాలకు దేశాలు అల్లల్లాడతాయి.

# మహేష్ (X) అల్లు అర్జున్: ఈ మ్యాటర్‌లో పోటాపోటీ!




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగు చిత్రసీమలో అగ్ర కథానాయకులుగా వెలుగొందుతున్న సూపర్‌స్టార్ మహేష్ బాబు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఇప్పుడు వెండితెరపైనే కాకుండా థియేటర్ల వ్యాపారంలోనూ ఒకరికొకరు గట్టి పోటీని ఇస్తున్నారు. ఏషియన్ సినిమాస్‌తో కలిసి మహేష్ బాబు నిర్మించిన ఏఎంబీ (ూవీదీ) సినిమాస్ ఇప్పటికే హైదరాబాద్‌లో ఒక బ్రాండ్‌గా మారిపోయింది. గచ్చిబౌలిలో ఉన్న ప్రధాన బ్రాంచ్‌తో పాటు, ఇటీవల బెంగళూరులో కూడా ఏఎంబీ సినిమాస్ కార్యకలాపాలను ప్రారంభించడం విశేషం. అంతేకాకుండా హైదరాబాద్‌లో మరో కొత్త బ్రాంచ్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లో ప్రారంభించిన సంగతి తెలిసిందే. తదుపరి హైదరాబాద్ లోనే హకీం పేటలో మరో కొత్త మల్టీప్లెక్స్ నిర్మాణం కోసం ప్రణాళికలు ఉండగా, గోవా, చెన్నైలోను ఏఎంబి మాల్స్ నిర్మాణం కోసం ఏషియన్ తో కలిసి ప్లాన్ చేస్తున్నారని కూడా కథనాలొచ్చాయి.మరోవైపు అల్లు అర్జున్ తన ఏఏఏ (ూూూ) సినిమాస్ బ్రాండ్‌ను శరవేగంగా విస్తరిస్తున్నారు. కోకాపేటలో నిర్మించిన అల్లు సినిమాస్ పనులు దాదాపు ముగింపు దశకు చేరుకున్నాయి. వాస్తవానికి ఈ సంక్రాంతికే ఇది ప్రారంభం కావాల్సి ఉన్నా కానీ.. కొన్ని నిర్మాణ పనుల జాప్యం కారణంగా వాయిదా పడింది. ఎట్టకేలకు దురంధర్ 2 ప్రీమియర్ తో ఇది మొదలవుతోందని సమాచారం. ఉగాది పర్వదినం సందర్భంగా ఈ భారీ మల్టీప్లెక్స్ మరింత కళకళలాడబోతోంది. పవర్ స్టార్ ఉస్తాద్ భగత్ సింగ్ ఈ థియేటర్ లో ఆడనుంది. ఇటీవల అల్లు శిరీష్ ప్రీ-వెడ్డింగ్ వేడుకను కూడా ఇదే ప్రాంగణంలో నిర్వహించడం ద్వారా ఈ మల్టీప్లెక్స్ సందడి అప్పుడే మొదలైంది. మరోవైపు వైజాగ్ లోను ఏఏఏ (ూూూ) సినిమాస్ బ్రాండ్‌ను అల్లు అర్జున్ బృందం విస్తరిస్తున్న సంగతి తెలిసిందే.కోకాపేట -ఏఏఏ సినిమాస్- ప్రత్యేకతలు ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా ఉన్నాయి. దేశంలోనే అతిపెద్ద -డాల్బీ స్క్రీన్- ఈ థియేటర్ లో అందుబాటులో ఉంది. ఈ భారీ స్క్రీన్‌తో పాటు మరో మూడు స్క్రీన్లు ఇక్కడ అందుబాటులోకి రానున్నాయి. ఈ మల్టీప్లెక్స్‌లో ప్రదర్శించబడే మొదటి పెద్ద చిత్రంగా -దురంధర్- సీక్వెల్ ఉండబోతోందని సమాచారం. ఆ తర్వాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన -ఉస్తాద్ భగత్ సింగ్- వంటి భారీ చిత్రాలు ఇక్కడ సందడి చేయనున్నాయి. ఉగాదికి విడుదలయ్యే కొత్త సినిమాలు ఈ అత్యాధునిక స్క్రీన్లపై ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచనున్నాయి.హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం ఏఎంబీ, ఏఏఏ సినిమాస్ మధ్య పోటాపోటీ వాతావరణం కనిపిస్తోంది. ఏషియన్ సినిమాస్ భాగస్వామ్యంతో మహేష్ బాబు, అల్లు అర్జున్ ఇద్దరూ కూడా అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో కూడిన మల్టీప్లెక్స్‌లను నిర్మించేందుకు పోటీపడుతున్నారు. ప్రేక్షకులు కేవలం సినిమా చూడటమే కాకుండా ఒక లగ్జరీ యాంబియెన్స్ అనుభూతిని పొందేలా ఈ థియేటర్ల డిజైన్ ఉండటం విశేషం. ఏఎంబీ క్లాస్ లుక్‌తో ఆకట్టుకుంటుంటే, అల్లు సినిమాస్ టెక్నాలజీ పరంగా సరికొత్త రికార్డులను సృష్టించేందుకు సిద్ధమైంది.మల్టీప్లెక్స్ వ్యాపార రేసులో మహేష్, అల్లు అర్జున్ ముందు వరుసలో ఉన్నా కానీ.. యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ కూడా ఈ రంగంలో తన అడుగులు వేస్తున్నారు. అయితే ప్రభాస్ తన థియేటర్ల వ్యాపారాన్ని నెల్లూరు వంటి ప్రాంతాలకు పరిమితం చేశారు తప్ప ఇప్పటివరకు హైదరాబాద్‌లో సొంత మల్టీప్లెక్స్‌ను ప్రారంభించలేదు. ప్రభాస్ నుంచి కూడా భవిష్యత్తులో హైదరాబాద్ మార్కెట్లోకి ఎంట్రీ ఉంటుందేమోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఇక ఇతర అగ్ర హీరోలైన యంగ్ టైగర్ ఎన్టీఆర్, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం థియేటర్ల వ్యాపారంలో తటస్థంగా వ్యవహరిస్తున్నారు. వీరు తమ పూర్తి దృష్టిని సినిమాలపైనే కేటాయిస్తున్నారు. ప్రస్తుతం మహేష్ బాబు , అల్లు అర్జున్ మాత్రమే ఈ రంగంలో స్పీడ్ గా ఉన్నారు. వీరిద్దరి మధ్య సాగుతున్న ఈ ఆరోగ్యకరమైన పోటీ తెలుగు ప్రేక్షకులకు అంతర్జాతీయ స్థాయి థియేటర్ అనుభవాన్ని అందిస్తోంది.

# ఫ్లాప్ ల్లో డబుల్ హ్యాట్రిక్ స్టార్ !

**హైదరాబాద్ పెన్ పవర్:** బాలీవుడ్ లో అక్షయ్ కుమార్...టాలీవుడ్ లో రవితేజ కెరీర్ గ్రాఫ్ ఒకేలా ఉందన్నది వాస్తవం. హిందీ నటుల్లో వరుస ఫ్లాప్ లతో అక్షయ్ కుమార్ రికార్డు సృష్టిస్తే టాలీవుడ్ లో రవితేజ పేరిట అలాంటి రికార్డులు నమోదవుతున్నాయి. ఇటీవలే రిలీజ్ అయిన -భర్త మహాశయులకు విజ్ఞప్తి- ఫ్లాప్ తో రవితేజ కెరీర్ లో ఫ్లాప్ ల్లో డబుల్ హ్యాట్రిక్ నమోదైంది. ఓ సారి ఆ వివరాల్లోకి వెళ్తే -ధమాకా- తర్వాత రవితేజ నటించిన అన్ని సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. -రావణాసుర-, -టైగర్ గనాగేశ్వరరావు-, -ఈగల్-, - మిస్టర్ బచ్చన్-, -మాస్ జాతర- ఇలా వరుసగా ఐదు సినిమాలు పరాజయం చెందాయి.అయినా రవితేజ ఎక్కడా నమ్మకాన్ని కోల్పోలేదు. రెట్టించిన ఉత్సాహంతోనే ముందుకు సాగాడు. ఈ క్రమంలో కిషోర్ తిరుమలతో కలిసి ఫ్యామిలీ రూట్లోకి వచ్చాడు. వాళ్లిద్దరి కాంబినేషన్ లో తెరకెక్కిన -భర్త మహాశయులకు విజ్ఞప్తి- సంక్రాంతి కానుకగా రిలీజ్ అయింది. కిషోర్ సక్సెస్ ట్రాక్ చూసి ఈ సినిమా భారీ విజయం సాధిస్తుంద నుకున్నారంతా. రవితేజ కూడా సినిమాపై చాలా కాన్ఫిడెంట్ గా కనిపించాడు. కానీ వారు ఒకటి తలిస్తే ఫలితం మరోలా వచ్చింది. ఈసినిమా కూడా అంచనాలు అందుకోవడంలో విఫలమైంది. దీంతో ఫ్లాప్ ల్లో రవితేజ పేరిట డబుల్ హ్యాట్రిక్ నమోదైంది.మూడు దశాబ్దాల రవితేజ కెరీర్ ఇలా అరు పరాజయాలు ఎక్కడా చోటు చేసుకోలేదు. ఈ నాలుగేళ్ల కాలంలోనే ఇలాంటి ప్రతికూల పరిస్థితిని ఎదుర్కొన్నారు. -రాజా ది గ్రేట్- తర్వాత వరుసగా నాలుగు ఫ్లాప్ లు పడ్డాయి. -టచ్ చేసి చూడు-, -నేల టికెట్-, -అమర్ అక్బర్ ఆంటోనీ-, -డిస్కోరాజా- ఫ్లాప్ అయ్యాయి. అనంతరం -క్రాక్- విజయంతో పట్టాలెక్కాడు అనుకున్న సమయంలోనే వెంటనే -ఖిలాడీ- తో మరో ఫ్లాప్ ఎదురైంది. ఆ పరాజయాన్ని తర్వాత చిత్రం -రామారావు ఆన్ డ్యూటీ-తో కంటున్యూ చేసాడు. సరిగ్గా అదే సమయంలో మళ్లీ -ధమాకా-తో హిట్ అందుకున్నాడు.

అనంతరం మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన -వాల్తేరు వీరయ్యలో కీలక పాత్రకు ఎంపికయ్యాడు. ఆ సినిమా మంచి విజయం సాధించడంతో? అన్నయ్య-తమ్ముడు కాంబినేషన్ బాగా వర్కౌట్ అయిందని అభిమానులు సంతోషించారు. కానీ రవితేజ సోలో సక్సస్ కి మాత్రం వందల కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాడు. ప్రస్తుతం రవితేజ కొత్త సినిమాకు సన్నాహాలు చేస్తున్నాడు. -మజిలీ- ఫేం శివ నిర్వాణ దర్శకత్వంలో సినిమా చేయడానికి రెడీ అవుతున్నాడు. ఈసినిమాకు సంబంధించిన అప్ డేట్ అతి త్వరలోనే రానుంది. వరుస ఫ్లాప్ ల నేపథ్యంలో రవితేజ కూడా విశ్లేషించుకునే పనిలో పడ్డాడు.

# డీకేకు సీఎం పీఠం...సిద్ధరామయ్య వ్యాఖ్యల వెనక ?

**హైదరాబాద్ పెన్ పవర్:** కర్ణాటకలో రాజకీయం మారుతోంది. మరో పది రోజులలో ఉగాది పండుగ రాబోతోంది. ఈ ఉగాది తరువాత కర్ణాటకలో ముఖ్య మంత్రి పీఠం నుంచి ప్రస్తుత సీఎం సిద్దరామయ్య తప్పుకుంటారు అని అంటున్నారు

కర్ణాటకలో రాజకీయం మారుతోంది. మరో పది రోజులలో ఉగాది పండుగ రాబోతోంది. ఈ ఉగాది తరువాత కర్ణాటకలో ముఖ్య మంత్రి పీఠం నుంచి ప్రస్తుత సీఎం సిద్దరామయ్య తప్పుకుంటారు అని అంటున్నారు. ఒక విధంగా మూడేళ్ల పాలన పూర్తి చేసుకున్న తరువాత అనుకోవాలి. దీనికి సంబంధించి పూర్వ రంగం అయితే కాంగ్రెస్ హైకమాండ్ సిద్ధం చేసింది అని అంటున్నారు ఆ విషయం సిద్ధరామయ్యకు కూడా చేరవేయడంతో ఆయన తాజాగా అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన తరువాత మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు అని అంటున్నారు.



**హైకమాండ్ దయ అంటూ :**

తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ఇప్పటికి మూడు బడ్జెట్లను ప్రజలకు అందించాను అని సిద్ధరామయ్య చెప్పారు అధినాయకత్వం కనుక అవకాశం ఇస్తే మరో రెండు బడ్జెట్ లను కూడా ప్రవేశపెడతాను అని ఆయన చెప్పేశారు. అంటే ఫుల్ టెర్మ్ సీఎం గా ఉండడానికి హై కమాండ్ అనుగ్రహం కావాలని ఆయన చెప్పకనే చెప్పారు అని అంటున్నారు. ఈ కీలక వ్యాఖ్యలు ఇపుడు కర్ణాటకలో రాజకీయ వేడిని రాజేస్తున్నాయి.

**రెడీ అంటూ సంకేతమా :**

ఇదిలా ఉంటే ఇప్పటిదాకా సిద్ధరామయ్య వర్గం మంత్రులు కానీ ఎమ్మెల్యేలు కానీ తమ నాయకుడు అయిదేళ్ళూ సీఎం గా ఉంటారు అని చెప్పుకొచ్చేవారు. ఇక హై కమాండ్ కూడా మధ్యలో మార్పులు ఎందుకు పెద్దాయనను కంటిన్యూ చేస్తే సరిపోతుంది అని ఒక దశలో అనుకున్నట్లుగా వార్తలు వచ్చాయి. అయితే కర్ణాటకలో మారుతున్న రాజకీయం డీకే వర్గంలో పెరుగుతున్న అసహనం అన్నీ కలసి కాంగ్రెస్ పెద్దల మనసు మార్చేశాయని అంటున్నారు. దాంతో పాటుగా సిద్ధరామయ్య కూడా కాంగ్రెస్ పెద్దలు ఆదేశిస్తే తాను గద్దె దిగేందుకు సిద్ధం అన్నట్లుగా సంకేతాలు ఇచ్చేశారు అని అంటున్నారు. అదే సమయంలో అవకాశం ఇస్తే మరో రెండు బడ్జెట్లు ప్రవేశపెడతాను అని కూడా అంటున్నారు.

**ముహూర్తం ఫిక్స్ :**

మొత్తానికి బంతిని మాత్రం కాంగ్రెస్ పెద్దల కోర్టులో వేశారు అని అంటున్నారు. ఇవన్నీ పక్కన పెడితే ప్రస్తుతం కర్ణాటకలో జోరుగా ప్రచారం అయితే సాగుతోంది. అదేంటి అంటే ఉగాది తరువాత కర్ణాటక అధికార పీఠం లో మార్పులు ఉంటాయని ఇది కాంగ్రెస్ తో పాటు బయట కూడా ప్రచారంలో ఉంది. దాంతో ఏదో జరగబోతోంది అన్నది అయితే అంతటా ఉత్కంఠగా మారింది.

**ట్రబుల్ షూటర్ కి పగ్గాలు :**

మరో రెండేళ్ళలో కర్ణాటకలో అసెంబ్లీకి ఎన్నికలు ఉన్నాయి. దాంతో ట్రబుల్ షూటర్ గా పేరున్న డీకే శివ కుమార్ కి అవకాశం కల్పించాలని పార్టీ పెద్దలు ఒక కీలక నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. మూడేళ్ళ సిద్ధరామయ్య పాలన పట్ల ఏ మాత్రం అసంతృప్తి ఉన్నా డీకే వంటి ఫ్రెష్ లీడర్ ని గద్దెనెక్కిస్తే ఎన్నికల వేళకు మళ్ళీ కాంగ్రెస్ కి పాజిటివ్ వేవ్ వస్తుంది అన్నది కాంగ్రెస్ పెద్దల ఆలోచనగా ఉంది అని అంటున్నారు.

**వీర విధేయులుగా :**

ఇక సిద్ధ రామయ్య కానీ డీకే శివకుమార్ కానీ కాంగ్రెస్ అధినాయకత్వానికి వీర విధేయులుగా ఉంటున్నారు. డీకే తనకు సీఎం పదవి విషయంలో ఎక్కడా బయటపడడం లేదు, అలాగే సిద్ధ రామయ్య సైతం హైకమాండ్ ఏమి చెప్పినా ఎలా ఆదేశించినా రెడీ అని అంటున్నారు దీంతో సీఎం మార్పు అన్నది కర్ణాటకలో స్మూత్ గానే సాగుతుంది అని అంటున్నారు ఉగాది తరువాత మంచి రోజు చూసుకుని డీకేకు సీఎం పీఠం అప్పగించనున్నారు అన్నది అయితే గట్టిగా వినిపిస్తున్న ప్రచారం. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# బ్రేక్ ఫాస్ట్ మానేస్తున్నారా?

ఆధునిక జీవనశైలిలో చాలా మంది సమయం లేకనో లేదా బరువు తగ్గాలనే ఉద్దేశంతోనో చేసే మొదటి పని అల్పాహారాన్ని స్కిప్ చేయడం. కానీ, ఈ అలవాటు ఆరోగ్యానికి మేలు చేయడం కంటే ఎక్కువ కీడు చేస్తుందని నిపుణులు పదే పదే హెచ్చరిస్తున్నారు. అల్పాహారం మానేయడం వల్ల శరీరంలో జరిగే మార్పులు, అది పొట్ట దగ్గర కొవ్వు పెరగడానికి ఎలా కారణమవుతుందో తెలుసుకుందాం.. ఉదయాన్నే లేవగానే ఆఫీస్ పనుల కంగారులోనో లేదా డైటింగ్ పేరుతోనో మీరు అల్పాహారాన్ని పక్కన పెడుతున్నారా? అయితే మీరు తెలియకుండానే ఒక పెద్ద ఆరోగ్య సమస్యను కొనితెచ్చుకుంటున్నారు. బరువు తగ్గాలని అల్పాహారం మానేస్తే, అది రివర్స్ అయి మీ పొట్ట చుట్టూ కొవ్వు పెరగడానికి కారణం అవుతుందని ప్రముఖ పోషకాహార నిపుణులు చెబుతున్నారు. రాజ్ షమానీ పాడ్‌కాస్ట్‌లో ఒక నిపుణురాలు వెల్లడించిన గణాంకాలు ఇప్పుడు అందరినీ భయాందోళనకు గురి చేస్తున్నాయి. ప్రముఖ న్యూట్రిషనిస్ట్ పూజా మఖిజా ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ అల్పాహారం మానేసే వారిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. ఎవరైతే క్రమం తప్పకుండా బ్రేక్ ఫాస్ట్ స్కిప్ చేస్తారో, అటువంటి వారిలో పొట్ట దగ్గర కొవ్వు పెరిగే అవకాశం 31 శాతం ఎక్కువగా ఉంటుంది. అంతేకాకుండా, అల్పాహారం తినని వారు సాధారణ వ్యక్తుల కంటే 48 శాతం ఎక్కువగా ఓవర్ వెయిట్ అయ్యే ప్రమాదం ఉంది. మరీ ముఖ్యంగా, వీరిలో స్థూలకాయం బారిన పడే అవకాశం 44 శాతం ఎక్కువగా ఉంటుందని ఆమె గణాంకాలతో వివరించారు. అల్పాహారం తీసుకోకపోవడం వల్ల శరీరానికి అందాల్సిన శక్తి అందదు. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గి, మెదడు వెంటనే శక్తిని ఇచ్చే తీపి పదార్థాలను కోరుకుంటుంది. ఫలితంగా అల్పాహారం మానేసిన వారు లంచ్ సమయంలో లేదా సాయంత్రం వేళల్లో జంక్ ఫుడ్, స్వీట్లు ఎక్కువగా తీసుకుంటారు. ఇదే క్రమంగా శరీర బరువు పెరగడానికి, పొట్ట దగ్గర అదనపు కొవ్వు చేరడానికి దారితీస్తుందని పూజా మఖిజా పేర్కొన్నారు. ఈ అంశంపై థానేలోని



కిమ్స్ హాస్పిటల్స్ డయాబెటాలజీ విభాగం హెడ్ డాక్టర్ విజయ్ నెగలూర్ స్పందిస్తూ కొన్ని కీలక విషయాలు వెల్లడించారు. అల్పాహారం మానేయడం వల్ల పొట్ట దగ్గర కొవ్వు పెరుగుతుందని అనేక అధ్యయనాలు చెబుతున్న మాట వాస్తవమేనని ఆయన అంగీకరించారు. అయితే, అల్పాహారం మానేయడమే నేరుగా దీనికి కారణం కాకపోవచ్చుని, కానీ ఇది జీవక్రియపై ప్రభావం చూపిస్తుందని ఆయన వివరించారు. అల్పాహారం మానేసే వారి జీవనశైలిలో ఉండే ఇతర అస్తవ్యస్త అలవాట్లు కూడా స్థూలకాయానికి తోడవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఆరోగ్యకరమైన ఉదయం కోసం సమతుల్యమైన అల్పాహారం తీసుకోవడం ఎంతో అవసరం. కేవలం బరువు తగ్గడం కోసం బ్రేక్ ఫాస్ట్ స్కిప్ చేయడం వల్ల ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువ. కాబట్టి రేపటి నుండి మీ డైట్ లో పోషకాలు నిండిన అల్పాహారాన్ని చేర్చుకోండి.

# చెడు కొలెస్ట్రాల్ తగ్గించే అలవాట్లు



మీ రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉన్నాయా? ఆరోగ్యకరమైన గుండెకు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడం ముఖ్యం. సరైన ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, బరువు నియంత్రణ, ఒత్తిడి లేని జీవనం కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుతాయి. శాఖాహారం, ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు, ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్, కొన్ని హెర్బల్ టీలు, వెల్లుల్లి వంటివి మేలు చేస్తాయి. మీ గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోండి. కొలెస్ట్రాల్ అంటే ఏమిటి? కొలెస్ట్రాల్ అనేది మీ రక్తంలో కనిపించే మైనపు, కొవ్వు లాంటి పదార్థం. ఆరోగ్యకరమైన కణాలను నిర్మించడానికి మీ శరీరానికి కొంత కొలెస్ట్రాల్ అవసరం. కానీ అధిక స్థాయిలు మీ ధమనులలో ఫలకాలు ఏర్పడటానికి దారితీస్తాయి. హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతాయి. మొత్తం గుండె ఆరోగ్యానికి ఆరోగ్యకరమైన కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించడం చాలా అవసరం. సాధారణంగా చెడు కొలెస్ట్రాల్ అని పిలువబడే తక్కువ-సాంద్రత కలిగిన లిపోప్రొటీన్ (ఒఆఒ) ఎక్కువైతే, గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతాయి. అయితే అధిక-సాంద్రత కలిగిన లిపోప్రొటీన్ (ఊఆఒ) లేదా మంచి కొలెస్ట్రాల్ మీ గుండెను రక్షించడంలో సహాయపడతాయి. శాఖాహారం: మొక్కల ఆధారిత ఆహారాల్లో అన్‌శాచురేటెడ్ ఫ్యాట్ (మంచి కొవ్వు), ఫైబర్, ప్లాంట్ ప్రోటీన్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్ కరిగించడంలో సహాయపడతాయి. అందుకే మాంసం బదులు శాఖాహారం తినడానికి ప్రాధాన్యత ఇవ్వండి. తాజా పండ్లు, కూరగాయలు, గింజలు, ధాన్యాలు తీసుకోండి. అలాగే పీనట్ బటర్, ఆల్మండ్ బటర్ మేలు చేస్తాయి. నూనెల్లో ఆలివ్ ఆయిల్, సోయాబీన్ ఆయిల్, పల్లీ నూనె, మొక్కజొన్న నూనె మంచివి. ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారం: సాల్యుబుల్ ఫైబర్ ఎక్కువగా గల ఆహారాలు తినడం ద్వారా చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. అందుకే మీ డైట్‌లో ఓట్స్, బీన్స్, పప్పులు, బఠానీలు, శనగలు, యాపిల్, నారింజ, చియా సీడ్స్, అవిసె గింజలతో పాటు బ్రోకలీ, క్యారెట్, క్యాబేజీ వంటివి ఎక్కువగా తీసుకోవాలి. బరువు అదుపులో ఉండాలి: మీరు అధిక బరువు సమస్యతో బాధపడుతున్నట్లయితే మీ బాడీలో చెడు కొలెస్ట్రాల్ లెవెల్స్ కూడా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. అందుకే బరువు తగ్గేందుకు ప్రయత్నించండి. కనీసం 5 శాతం బరువు తగ్గినా కొలెస్ట్రాల్ లెవెల్స్ కూడా భారీగా తగ్గే అవకాశం ఉంది. వ్యాయామం: చెడు కొలెస్ట్రాల్ తగ్గడం కోసం రోజూ వ్యాయామం చేయడం మంచిది. ముఖ్యంగా బ్రిస్క్ వాకింగ్, జాగింగ్, సైక్లింగ్, స్కిప్పింగ్, స్విమ్మింగ్, టెన్నిస్, బ్యాడ్మింటన్ వంటివి మేలు చేస్తాయి. ఇవి బరువు కూడా అదుపులో ఉంచుతాయి.ఒమెగా-3 ఫుడ్స్?: ట్రైగ్లిజరాయిడ్స్ లెవెల్స్ తగ్గించడంలో ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ సహాయపడతాయి. అలాగే గుండె, మెదడును ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ ఒమెగా-3 కోసం చేపలు, గింజలు, విత్తనాలు, వెజిటేబుల్ ఆయిల్ వంటివి తీసుకోవడం మంచిది.ఒత్తిడి వద్దు: ఒత్తిడి వల్ల బాడీలో కార్టిసాల్ హార్మోన్ లెవెల్స్ పెరిగి ట్రైగ్లిజరాయిడ్ లెవెల్స్ కూడా పెరుగుతాయి. అందుకే ఒత్తిడి లేకుండా చూసుకోండి. దీనికోసం రోజూ ధ్యానం, ప్రాణాయామం చేయండి. అందరితో సరదాగా గడపండి. మ్యూజిక్ వినండి. మీకు నచ్చిన పని చేయండి.హెర్బల్ టీ: కొన్ని హెర్బల్ టీలు చెడు కొలెస్ట్రాల్ కరిగించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా గ్రీన్ టీ, చమోమిలే టీ, హైబిస్కస్ టీ, పసుపు టీ వంటివి మేలు చేస్తాయి. ఇవి బరువు కూడా అదుపులో ఉంచుతాయి.ఆల్కహాల్, స్మోకింగ్: ఆల్కహాల్ తాగడం, స్మోకింగ్ చేయడం వల్ల బాడీలో చెడు కొలెస్ట్రాల్ లెవెల్స్ భారీగా పెరుగుతాయి. అందుకే ఇలాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండండి. గుండెను ఆరోగ్యంగా ఉంచుకోండి. ఇవి మేలు: చెడు కొలెస్ట్రాల్ తగ్గాలంటే కొన్ని పదార్థాలు చాలా బాగా సహాయపడతాయి. ముఖ్యంగా చియా సీడ్స్, అవిసె గింజలు, సోయా, వెల్లుల్లి వంటివి చెడు కొలెస్ట్రాల్ తొందరగా కరిగిస్తాయి. అందుకే మీ డైట్‌లో వీటిని ఎక్కువగా తీసుకోండి.

# నిద్ర లేకపోతే బాడీ షెడ్డుకే!

నేటి వేగవంతమైన జీవితంలో, చాలా మందికి తగినంత నిద్ర ఉండటం లేదు.. దీర్ఘకాలిక నిద్ర లేమి అనేక తీవ్రమైన వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది.. కాబట్టి, దీనిని ఒక చిన్న సమస్యగా విస్మరించడం సరైనది కాదని హెచ్చరిస్తున్నారు వైద్య నిపుణులు. నేటి వేగవంతమైన జీవితంలో.. చాలా మంది నిద్రలేమిని ఎదుర్కొంటున్నారు. రాత్రిపూట మొబైల్ ఫోన్ వాడకం, నిరంతరం స్క్రీన్ సమయం, ఒత్తిడి, రోజువారీ దినచర్యలు సరిగా లేకపోవడం, ఆలస్యంగా భోజనం చేయడం, షిఫ్ట్ పని, మానసిక ఒత్తిడి ఇవన్నీ నిద్రను ప్రభావితం చేస్తాయి. కొంతమంది పనిభారం కారణంగా సమయానికి నిద్రించడానికి ఇబ్బంది పడుతుండగా.. మరికొందరు ఆందోళన, అతిగా ఆలోచించడం వల్ల నిద్రపోవడానికి ఇబ్బంది పడుతున్నారు. అధిక కెఫిన్ వినియోగం, రాత్రిపూట టీవీ చూడటం, నిర్ణీత సమయంలో నిద్రపోకపోవడం కూడా ప్రధాన కారణాలని.. వైద్య నిపుణులు చెబుతున్నారు. అటువంటి పరిస్థితిలో, నిద్ర లేకపోవడం క్రమంగా ఒక అలవాటుగా మారుతుంది.. ఇది శరీరం సహజ నిద్ర సమతుల్యతను దెబ్బతీస్తుంది. శరీరానికి విశ్రాంతి ఇవ్వడానికి, మనస్సును రిఫ్రెష్ చేయడానికి, కణాలను రిపేర్ చేయడానికి తగినంత.. మంచి నిద్ర అవసరమని భావిస్తారు. తగినంత నిద్ర లేనప్పుడు, శరీరం, మనస్సు రెండూ ప్రభావితమవుతాయి. ఇది అనేక వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. లేడీ హార్డింజ్ హాస్పిటల్‌లోని మెడిసిన్ విభాగం



డైరెక్టర్, ఊూఆ డాక్టర్ ఒ.ఊ. ఘోటేకర్ వివరిస్తూ.. దీర్ఘకాలిక నిద్ర లేమి అనేక తీవ్రమైన వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. ఇది అధిక రక్తపోటు, గుండె జబ్బులు, మధుమేహం ప్రమాదాన్ని పెంచుతుంది. తగినంత నిద్ర లేకపోవడం వల్ల శరీరంలో హార్మోన్ల అసమతుల్యత కూడా ఏర్పడుతుంది.. ఇది ఊబకాయానికి దారితీస్తుంది. బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ కూడా ఇన్ఫెక్షన్ ప్రమాదాన్ని పెంచుతుంది. దీర్ఘకాలిక నిద్ర లేమి నిరాశ, ఆందోళన ? జ్ఞాపకశక్తి కోల్పోవడం వంటి మానసిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. అందువల్ల, నిద్రను నిర్లక్ష్యం చేయడం ఆరోగ్యానికి హానికరం. నిద్ర లేమి లక్షణాలు క్రమంగా కనిపిస్తాయి. సాధారణ సంకేతాలలో రోజంతా అలసట, చిరాకు, తలనొప్పి, దృష్టి కేంద్రీకరించడంలో ఇబ్బంది, ఏకాగ్రత లేకపోవడం వంటివి ఉంటాయి. తరచుగా ఆవలించడం, కళ్ళు బరువెక్కడం కూడా లక్షణాలు కావచ్చు. కొంతమందికి జ్ఞాపకశక్తి కోల్పోవడం, నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బంది కూడా ఉంటుంది. దీర్ఘకాలిక నిద్ర లేమి ఒత్తిడి ? మానసిక స్థితిలో మార్పులను పెంచుతుంది. తగినంత నిద్ర పొందడానికి, ప్రతిరోజూ ఒకే సమయంలో పడుకోవడం, మేల్కొవడం అలవాటు చేసుకోండి. పడుకునే ముందు మొబైల్ ఫోన్లు, టీవీ చూడటం మానుకోండి. తేలికపాటి భోజనం తినండి.. కెఫిన్ తీసుకోవడం పరిమితం చేయండి. మీ నిద్ర వాతావరణాన్ని నిశ్శబ్దంగా, సౌకర్యవంతంగా ఉంచండి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి.. కానీ పడుకునే ముందు కఠినమైన వ్యాయామాన్ని నివారించండి. ఒత్తిడిని తగ్గించడానికి ధ్యానం లేదా యోగా ప్రయత్నించండి.

## రక్తహీనతతో బాధపడుతున్నారా?



ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపే వారు ఎప్పుడూ ఒకే రకమైన టిఫిన్లు తిని బోర్ ఫీల్ అవుతుంటారు. ముఖ్యంగా బరువు తగ్గాలని ప్రయత్నించే వారికి, జిమ్‌కు వెళ్లే వారికి ప్రోటీన్ అధికంగా ఉండే అల్పాహారం ఎంతో అవసరం. సాధారణంగా దోశ అనగానే కేవలం పిండిపదార్థాలు మాత్రమే ఉంటాయని అనుకుంటాం. కానీ, కూరగాయల్లో రారాజైన బీట్‌రూట్, ప్రోటీన్ గని అయిన పనీర్ కలిపి చేసే ఈ స్పెషల్ దోశ తింటే మీ ఆరోగ్యానికి తిరుగుండదు. కేవలం రుచిలోనే కాదు, రక్తహీనతను తగ్గించడంలోనూ ఇది అద్భుతంగా పనిచేస్తుంది.చాలా మంది పిల్లలు బీట్‌రూట్ కూర అంటే ముఖం చాటేస్తుంటారు. కానీ అదే బీట్‌రూట్‌ను ఈ వినూత్న పద్ధతిలో దోశలా చేసి పెడితే ప్లేట్లు ఖాళీ అవ్వాల్సిందే. ఎర్రగా మెరిసిపోయే ఈ దోశ చూడటానికి ఆకర్షణీయంగా ఉండటమే కాకుండా, శరీరానికి కావాల్సిన హిమోగ్లోబిన్‌ను పుష్కలంగా అందిస్తుంది. పనీర్ కలయిక వల్ల ఇది తిన్న తర్వాత చాలా సేపు ఆకలి వేయదు. ఈ దోశ తయారీకి ఒక మధ్యస్థ బీట్‌రూట్, 100 గ్రాముల పనీర్, ఒక కప్పు శెనగపిండి సిద్ధం చేసుకోవాలి. రుచి కోసం ఒక ఉల్లిపాయ, రెండు పచ్చిమిర్చి, చిన్న అల్లం ముక్క, అర స్పూన్ జీలకర్ర, కొద్దిగా కొత్తిమీర తురుము ఉండాలి. వీటితో పాటు రుచికి సరిపడా ఉప్పు, అవసరమైనంత నీరు, కాల్చడానికి నెయ్యి లేదా నూనె తీసుకోవాలి. ముందుగా బీట్‌రూట్ తొక్క తీసి శుభ్రంగా కడిగి సన్నగా తురుముకోవాలి. పనీర్‌ను చేతితో లేదా ఫోర్క్‌తో మెత్తగా నలుపుకోవాలి. ఇప్పుడు ఒక గిన్నెలో శెనగపిండి తీసుకుని, అందులో తురిమిన బీట్‌రూట్, పనీర్, సన్నగా తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి, అల్లం తురుము, జీలకర్ర, కొత్తిమీర, ఉప్పు వేసి బాగా కలపాలి.ఈ మిశ్రమంలో కొద్దికొద్దిగా నీరు పోస్తూ గడ్డలు లేకుండా దోశ పిండిలా జారేలా కలుపుకోవాలి. శెనగపిండి వల్ల దోశకు మంచి బైండింగ్ రావడమే కాకుండా అదనపు ప్రోటీన్ అందుతుంది. స్టవ్ మీద పెనం పెట్టి వేడి అయ్యాక కొద్దిగా నూనె రాయాలి. ఒక గరిటె పిండిని తీసుకుని పెనంపై పలుచగా పరచాలి. పైన కొంచెం నెయ్యి వేసి రెండు వైపులా గోధుమ రంగు వచ్చే వరకు క్రిస్పీగా కాల్చుకోవాలి. అంతే.. వేడివేడి బీట్‌రూట్ పనీర్ ప్రోటీన్ దోశ సిద్ధం.

## ఇమ్యూనిటీని పెంచే ఉసిరి తొక్కు..



ఉసిరికాయ మన ఆరోగ్యానికి ఎలాంటి మేలు చేస్తుందో మనం ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. వీటితో ఎక్కువగా పప్పు, పచ్చడి కానీ, తెలియని విషయం ఏంటంటే ఉసిరికాయ తొక్కు కూడా చేస్తారు. అది టేస్టీగా.. కారంగా రుచిగా ఉంటుంది.

కావాల్సిన పదార్థాలు : అర కిలో ఉసిరికాయలు, రుచికి సరిపడినంత ఉప్పు, రెండు టేబుల్ స్పూన్స్ కారం, ఒక టీ స్పూన్ ఆవపొడి, అర టీ స్పూన్ మెంతి పొడి, అర టీ స్పూన్ పసుపు, రెండు టేబుల్ స్పూన్స్ నూనె, తాలింపు గింజలు తీసుకోవాలి. ముందుగా ఉసిరికాయలను తీసుకుని వాటిని కడిగి శుభ్రంగా చేసుకోవాలి. ముఖ్యంగా, కొంచం నీరు లేకుండా వాటిని ఆరబెట్టాలి. ఇక ఇప్పుడు వాటిని తురుముకోవాలి. ఇక ఇప్పుడు దానిలో తురిమిన ఉసిరిని వేసి కొద్దిగా ఉప్పు, అర టీ స్పూన్ పసుపు, రెండు టేబుల్ స్పూన్స్ కారం, అర టీ స్పూన్ ఆవపొడి, అర టీ స్పూన్ మెంతి పొడిని వేసి బాగా కలపాలి. ఇప్పుడు స్టవ్ వెలిగించి పాన్‌లో ఆయిల్ వేడి చేసి, పోపు గింజలు, రెండు ఎండుమిర్చి, కరివేపాకు తాలింపు లాగా వేసుకుని కొంతసేపు చల్లారనివ్వాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని తీసుకుని ఒక సీసాలో పెట్టుకుంటే ఏడాది పాటు ఎప్పుడూ కావాలంటే అప్పుడు తినొచ్చు. మీరు వెంటనే తినాలనుకుంటే రెండు రోజుల తర్వాత వేడి వేడి అన్నంలో తింటే రుచి అద్భుతంగా ఉంటుంది.

## తమలపాకులు: వంద రోగాలు పరార్



ప్రస్తుతం జీవనశైలిలో ఆహారాన్ని టైంకి తినడమే మానేశారు. దీని వలన రక రకాల సమస్యలు వస్తున్నాయి. ఇలాంటి వాటికీ మెడిసిన్స్ వాడటం కన్నా నేచురల్ గానే తగ్గించుకోవచ్చు. వాటిలో ఈ ఆకులు బాగా పని చేస్తాయి. మీరు కూడా వీటిని తిని మీ అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టేయండి. ప్రస్తుతం రోజుల్లో అందరూ ఎవరు పనుల్లో వారు చాలా బిజీగా ఉన్నారు. కొందరికి పని ఒత్తిడి వలన ఫుడ్ సరిగా తినరు. దీని వలన అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. వాటిలో అందరూ ఎదుర్కొంటున్న సమస్య జీర్ణక్రియ పనితీరు మందగించడం. పనిలో పడి ఇంట్లో చేసుకుని తినే సమయం లేక బయట లభించే ఫాస్ట్ ఫుడ్స్ , ఆయిల్ ఫుడ్స్, మొబైల్ ఎక్కువగా వాడటం ఇలాంటి అలవాట్ల వలన జీర్ణవ్యవస్థ పాడయ్యే అవకాశం ఉంది. ఇవి మాత్రమే కాకుండా గ్యాస్, కడుపు నొప్పి, నిద్ర లేమి వంటి సమస్యలు ఈ రోజుల్లో చాలా కామన్ అయిపోయింది. బయట ఫుడ్స్ తినడం వలన కొందరికి విపరీతమైన కడుపునొప్పి వస్తుంది. ఇది ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తోంది. తిన్న ఫుడ్స్ జీర్ణం కాకపోతే శరీరానికి తగిన పోషకాలు సరిగా అందకుండా పోతాయి. దాని వలన ఇతర సమస్యలు కూడా వస్తాయి. ఇంకా నీరసం, వాంతులు వంటి సమస్యలు కూడా వస్తాయి. దీని కోసం మీరు హాస్పిటల్‌కి వెళ్లాల్సిన అవసరం లేదు. మన ఇంటి దగ్గర దొరికే తమలపాకును తింటే చాలు. ఈ సమస్యలకు చెక్ పెట్టొచ్చు. తమలపాకు జ్యూస్ రూపంలో కానీ నమలడం వలన కానీ జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. నిజం చెప్పాలంటే ఇది మంచి మెడిసిన్. తమలపాకును నోటిలోవేసుకున్నప్పుడు లాలాజలం వస్తుంది. ఇది ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడానికి సహాయం చేస్తుంది. ఇప్పటికి ఊర్లలో ఈ ఆకులు కనిపిస్తే చాలు నోట్లో వేసుకుని నములుతూనే ఉంటారు.ఎందుకంటే, దీనిలో సహజ సుగంధ ద్రవ్యాలు అధికంగా ఉంటాయి. ఇవి ఎంతటి నొప్పిని అయినా ఇట్టే తగ్గిస్తాయి. ఇంకా ఇవి వాత సమస్యలకు కూడా చెక్ పెడుతుంది. కాబట్టి, వీటిని ఇప్పటి నుంచి తినడం అలవాటు చేసుకోండి. మొదట్లో చేదుగా ఉన్నా తినగా తినగా మంచి టేస్ట్ వస్తుంది.

# ఒక్క విజయం... ఎన్ని రికార్డులో!

- న్యూజిలాండ్‌పై 96 పరుగుల భారీ విజయంతో టీ20 వరల్డ్ కప్ గెలిచిన భారత్
- టీ20 చరిత్రలో వరుసగా రెండుసార్లు టైటిల్ గెలిచిన తొలి జట్టుగా రికార్డు
- సొంతగడ్డపై వరల్డ్ కప్ గెలిచిన మొదటి ఆతిథ్య దేశంగా టీమిండియా చరిత్ర
- మొత్తం మూడుసార్లు టీ20 ప్రపంచకప్ గెలిచిన ఏకైక జట్టుగా అవతరణ
- టోర్నీ ఆసాంతం అద్భుత ప్రదర్శనతో 8 మ్యాచ్‌లలో 7 విజయాలు నమోదు



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు ఇది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆదివారం జరిగిన ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ పోరులో టీమిండియా అద్భుత విజయాన్ని నమోదు చేసింది. టైటిల్ పోరులో న్యూజిలాండ్‌ను 96 పరుగుల భారీ తేడాతో చిత్తుచేసిన భారత్, విశ్వవిజేతగా నిలిచింది. 2023లో ఇదే మైదానంలో ఎదురైన పరాజయాల తాలూకు చేదు జ్ఞాపకాలను చెరిపేస్తూ, లక్షలాది మంది అభిమానుల సాక్షిగా టీమిండియా విజయకేతనం ఎగురవేసింది. ఈ విజయంతో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం సంబరాలతో మార్మోగిపోయింది. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టు డిఫెండింగ్ ఛాంపియన్‌గానే కాకుండా, ఫేవరెట్‌గా బరిలోకి దిగి అంచనాలను నిజం చేసింది.

ఒకే విజయంతో మూడు రికార్డులు

ఈ ఫైనల్ మ్యాచ్‌లో గెలుపు ద్వారా టీమిండియా ఒకేసారి మూడు అరుదైన మైలురాళ్లను అధిగమించింది.

**1. టైటిల్‌ను నిలబెట్టుకున్న తొలి జట్టు:**

టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఇప్పటివరకు ఏ జట్టూ వరుసగా రెండుసార్లు కప్పు గెలవలేదు. 2024లో ఛాంపియన్‌గా నిలిచిన భారత్, ఇప్పుడు 2026లో కూడా టైటిల్ గెలిచి, టైటిల్‌ను డిఫెండ్ చేసుకున్న తొలి పురుషుల జట్టుగా రికార్డు సృష్టించింది. తద్వారా ఈ ఫార్మాట్‌లో తమకు తిరుగులేదని నిరూపించుకుంది.

**2. సొంతగడ్డపై గెలిచిన తొలి ఆతిథ్య జట్టు:**

టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఉన్న ఓ పెద్ద సెంటిమెంట్‌ను భారత్ బద్దలు కొట్టింది. 2007లో టోర్నీ ప్రారంభమైనప్పటి నుంచి ఏ ఆతిథ్య దేశం కూడా సొంతగడ్డపై కప్పు గెలవలేదు. దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, శ్రీలంక, ఆస్ట్రేలియా వంటి జట్లు ఆతిథ్యం ఇచ్చినా కప్పును ముద్దాడలేకపోయాయి. కానీ 10వ ఎడిషన్‌కు శ్రీలంకతో కలిసి ఆతిథ్యం ఇచ్చిన భారత్, సొంతగడ్డపై కప్పు గెలిచిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించింది.

**3. మూడుసార్లు విశ్వవిజేతగా:**

ఈ విజయంతో టీ20 ఫార్మాట్‌లో అత్యధిక సార్లు వరల్డ్ కప్ గెలిచిన జట్టుగా భారత్ అగ్రస్థానంలో నిలిచింది. 2007లో ధోని సేన తొలి కప్పు గెలవగా, 2024లో రెండోసారి, ఇప్పుడు 2026లో మూడోసారి టైటిల్ సాధించి 'హ్యాట్రిక్' కొట్టింది. వెస్టిండీస్, ఇంగ్లండ్ చెరో రెండుసార్లు గెలవగా, భారత్ మూడు టైటిళ్లతో అందరికంటే ముందుంది.

**జైత్రయాత్ర సాగిందిలా...**

ఈ టోర్నీలో భారత జట్టు ప్రయాణం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. మొత్తం 8 మ్యాచ్‌లలో 7 విజయాలు సాధించి తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించింది. ఫిబ్రవరి 7న ముంబైలోని వాంఖడే స్టేడియంలో అమెరికాపై 29 పరుగుల గెలుపుతో భారత్ తమ వేటను ప్రారంభించింది. అనంతరం ఫిబ్రవరి 12న ఢిల్లీలో నమీబియాను 93 పరుగుల తేడాతో చిత్తు చేసింది. ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 61 పరుగుల భారీ విజయం సాధించి అభిమానులకు పండగ వాతావరణాన్ని తీసుకొచ్చింది. ఆ తర్వాత అహ్మదాబాద్‌లో నెదర్లాండ్స్‌పై 17 పరుగుల తేడాతో గెలిచింది.

అయితే, ఫిబ్రవరి 22న అహ్మదాబాద్‌లోనే దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో భారత్‌కు ఏకైక పరాజయం ఎదురైంది. కానీ ఈ ఓటమి నుంచి వెంటనే తేరుకున్న టీమిండియా, ఫిబ్రవరి 26న చెన్నైలో జింబాబ్వేపై 72 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. మార్చి 1న కోల్‌కతాలో వెస్టిండీస్‌పై 5 వికెట్ల తేడాతో గెలిచి సెమీస్‌కు దూసుకెళ్లింది. ఉత్కంఠభరితంగా సాగిన సెమీఫైనల్ పోరులో ఇంగ్లండ్‌పై 7 పరుగుల తేడాతో గెలిచి ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది.

**అక్టోబర్ 2023 నుంచి తిరుగులేని ఫామ్**

టీమిండియా ఈ టోర్నీకి ముందు నుంచే అద్భుతమైన ఫామ్‌లో ఉంది. అక్టోబర్ 2023 నుంచి ఇప్పటివరకు ఆడిన గత 56 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఏకంగా 48 విజయాలు నమోదు చేయడం విశేషం. వరల్డ్ కప్‌కు ముందు న్యూజిలాండ్‌పై సిరీస్ గెలిచి పూర్తి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగిన భారత్, ఫైనల్ పోరులో అదే జట్టును చిత్తుచేసి విశ్వవిజేతగా అవతరించింది. మూడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా, టీ20 క్రికెట్‌లో ఒక సామ్రాజ్యాన్ని స్థాపించిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.?

## చరిత్ర తిరగరాసిన భారత్.. టీ20 ఫార్మాట్‌లోనే

# తొలి జట్టుగా నయా రికార్డ్




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్–2026 విశ్వవిజేతగా భారత్ నిలిచింది. 2026, మార్చి 8న గుజరాత్?లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచులో న్యూజిలాండ్?ను 96 పరుగుల తేడాతో చిత్తు చేసింది. తొలుత బ్యాటింగ్.. ఆ తర్వాత బౌలింగ్?లో రాణించి ఫైనల్ పోరును ఏకపక్షంగా మార్చి వరుసగా రెండోసారి టీ20 వరల్డ్ కప్ కైవసం చేసుకుంది. ఓవరాల్?గా మూడుసార్లు (2007, 2024, 2026) టీ20 వరల్డ్ కప్?ను టీమిండియా ముద్దాడింది. ఈ విజయంతో టీమిండియా పలు రికార్డులు నమోదు చేసింది. టీ20 వరల్డ్ కప్?కు అతిథ్యం ఇచ్చి టైటిల్ గెలిచిన తొలి జట్టుగా భారత్ చరిత్ర సృష్టించింది. అలాగే.. వరుసగా రెండు సార్లు టీ20 వరల్డ్ కప్ గెలిచిన జట్టుగా కూడా ఇండియా రేర్ ఫీట్ నెలకొల్పింది. గుజరాత్?లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచులో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోర్ చేసింది. సంజు శాంసన్ (89), అభిషేక్ శర్మ (52), ఇషాన్ కిషన్ (54) రాణించారు. చివర్లో శివమ్ దూబే 8 బంతుల్లో 26 రన్స్ చేసి మెరుపు ఫినింగ్ ఇచ్చాడు. న్యూజిలాండ్ బౌలర్లలో నీషమ్ 3 వికెట్లు సాధించాడు. మ్యాట్ హెన్రీ, రచిన్ రవీంద్ర చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం 256 పరుగుల భారీ లక్ష్య ఛేధనకు దిగిన న్యూజిలాండ్ 19 ఓవర్లలో 159 పరుగులకే చాపచుట్టేసింది. ఆది నుంచి భారత బౌలర్లు బెంబేలెత్తించడంతో ఏ దశలోనూ న్యూజిలాండ్ ఛేధన వైపు సాగలేదు. న్యూజిలాండ్ బ్యాటర్లలో ఓపెనర్ సీఫెర్ట్ ఒక్కడే హాఫ్ సెంచరీతో (52) ప్రతిఘటించాడు. కెప్టెన్ మిచెల్ శాంట్నర్ 43 పోరాడాడు. మిలిగిన బ్యాటర్లంతా చేతులేత్తేయడంతో వరల్డ్ కప్?కు అడుగు దూరంలోనే న్యూజిలాండ్ బోల్తా కొట్టింది.

## ఫైనల్ లో భారత్ గెలవలేదన్నారు.. కట్ చేస్తే టీటైల్ కొట్టేసింది..

**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్‌లో టీమిండియా అద్భుత ప్రదర్శనతో ప్రపంచకప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఎన్నో అనుమానాలు, పాత రికార్డులు, అపోహలను పటాపంచలు చేస్తూ భారత్ మరోసారి ప్రపంచ క్రికెట్‌లో తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరగడంతో కొందరు అభిమానులు సందేహాలు వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో భారత్ గెలవలేదని, ఈసారి కూడా అదే జరుగుతుందని పేర్కొన్నారు. అంతేకాదు, అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ఇండియాకు అచ్చిరాదని కూడా అన్నారు. టీ20 వరల్డ్ కప్ చరిత్రలో న్యూజిలాండ్‌పై భారత్ విజయాలు చాలా తక్కువగా ఉన్నాయనే గత రికార్డులను కూడా పలువురు గుర్తు చేశారు. కానీ ఈసారి టీమిండియా ఆ అనుమానాలన్నింటినీ తుడిచిపెట్టింది. బ్యాటింగ్‌లో భారత బ్యాటర్లు దూకుడుగా ఆడి 255 పరుగుల భారీ స్కోర్ చేశారు. అనంతరం బౌలింగ్‌లో క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ప్రత్యర్థి జట్టును ఒత్తిడిలోకి నెట్టారు. ఫీల్డింగ్‌లో కూడా అద్భుతమైన క్యాచులు, ఫీల్డింగ్‌తో మ్యాచ్‌పై భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా ఆల్రౌండ్ షోతో రాణించిన టీమిండియా ఈ విజయంతో మరోసారి విశ్వవిజేతగా అవతరించింది. భారత్ వరుసగా రెండోసారి విశ్వవిజేతగా నిలిచింది. 40 కోట్ల మంది భారతీయుల ఆశలను నిజం చేస్తూ సూర్యకుమార్ యాదవ్ సేన పొట్టికప్పును సొంతం చేసుకుంది. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్ లో 96 పరుగుల తేడాతో

విజయం సాధించింది. అయితే టీమిండియా ఇప్పటి వరకు మహేంద్ర సింగ్ ధోని సారథ్యంలో 2007లో టీ20 వరల్డ్ కప్ ని తొలిసారి గెలవగా.. అనంతరం 2024లో రోహిత్ శర్మ ఆధ్వర్యంలో రెండోసారి సొంతం చేసుకోగా.. 2026లో సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో భారత జట్టు మూడోసారి విశ్వవిజేతనగా అవతరించింది.



అనసూయ భరద్వాజ్ వైబింగ్ హైపై దృష్టి సారించింది

# 'ఉస్తాద్' సర్ప్రైజ్ టీజ్.. పెర్ఫెక్ట్ కమర్షియల్ బొమ్మలా ఉందే!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఉస్తాద్ భగత్ సింగ్ నుంచి తాజాగా విడుదలైన సర్ప్రైజ్ గ్లింప్స్.. అందరినీ ఆకట్టుకుంటోంది. స్టార్ డైరెక్టర్ హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న ఆ కమర్షియల్ ఎంటర్టైనర్ ఉగాది కానుకగా మార్చి 19వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో మేకర్స్ ట్రైలర్ కు ముందు చిన్న వీడియోను విడుదల చేసి సినిమాపై మరింత ఆసక్తి పెంచారు.

ట్రైలర్ టీజ్ పేరుతో విడుదలైన ఆ గ్లింప్స్ లో పవన్ కళ్యాణ్ మాస్ స్టైల్‌లో కనిపిస్తూ అభిమానులను అలరిస్తున్నారు. బ్యాక్ గ్రౌండ్‌లో భగవద్గీత శ్లోకాలు వినిపిస్తుండగా పవన్ చెప్పిన డైలాగ్ అభిమానులకు ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. "ఇందాక విన్నది భగవద్గీత.. ఇది భగత్ గీత.. దమ్మున్నోడు దాటొచ్చు" అంటూ ఆయన చెప్పిన డైలాగ్ సోషల్ మీడియాలో ఫుల్ గా ఫ్యాన్స్ వైరల్ చేస్తున్నారు.సుమారు 43 సెకన్ల నిడివి ఉన్న ఉస్తాద్ భగత్ సింగ్ టీజ్‌లో పవన్ కళ్యాణ్ ను పలు లుక్స్ లో చూపించారు మేకర్స్. ముఖ్యంగా పోలీస్ ఆఫీసర్ గెటప్ లో ఆయన కనిపించడం ఆకట్టుకుంటోంది. లుంగీతో మాస్ స్టైల్, కౌబాయ్ క్యాప్ తో మరో స్టైలిష్ లుక్ లో కనిపిస్తూ ఆయన ఆకర్షించారు. యాక్షన్ సన్నివేశాలు సినిమాలో ఎక్కువ ఉండనున్నాయని మేకర్స్ హింట్ ఇచ్చారు.సినిమా పెర్ఫెక్ట్ కమర్షియల్ ఎంటర్టైనర్ గా రూపొందుతున్నట్లు టీజ్ చూస్తే క్లియర్ గా తెలుస్తోంది. హరీష్ శంకర్ తన స్టైల్ కు తగ్గట్లుగా పంచ్ డైలాగులు, మాస్ ఎలిమెంట్స్ తో సినిమాను తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది.




గతంలో పవన్ కళ్యాణ్ తో చేసిన గబ్బర్ సింగ్ విజయాన్ని గుర్తు చేసేలా.. మరోసారి అభిమానులను అలరించే విధంగా చిత్రం ఉండనుందని అర్థమవుతోంది. పవన్ కళ్యాణ్ స్టైలిష్ స్క్రీన్ ప్రెజెన్స్, కమాండింగ్ బాడీ లాంగ్వేజ్, మాస్ డైలాగులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. మొత్తానికి చిన్న గ్లింప్స్ తో మేకర్స్ సినిమాపై అంచనాలు పెంచేశారని చెప్పాలి. ఇది కేవలం చిన్న గ్లింప్స్ మాత్రమేనని, త్వరలో విడుదలయ్యే ట్రైలర్ తో మరిన్ని హోప్స్ పెరుగుతాయని మేకర్స్ చెబుతున్నారు.ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకోగా.. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. విడుదల తేదీ ముందుకు రావడంతో చిత్రబృందం పనులను వేగవంతం చేసింది. తాజాగా పవన్ కళ్యాణ్ డబ్బింగ్ ప్రారంభించారు. ట్రైలర్ టీజ్ కోసం ప్రత్యేకంగా ఆయనతో డబ్బింగ్ చెప్పించినట్లు తెలుస్తోంది. దేవిశ్రీప్రసాద్ పాటలు అందించగా, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ కోసం తమన్ రంగంలోకి దిగారు..

తాజాగా విడుదలైన టీజ్ లో తమన్ ఇచ్చిన బీజీఎం వినిపించింది. టైటిల్ కార్డ్ లో తమన్ స్కోర్ అని ప్రత్యేకంగా ప్రస్తావించారు. చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. పార్థిబన్, కేఎస్ రవికుమార్, రావు రమేష్, రాంకీ, కేజీఎఫ్ అవినాష్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, రవి శంకర్ యలమంచిలి నిర్మిస్తున్నారు.



సౌత్ స్టార్ కేథరిన్ త్రెసా స్టైలిష్ ఫోటోషూట్‌తో తలదాచుకుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965